నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

visit us @ http://epaper.suryaa.com

సంపుటి 12 | సంచిక 81

ఆదివారం | 20 జనవరి 2019 | విజయవాడ | పేజీలు 12+16+16 | వెల: రూ. 8.00

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

అనుగ్రహం

శ్రీ విళంబి నామ సంవత్సరం, ఉత్తరాయనం, హేమంత రుతువు, పుష్యమాసం, శుక్ల పక్ష తిథి : చతుర్దశి మ.1.56 నక్షత్రం. ఆరుద్ర ఉ.7.45, పునర్వసు తె.5.40, వర్జ్యం సా.6.10 నుంచి 7.44 వరకు
రాహుకాలం: సా.4.30 నుంచి 6.00 వరకు, దుర్ముహూర్తం: సా.4.25 నుంచి 5.13 వరకు సూర్యోదయం : ఉ.6.38 గం; సూర్యాస్తమయం: సా.5.50

విపక్షం విశ్వరూపం

కోల్‌కతాలో బీజేపీపై సమరశంఖం పూరించిన విపక్షాలు



వివరాలు 11 పేజీలో



- భారీ ర్యాలీతో కిటకిటలాడిన బ్రిగేడ్ పెరేడ్ మైదానం
- సత్తా చాటిన ప్రతిపక్ష నాయకులు
- కాషాయ పార్టీకి గడువు ముగిసిపోయిందన్న మమత
- విభజించి పాలిస్తోందని మండిపడ్డ చంద్రబాబు
- తదుపరి ర్యాలీ అమరావతిలో నిర్వహిస్తామని వెల్లడి
- నియంతృత్వ వైఖరి ప్రదర్శిస్తోందని కుమారస్వామి విమర్శ
- చిన్నాభిన్నం చేయాలని మోడీ ప్రయత్నిస్తున్నారన్న యశ్వంత సిన్హా
- దొంగలకు వ్యతిరేకంగా పోరాడుతున్నామని హార్దిక్ పటేల్ వ్యాఖ్య
- తుగ్లక్‌లా ఆదేశాలు జారీ చేస్తున్నారని ధ్వజమెత్తిన శత్రుఘ్న సిన్హా

కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వానికి వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఏర్పాటుచేసిన యునైటెడ్ ఇండియా ర్యాలీ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి హెచ్చరిక సంకేతాలు పంపింది. ఏం చేసినా చూస్తూ ఊరుకుంటామని అనుకోవద్దని తేల్చి చెప్పింది. ఈ ర్యాలీ ప్రధానంగా భారతీయ జనతా పార్టీనీ, నరేంద్ర మోడీని లక్ష్యంగా చేసుకుని సాగింది. 20మందికి పైగా జాతీయ స్థాయి ప్రతిపక్ష నాయకులు ఇందులో పాల్గొన్నారు. బీజేపీ వ్యతిరేక పార్టీలనన్నింటినీ ఏకం చేసేందుకు ఈ ర్యాలీని ఏర్పాటుచేశారు. మాజీ ప్రధాని హెచ్‌డి దేవెగౌడ, కర్ణాటక, ఆంధ్ర ప్రదేశ్, ఢిల్లీ ముఖ్యమంత్రులు హెచ్‌డి కుమార స్వామి, ఎన్ చంద్రబాబు నాయుడు, ఎమ్.కె. స్టాలిన్, అఖిలేశ్ యాదవ్, తేజస్వి యాదవ్, శరద్ పవార్, శరద్ యాదవ్, ఒమర్ అబ్దుల్లా, ఫరూఖ్ అబ్దుల్లా, సతీష్ చంద్ర మిశ్రా, అజిత్ సింగ్, జయంత చౌధురి, మల్లికార్జున ఖర్గే, అభిషేక్ మను సింఘ్వి, శత్రుఘ్న సిన్హా, అరుణ్ శౌరి, యశ్వంత్ సిన్హా, గెగాంగ్ అపాంగ్, హేమంత్ సోరెన్, బాబూలాల్ మరాండీ, హార్దిక్ పటేల్, జిగ్నేశ్ మేవానీ, తదితరులు ఇందులో పాల్గొన్నారు.

ఉనికిని కాపాడుకునేందుకే : మోడీ



- మేము మాత్రమే దేశ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నాం
- ఇదే నాకు విపక్ష పార్టీలకు ఉన్న తేడా
- విపక్షాలు ఇలాంటి ర్యాలీలతో వార్తల్లోకెక్కవచ్చు
- ప్రజల హృదయాలను మాత్రం గెలవలేవు
- వారు ఏకతాటిపైకి రాకముందే ఎన్నికల్లో సీట్ల గురించి చర్చలు
- విపక్షాల ఐక్య ర్యాలీపై మోడీ విమర్శలు


6లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

రైతుబంధు బాటలో మోడీ, బాబు!

తెలంగాణలో ఫలితాలు చూసి మొగ్గు చూపుతున్న నేతలు





- అందరూ కేసీఆర్ బాటలోనే?
- రైతన్నకు పెట్టుబడి సాయానికై కేంద్రంలోనూ, ఏపీలోనూ కసరత్తు
- ఈ పథకమే తమను గట్టెక్కిస్తుందని మోడీ, బాబు విశ్వాసం
- కేసీఆర్‌కు రెండోసారి పట్టం కట్టింది రైతుబంధువేనని విశ్వాసం
- రెండోసారి తామూ రావాలంటే రైతుబంధువే దిక్కని మోడీ, బాబు భావన
- పథకాల పేర్లు మారినా కేసీఆర్ రైతుబంధే ఆదర్శం
- కొత్త పథకాల రూపకల్పనలో కేంద్రం, ఏపీ బిజీ?
- కౌలు రైతులకు అమలయ్యేలా యోచన
- విధివిధానాలపై అధికారుల కసరత్తు
- ఏపీలో చంద్రబాబు కేంద్రంలో నరేంద్ర మోడీ చేయూత అందించేందుకు అంతా రెడీ
- 21న ఏపీ కేబినెట్ సమావేశంలో గ్రీన్ సిగ్నల్?

(అమరావతి, సూర్య ప్రధాన ప్రతినిధి) : దేశసార్వత్రిక ఎన్నికలతోపాటు ఏపీ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్రాలలో అధికారంలోనున్న అధికార పార్టీలు తిరిగి అధికారం కైవసం చేసుకొనేందుకు రైతుబంధు పథకానే నమ్ముకొంటున్నాయా? అంటే అవుననే చెప్పవచ్చు. త్వరలో ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో కేంద్రంతోపాటు ఏపీలోనూ బాబు ప్రభుత్వం తిరిగి రెండోసారి అధికారం నిలబెట్టుకొనేందుకు వ్యూహ రచనలు చేస్తున్నాయి. దేశవ్యాప్త దృష్టిని తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు



ఆకర్షించిన విషయం తెలిసిందే. తెలంగాణ రాష్ట్రంలో రెండోసారి అధికారంలోకి వచ్చేందుకు టీఆర్ఎస్ ఉపయోగించిన రైతు బంధు అస్త్రాన్ని తాము కూడా ప్రయోగించాలని కేంద్రంతోపాటు ఏపీ రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. పథకాల పేర్లు మార్చినా కేసీఆర్ ప్రభుత్వం అమలుచేసిన రైతుబంధు తరహాలోనే రైతులను ఆదుకొనే పథకాల రూపకల్పనకు కేంద్రంతోపాటు ఏపీ సర్కార్ కసరత్తుచేస్తోంది. కేంద్ర, రాష్ట్ర సర్కార్లు చేస్తున్న ఈ కసరత్తు తుది దశకు చేరుకొంది. రైతు బంధు

మిగతా 6లో



మోడీ ప్రభుత్వంలో తుగ్లక్ ఆదేశాలొస్తున్నాయి!

- నోట్ల రద్దు వల్ల సామాన్య ప్రజలకు ఏం మేలు జరిగింది?
- నోట్ల రద్దుతో రైతులు, దినసరి కూలీలు, సామాన్యులపై తీవ్ర ప్రభావం
- రాఫెల్ కుంభకోణం వ్యవహారాన్ని ఎందుకు దాస్తున్నారు?
- బీజేపీ ఎంపీ శత్రుఘ్నసిన్హా విమర్శలు
- శత్రుఘ్న సిన్హా అవకాశవాది: బీజేపీ

వివరాలు 6లో

అంతే ఇంతే!



ఇక విపక్షాలపై యుద్ధానికి సిద్ధం అయ్యారా సార్

ఫెడరల్ ఫ్రంట్ హుళక్కే

- మోడీకి మద్దతుగానే ఏర్పాటు చేస్తున్నారన్న సిఎం
- టీఆర్ఎస్ ఆంధ్రా ద్వేషంపై ప్రచారం చేయండి
- కర్నాటకలో బీజేపీ దుర్మార్గపు రాజకీయాలు
- వరంగల్‌లో రాళ్లేసిన వాళ్లతో జగన్ లాలూచీ
- రానున్న ఎన్నికల్లో టీడీపీ చరిత్రాత్మక విజయం
- 150 అసెంబ్లీ స్థానాల్లో విజయమే లక్ష్యం
- ప్రతి కార్యకర్త మొబైల్ మీడియాగా మారాలి
- టెలి కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు



(అమరావతి-'సూర్య' ప్రత్యేక ప్రతినిధి) : ఫెడరల్ ఫ్రంట్ అసలు లేదని, అదొక శూన్యం మాత్రమేనని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్ర మోడీకి మద్దతు కోసమే ఫెడర్ ఫ్రంట్ ఏర్పాటు చేశారని చంద్రబాబు అన్నారు. అది బీజేపీకి ప్రతిపక్షమే కాదని విమర్శించారు. రాష్ట్రంపై టీఆర్ఎస్ నేతల

మిగతా 6లో

ప్రపంచ ఆర్థిక వేదికపై సన్‌రైజ్ స్టేట్



- ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సమావేశాలకు హాజరు
- 21న దావోస్ పర్యటనకు మంత్రి నారా లోకేష్
- ఆంధ్రప్రదేశ్ ప్రతినిధి బృందానికి నాయకత్వం
- ప్రముఖ కంపెనీ ప్రతినిధులతో భేటీ
- ఏపీకి మరిన్ని పెట్టుబడులు తేవడమే లక్ష్యంగా పర్యటన
- 22 నుంచి 24 వరకు దావోస్ పర్యటన

8లో

త్వరలో ట్రంప్, కిమ్ భేటీ



- ఉత్తర కొరియా అణు కార్యక్రమం, క్షిపణి కార్యక్రమాల విధ్వంసంపై చర్చలు
- వెల్లడించిన అమెరికా అధ్యక్ష కార్యాలయం
- అణ్వాయుధ కార్యక్రమాన్ని ఇంకా రద్దు చేయని ఉత్తర కొరియా
- శిఖరాగ్ర సమావేశం జరగాల్సిన స్థలాన్ని వెల్లడించని వైట్ హౌస్

వివరాలు 6లో

పండగ కానుకగా ప్రభుత్వం మరోసారి సాయం

(అమరావతి సూర్య ప్రత్యేక ప్రతినిధి) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల మహిళలకు మరోసారి ప్రకటించాలని యోచిస్తోంది. 'పసుపు కుంకుమ' కింద పెట్టుబడి నిధిగా ద్వాక్రా మహిళలకు ఇప్పటికే రూ.10వేల చొప్పున చెల్లించగా 'సంక్రాంతి కానుకగా మరో దఫా అంతే మొత్తాన్ని, అదికూడా ఒకే విడతలో చెల్లించాలని భావిస్తున్నట్లు తెలిసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ద్వాక్రా సంఘాలను తన మానస పుత్రికలుగా అభివర్ణిస్తుంటారు. వాటికి మొదటి నుంచీ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇప్పటికే ఒక్కో గ్రామంలో ప్రతి 30 కుటుంబాలకు ఒకరిని చొప్పున సాధికార మిత్రను ద్వాక్రా సంఘాల నుంచి ఎంపిక చేశారు. ఆ 30 కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి కుటుంబానికి నెలకు కనీస ఆదాయం రూ.10వేలు ఉండాలని లక్ష్యంగా పెట్టుకున్న రాష్ట్ర ప్రభుత్వం... ద్వాక్రా మహిళల ద్వారానే ఈ ఆర్థిక సాధికారత లభిస్తుందని నమ్ముతోంది. అందుకు అనుగుణంగా అనేక పథకాల లబ్ధిదారులుగా మహిళలనే ఎంపిక చేస్తోంది. మేనిఫెస్టో అమలులో భాగంగా : ద్వాక్రా సంఘాలకు రుణాలను రద్దు చేస్తామని ఎన్నికల సమయంలో టీడీపీ హామీ ఇచ్చింది. దీనివల్ల అప్పు తీసుకుని ఇంకా చెల్లించని వారికే లబ్ధి చేకూరుతుందని, కష్టపడి రుణం తీర్చిన వారికి నష్టం జరుగుతుందని భావించారు. ప్రతి ద్వాక్రా మహిళకు ప్రయోజనం అందేలా నిపుణులతో చర్చించి రూపకల్పన చేసిన పథకమే 'పెట్టుబడి నిధి'! దీనికే 'పసుపు కుంకుమ' పేరిట ప్రతి ద్వాక్రా మహిళకు రూ.10వేల చొప్పున అందించారు. 86 లక్షల మందికి, మూడు విడతల్లో రూ.8600 కోట్లు జమ చేశారు.



కేసీఆర్‌తో జోడీ
జగన్‌కు బలమా, బలహీనతా!

- లాభ నష్టాలపై బేరీజు వేస్తున్న నేతలు
- సొంత పార్టీలోనే వినిపిస్తున్న నిరసన గళం
- ఏపీలో రిటర్న్ గిఫ్ట్‌లపై జోరుగా చర్చ
- వైసీపీకి టీఆర్ఎస్ ప్రచారం చేయనుందా ?
- రాజకీయంగా బాబుకు మేలు చేసేందుకేనా
- టీఆర్ఎస్‌తో స్నేహంపై వైసీపీ నేతల్లో గుబులు

వెలగపూడి, సూర్య ప్రధాన ప్రతినిధి : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రతిపక్ష నేత జగన్ టీఆర్ఎస్‌తో జతకట్టడంపై విభిన్న వాదనలు వినిపిస్తున్నాయి. కేసీఆర్‌తో జోడీ వల్ల జగన్‌కు లాభం చేకూరుతుందా ? నష్టం వాటిల్లుతుందా ? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సమయంలో జగన్ వ్యవహారశైలిని సొంత పార్టీ నేతలే తప్పు పడుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు రిటర్న్‌గిఫ్ట్ ఇస్తామని గతంలో ప్రకటించిన నేపథ్యంలో తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా మూడు రిటర్న్‌గిఫ్ట్‌లు రెడీగా ఉన్నాయని చేసిన వ్యాఖ్యలపై జోరుగా చర్చ సాగుతోంది. టీఆర్ఎస్ నాయకులు వైసీపీకి ప్రచారం చేయడం ద్వారా రాజకీయంగా



చంద్రబాబు మేలు చేకూరుతుందని టీడీపీ నేతలు సంబరపడుతున్నారు. ఏపీ రాజకీయాల్లో కేసీఆర్ వేలుపెడతామని గత ఎన్నికల సందర్భంగా చేసిన ప్రకటనను వారు స్వాగతిస్తున్నారు. వైసీపీకి మద్దతు ప్రకటించడం ద్వారా ఏపీలో లాభపడేది ఎవరు ? నష్టపోయేదెవర్న ? విషయంపై చర్చలు జరుగుతున్నాయి. కేసీఆర్ కాంగ్రెస్, బీజేపీయేతర ఫెడరల్ ఫ్రంట్ గురించి వైసీపీతో చర్చించేందుకు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు ఇతరనేతలు లోటస్‌పాండ్‌లోని జగన్ నివాసంలో భేటీకావడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గులాబీ పార్టీ ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో అడుగుపెట్టడం ఖాయమన్న వాదనలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. గతంలో తెలంగాణలో జగన్ పర్యటనను అడ్డుకున్న టీఆర్ఎస్ ప్రస్తుతం అదే జగన్‌తో చర్చలు జరపడాన్ని వైసీపీ నేతలు కూడా జీర్ణించుకోలేకున్నారు. గత తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ భాగస్వామ్యంతో ఏర్పడిన కూటమికి ఓటు వేస్తే పాలన అంతా అమరావతి నుంచే సాగుతుందని, ప్రతి నిర్ణయం చంద్రబాబు ఆమోద ముద్రతోనే తీసుకుంటారని, మళ్లీ ఏపీ పాలకుల చేతిలోకి తెలంగాణ రాష్ట్రాన్ని పెడతామా ? అని టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కాంగ్రెస్–టీడీపీ పొత్తుపై ప్రజలను ప్రశ్నించడంతో ప్రజాకూటమిపై ఆ ప్రభావం కనిపించింది. ఇదే ఫార్ములాను టీడీపీ ఆంధ్రప్రదేశ్‌లో అనుసరిస్తే వైసీపీకి రాజకీయంగా ఎంతో నష్టం చేకూరుతుందని ఆ పార్టీ నేతలు లోలోన మదనపడుతున్నారు. రాష్ట్ర విభజనకు కారణమైన, ఏపీకి ప్రత్యేక హోదా పట్ల విముఖంగా ఉన్న టీఆర్ఎస్‌తో కలిసి జగన్ అడుగులు వేయడాన్ని ఓటర్లు సమర్థిస్తారా అన్న ప్రశ్న కూడా ఉత్పన్నమవుతోంది. దీనిని టీడీపీ ప్రచారం చేస్తే వైసీపీకి ఓటు వేయాలని భావిస్తున్న కొందరు తటస్థ ఓటర్లు కూడా తమ ఆలోచనను మార్చుకునే అవకాశం ఉందని రాజకీయ నిపుణులు అంచనా వేస్తున్నారు. టీఆర్ఎస్ ఏపీ పొలిటికల్ ఎంట్రీ రాజకీయంగా తమకే కలిసి వస్తుందని టీడీపీ నాయకులు సంబరపడుతున్నారు. అయితే వైసీపీ నేతలు కూడా టీఆర్ఎస్ మద్దతును తమకు అనుకూలంగా మార్చుకునేందుకు ప్రణాళికలను రచిస్తోంది. ఇలా టీఆర్ఎస్ తమతో చేసే దోస్తీతో ఎన్నికల్లో లాభం చేకూర్చుకోవాలని వైసీపీ భావిస్తోంది. టీఆర్ఎస్ ఏపీ రాజకీయాల్లో జోక్యం చేసుకోవడాన్ని ప్రజలు ఆమోదించే అవకాశం లేదని టీడీపీ నేతలు చెబుతున్నారు. ఇక టీఆర్ఎస్‌తో స్నేహంపై వైసీపీ నేతల్లో ఇప్పటికే అంతర్గతంగా గుబులు మొదలైంది. ఆంధ్రప్రదేశ్‌పై నిత్యం ద్వేషం వెళ్లగక్కే పార్టీతో జగన్ చేయి కలపడంపై ఆందోళన, అసంతృప్తి వ్యక్తమవుతోంది. తెలంగాణలో కాంగ్రెస్‌కు పట్టిన గతి వైసీపీకి ఇక్కడ



పడుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఓవైపు విభజన హామీలు నెరవేరలేదని, మరోవైపు ఆస్తుల పంపకాలు, బకాయిల చెల్లింపు వంటి అంశాల్లో రెండు రాష్ట్రాల మధ్య విబేధాలు ఉన్నాయని, ఈ సమయంలో టీఆర్ఎస్‌తో స్నేహం చేయడం ఆత్మహత్యా సదృశమేనని అభిప్రాయపడుతున్నారు. పొరుగు రాష్ట్రాభివృద్ధికి నిరంతరం అడ్డుపడుతున్న కేసీఆర్‌తో స్నేహం చేసినా, తమ పార్టీకి మద్దతుగా ఎన్నికల్లో ప్రచారం చేసినా ప్రజలంతా ప్రత్యర్థి పార్టీల వైపు మొగ్గు చూపడం ఖాయమని అంటున్నారు. ఇప్పటివరకు విజయంపై అంతో ఇంతో ఆశ ఉండేదని, టీఆర్ఎస్‌తో కలిస్తే కష్టమని వైసీపీ నేతలు ఆందోళన చెందుతున్నారు. తమ పార్టీ అధినేత ఎందుకు టీఆర్ఎస్‌తో దోస్తీకి సన్నద్ధమయ్యారో అర్థం కావడంలేదని ఆ పార్టీ నేతలు అంటున్నారు. టీఆర్ఎస్‌తో స్నేహం వల్ల ఇటీవల తెలంగాణలో జరిగిన ఎన్నికల్లో టీడీపీతో పొత్తు వల్ల కాంగ్రెస్ పార్టీకి జరిగిన నష్టమే తమ పార్టీకి జరగడం తథ్యమని తమ పార్టీ అధినేత జగన్‌కు కూడా తెలుసని చెబుతున్నారు. అయితే ఏపీలో కేసీఆర్ పోటీ చేసే అవకాశం లేకున్నా ఆయన ఎంత తక్కువగా ఏపీకి వస్తే అంతమంచిదని, ఇక్కడి వ్యవహారాల్లో వేలుపెడితే తెలంగాణలో చంద్రబాబునాయుడుకు ఎదురైన చేదు అనుభవమే కేసీఆర్‌కు ఎదురవుతుందని రాజకీయ నిపుణులు అంచనా వేస్తున్నారు. సంక్రాంతి పండుగ తరువాత ముందుగానే అభ్యర్థులను ప్రకటించాలని నిర్ణయం తీసుకున్న టీడీపీ, వైసీపీ కూడా వాయిదా వేసుకుని ఎన్నికల కార్యాచరణపై దృష్టి సారించాయి.

నవ్యాంధ్రలో కాంగ్రెస్‌తో
టీడీపీ పొత్తు కుదిరేనా?




(అమరావతి సూర్య ప్రధాన ప్రతినిధి) : ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్, టీడీపీ పొత్తు పెట్టు కునే అవకాశాలు కన్పించడంలేదు. తెలంగాణలో కలిసి పోటీ చేసిన ఇక్కడ మాత్రం సయోధ్య వున్నట్లు కనిపించడంలేదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రాహుల్‌గాంధీ ఈ మేరకు తమ పార్టీల నేతలకు స్పష్టమైన సంకేతాలు ఇస్తున్నారు. రాష్ట్రాల్లో విడిగా పోటీ చేసినా దేశ ప్రయోజనాల కోసం కేంద్రంలో బీజేపీకు వ్యతిరేకంగా కలిసి నడవాలని నిర్ణయానికి వచ్చారు. కేంద్రం రాష్ట్రానికి అన్యాయం చేసిందంటూ ఎన్డీయే నుంచి వైదొలిగిన టీడీపీ, ప్రత్యేక హోదాపై కాంగ్రెస్ నుంచి స్పష్టమైన హామీ రావడంతో ఆ పార్టీకి దగ్గరైంది. కర్ణాటక ఎన్నికల ఫలితాల తర్వాత ఏర్పడిన ఈ బంధం క్రమంగా బీజేపీయేతర కూటమి దిశగా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలోనే తెలంగాణలోనూ జతకలిశాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత కూటమి బలోపేతం దిశగా రాహుల్‌గాంధీ, చంద్రబాబు పలుమార్లు సమావేశమయ్యారు. ఈ పరిస్థితుల్లో రెండు పార్టీలు కలిసి పోటీ చేస్తాయన్న భావన ఇరుపార్టీల శ్రేణుల్లో నెలకొంది. ఈ ఊహాగానాలకు తెరదించుతూ ప్రజల మనోభావాలకు తగట్లే రాష్ట్రంలో కాంగ్రెస్‌తో పొత్తుపై నిర్ణయం తీసుకుంటామని చంద్రబాబు వెల్లడించారు. రాష్ట్రస్థాయిలో పొత్తులు లేకున్నా ఏపీ ప్రయోజనాల దష్ట్యా కేంద్రంలో బీజేపీయేతర కూటమికి అన్ని పార్టీలు మద్దతు పలకాలన్నారు. రాహుల్‌గాంధీ కూడా రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు స్పష్టత ఇచ్చినట్లు తెలుస్తోంది. ఢిల్లీ పర్యటనలో రాహుల్‌గాంధీతో సమావేశమైన చంద్రబాబు ప్రతిపక్షాల ఐక్యతపై ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తోంది.

జగన్‌కు ముసుగు రాజకీయాలు రావు



నూజివీడు, మేజర్‌న్యూస్: ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు మాదిరిగా ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ముసుగు రాజకీయాలు రావని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మేకాప్రతాప్ అప్పారావు వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రయోజనాలకోస వైఎస్ జగన్ టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ల మధ్య చర్చలు జరిగాయన్నారు. ఇరువురు నేతల మధ్య జరిగిన చర్చలను ప్రజలు స్వాగతిస్తున్నారని తెలిపారు. శనివారం నూజివీడు వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకొని ఎన్టీఆర్ ఆశయాలను చంద్రబాబు దెబ్బతీశారని ఆరోపించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకొని ఎన్నికలకు రావాలని భావిస్తున్నారని అన్నారు. ఈ పరిణామాలపై ప్రజలు సరైన తీర్పు ఇస్తారని నూజివీడు ఎమ్మెల్యే జోస్యం చెప్పారు.

గగ్గోలుకు ఎల్లో మీడియా సిద్ధం



హైదరాబాద్, మేజర్‌న్యూస్ః ప్రజలకు అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో జగన్ అమరావతి ప్రాంతంలో ఇల్లు కట్టుకుంటున్నారని వైసీపీ నేత విజయసాయి రెడ్డి తెలిపారు. కానీ జగన్ ఇంటిపై గగ్గోలు పెట్టేందుకు యెల్లో మీడియా సిద్ధమైపోయిందని విమర్శించారు. సీఎంగా ఉన్న చంద్రబాబు ఇప్పటివరకు అమరావతిలో ఇల్లు ఎందుకు కట్టుకోలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు అడ్డంగా సంపాదించిన డబ్బుతో హైదరాబాద్‌లో కట్టుకున్న ఇంద్ర భవనం గురించి ఎల్లో మీడియా పట్టించుకోదని ఆయన దుయ్యబట్టారు. ఈ మేరకు విజయసాయిరెడ్డి సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ట్విట్టర్ లో స్పందించారు. జగన్‌పై దాడి కేసు విచారణను జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) స్వీకరించినప్పటి నుంచి చంద్రబాబుకు గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని విజయసాయిరెడ్డి ఎద్దేవా చేశారు. 13 జిల్లాల చిన్న రాష్ట్రాన్ని పాలించలేకపోతున్న చంద్రబాబు తాను స్వతంత్ర రాజ్యానికి చక్రవర్తిలా ఫీలవుతున్నారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఏపీ ప్రజలు బాబును సాగనంపేందుకు పోలింగ్ తేదీ కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ తన మకాంను అమరావతికి సమీపంలోని తాడేపల్లికి మారుస్తున్నారు. ఫిబ్రవరి 14న జగన్ గృహప్రవేశం చేయనున్నారనీ, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హాజరు అవుతారని వార్తలు వస్తున్నాయి.

ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్నికలు

- ఆచితూచి అడుగులేస్తున్న చంద్రబాబు
- 8 శాసన మండలి స్థానాలకు ఎన్నికలు
- అభ్యర్థుల కసరత్తు ప్రారంభం

(అమరావతి సూర్య ప్రధాన ప్రతినిధి) : ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని రాజకీయ పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఈ ఎన్నికలు ముందే జరుగుతాయి కాబట్టి వీటి ప్రభావం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై చూపే అవకాశం వుంటుంది. అధికార, ప్రతిపక్షాలు ఆచితూచి అడుగులేస్తున్నాయి. ముఖ్యంగా పరోక్ష పద్ధతితో చట్టసభలకు ఎన్నికవ్వాలని భావించే రాజకీయ నాయకులు కసరత్తు ప్రారంభించారు. దాదావు 8 శాసనమండలి స్థానాలకు ఎన్నికలు రానున్నాయి. ఈ ఎనిమిదింటిలో ఐదు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ కాగా ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలు చెరొకటీ ఉన్నాయి. ఇటీవలే అమెరికాలో రోడ్డు ప్రమాదంలో మతి చెందిన ఎంవీఎస్.మూర్తి ప్రాతినిధ్యం వహించిన స్థానిక సంస్థల కోటా నుంచి మరొకదానికి ఎన్నికలు జరగనున్నాయి. అయితే ఎమ్మెల్సీగా అవకాశాలు ఉన్నవి 8 స్థానాలే అయినా అధికార టీడీపీలో పోటీ పడుతున్న వారి సంఖ్య లెక్కకు మిక్కిలి ఉంది. పై పెచ్చు ఈ 8 స్థానాల్లో 5 ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల విషయానికి వస్తే ప్రతిపక్ష వైఎస్ఆర్సీపీకి ఉన్న శాసనసభ్యుల బలాన్ని బట్టి వీటిలో ఒకటి ఆ పార్టీకి పోతుంది. ఇక మిగిలేవి నాలుగు. ఎంవీఎస్.మూర్తి మరణంతో ఖాళీ అయిన విశాఖజిల్లా స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యే వారి కాలపరిమితి మూడేళ్లే ఉంటుంది. అది కూడా విశాఖజిల్లా వాసులకే కేటాయించాలి. ఇక సార్వత్రిక ఎన్నికలకు ముందు లేనిపోని ప్రయోగాలు చేసి విఫలమైతే ఆ ప్రభావం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ఉంటుందనే ఆలోచనతో పట్టభద్రులు, ఉపాధ్యాయుల శాసనమండలి నియోజకవర్గాలకు ఎన్నికలు జరిగే ఆ ఎన్నికల్లో పోటీ చేయకూడదని తెలుగుదేశం పార్టీ విధానపరమైన నిర్ణయం తీసుకుంది. దీంతో ఉన్న 8 శాసనమండలి స్థానాల్లో టీడీపీకి దక్కేవి 5 మాత్రమే. ఈ ఐదు స్థానాలతో పార్టీలో ఎంత మందిని తప్తి పరచాలో అర్థం కాక టీడీపీ అధిష్టానం తలపట్టుకుంటోంది. పైగా సార్వత్రిక ఎన్నికల ముందు ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు రావడంతో ఎవరికి అవకాశం ఇవ్వకపోతే ఎవరు హర్టవుతారో అనే ఆందోళనలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఉన్నారు. అధిష్టానం ఆలోచనలు ఎలా ఉన్నా త్వరలో అవకాశం రానున్న శాసన మండలి సభ్యత్వాలను ఎలాగైనా పొందాలని తెలుగు తమ్ముళ్లు తహతహలాడిపోతున్నారు. ఆశావాహులు ఇప్పటి నుంచే చంద్రబాబు, ఆయన కుమారుడు, టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి అయిన నారా లోకేష్ పేషీల చుట్టూ ప్రదక్షిణలు మొదలు పెట్టేశారు. వచ్చే మార్చి నెలలో తెలుగుదేశం పార్టీకి చెందిన ఐదుగురు శాసనమండలి సభ్యులు పదవీ విరమణ చేయనున్నారు. వీరితో మంత్రులు యనమల రామకష్ణుడు, పొంగూరి నారాయణలతో పాటు పి.శమంతకమణి, వైఎస్ఆర్సీపీ నుంచి టీడీపీలో చేరిన ఆదిరెడ్డి అప్పారావు, కాంగ్రెస్ పార్టీ నుంచి టీడీపీలో చేరిన అంగూరి లక్ష్మీశివకుమారిలు ఉన్నారు. వీరిలో మంత్రులిద్దరికీ వారి ఎమ్మెల్సీ స్థానాలను తిరిగి పొడిగించక తప్పని పరిస్థితి. అయితే ఇందులో పొంగూరు నారాయణ ఈ సారి తనకు ఎమ్మెల్సీ వద్దని తాను నెల్లూరు జిల్లా నుంచి శాసనసభకు పోటీ చేసి తన సత్తా ఏంటో నిరూపించుకుంటానని చంద్రాబాబుకు తెగేసి చెప్పేశారు. అయితే చంద్రబాబు మాత్రం ససేమిరా అంటున్నారు. రాజధాని నిర్మాణ పర్యవేక్షణ బాధ్యతలు ఉన్నాయి కాబట్టి ఎన్నికల తలనొప్పులు నీకొద్దని చంద్రబాబు ఎంత చెప్పినా నారాయణ మాత్రం శాసనసభకు పోటీ చేయడానికే మొగ్గు చూపుతున్నారు. కానీ చంద్రబాబు మాత్రం ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇద్దరు మంత్రులకు ఎమ్మెల్సీ పదవులను పొడిగించే అవకాశం కనిపిస్తోంది. వీరిద్దరూ కాకుండా మరో మంత్రి కిడారి శ్రవణ్ కుమార్ ప్రస్తుతం ఏ సభలోనూ సభ్యుడు కాదు. కాబట్టి ఆయన్ను కూడా ఎమ్మెల్సీగా ఎన్నుకోవాల్సిన పరిస్థితి ఉంది. అయితే ఇంకా ఎన్నికల సమయం మూడు నెల్లు కూడా లేదు కాబట్టి ఆయనకు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వడం అనవసరమని ఆ పదవిని కిడారి సర్వేశ్వరరావుతో పాటు నక్సల్స్ చేతిలో హతమైన సివేరి సోమ కుమారుడు సివేరి అబ్రహంకు ఇవ్వాలనే వాదన వినిపిస్తున్నారు. కానీ అది నైతికత కాదని గతంలో ఒక సారి దివంగత నందమూరి హరికష్ణను కూడా ఇలాగే మంత్రిని చేసి తిరిగి శాసనసభ్యునిగా ఎన్నిక చేయకుండా ఆరు నెల్లకే ఉద్వాసన పలికన సందర్భం పార్టీకి చాలా చెడ్డపేరు తెచ్చిందని ఇప్పుడు కిడారి శ్రవణ్ విషయంలో అలా చేస్తే అసెంబ్లీ ఎన్నికల్లో ఇబ్బందులు ఎదురవుతాయని పార్టీలో సీనియర్లు వాదిస్తున్నారు. చంద్రాబాబు ఐదు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాల్లో మూడు స్థానాలను ఈ విధంగా తన మంత్రి వర్గ సహచరులకు ఇస్తే ఇక మిగిలేది ఒక్క స్థానం మాత్రమే ఈ స్థానం కోసం ఎస్సీ కోటా నుంచి వర్లరామయ్య, మసాల పద్మజ, హేమలత, బల్లి దుర్గాప్రసాద్, జూపూడి ప్రభాకర్లు ఆశిస్తున్నారు. వీరిలో జూపూడి ప్రభాకర్ కు గతంలో ఎమ్మెల్సీ సీటు ఖరారు చేసినా ఆయనకు ఆంధ్రప్రదేశ్ పరిధిలో ఓటు హక్కు లేకపోవడం వల్ల ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయారు. దీంతో ఈ సారి తనకు న్యాయం చేయాలని ఆయన కోరుతున్నారు. అలాగే మొన్నటి రాజ్యసభ ఎన్నికల్లో చివరి నిమిషంలో తన పేరు తప్పించి కనకమేడల రవీంద్రకు ఇచ్చారని ఈ సారి ఎమ్మెల్సీగానైనా తనకు అవకాశం ఇవ్వాలని వర్ల రామయ్య పట్టుపడుతున్నారు. బీసీ కోటా నుంచి తనకు ఈసారైనా అవకాశం ఇవ్వాలని పంచుమర్తి అనురాధ అభ్యర్థిస్తున్నారు. అలాగే రాయలసీమ కోటాలో కడప జిల్లాకు చెందిన



చెంగలరాయుడు ఎమ్మెల్సీ టిక్కెట్ ఆశిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి టీడీపీలో చేరిన చెంగల్ రాయుడికి రైల్వేకోడూరు, రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గాలపై మంచి పట్టు ఉంది. బలిజ సామాజికవర్గానికి చెందిన చెంగలరాయుడికి ఎమ్మెల్సీ ఇస్తే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కడప జిల్లాలో ఉపయుక్తంగా ఉంటుందని చంద్రబాబు సైతం ఆలోచిస్తున్నారు. పొంగూరు నారాయణకు తిరిగి ఎమ్మెల్సీ టిక్కెట్ ఇవ్వకపోతే చెంగలరాయుడికి గ్యారంటీ అంటున్నారు. ఇక కడప జిల్లా మంత్రి ఆదినారాయణరెడ్డిని ఎంపీగా పోటీ చేయమని చంద్రబాబు కోరారు. అయితే తనకు ఇప్పుడు ఎమ్మెల్సీ పదవి ఇస్తేనే తాను కడప ఎంపీగా పోటీ చేస్తానని ఆదినారాయన రెడ్డి భీష్మించుకు కూర్చున్నారు. ఈజిల్లా నుంచి వీరిద్దరూ కాకుండా మల్లెల లింగారెడ్డి, వరదరాజులరెడ్డిలు కూడా ఎమ్మెల్సీ పదవిపై ఆశలు పెట్టుకున్నారు. వీరు కాకుండా రాయపాటి కుటుంబానికి ఒకటి కావలనే డిమాండ్గ ఉంది. అలాగే గుంటూరు జిల్లాకు చెందిన దాసరి రాజామాస్టారు, గొట్టిపాటి రామకష్ణప్రసాద్‌తో పాటు ఇటీవలే వైఎస్ఆర్సీపీకి రాజీనామా చేసిన ఘట్టమనేని ఆదిశేషగిరిరావు సైతం ఎమ్మెల్సీ పదవిని ఆశిస్తున్నారు. ఇక ఇటీవలే తన ఉద్యోగానికి రాజీనామా చేసిన ఏపీఎన్జీఓల సంఘం అధ్యక్షుడు పరుచూరి అశోక్ బాబు తనకు ఎమ్మెల్సీ గ్యారంటీ అని తన సన్నిహితులతో చెప్పుకుంటున్నారు. చంద్రబాబు ఎమ్మెల్సీ ఇస్తానని హామీ ఇస్తేనే తాను ఉద్యోగానికి రాజీనామా చేశానని ఆయన చెపుతున్నారు. ఒకవేళ అశోక్ బాబుకు ఎమ్మెల్సీ ఇవ్వలేకపోతే ఆయన వ్యవహారం చంద్రబాబుకు కొంత ఇబ్బందిగా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయి. అలాగే కర్నూలు జిల్లాకు చెందిన గౌరు వెంకటరెడ్డి, గౌరు చరితలు కూడా టీడీపీలో చేరతారని ప్రచారం జరుగుతోంది.

జగన్‌పై హత్యాయత్నం కేసు
ఏపీ ప్రభుత్వానికి చుక్కెదురు



విజయవాడ, మేజర్‌న్యూస్: ఏపీ ప్రతిపక్షనేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై విశాఖ విమానాశ్రయంలో జరిగిన హత్యాయత్నం ఘటన కేసులో రాష్ట్ర ప్రభుత్వానికి చుక్కెదురైంది. ఈ కేసును జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) నుంచి తప్పించాలని ఏపీ ప్రభుత్వం హైకోర్టులో హౌస్‌మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. శనివారం విచారణ చేపట్టిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను తిరస్కరించింది. అత్యవసరంగా విచారించాల్సిన అవసరం ఈ పిటిషన్‌కు లేదని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో ఎన్ఐఏ విచారణను అడ్డుకోవాలని భావించిన చంద్రబాబు ప్రభుత్వ ప్రయత్నానికి బ్రేక్ పడింది.

దొడ్డి దారిన ఆర్డర్ తెచ్చే ప్రయత్నం–జగన్ తరఫు న్యాయవాది : ఏపీ ప్రభుత్వం హౌస్‌మోషన్ పిటిషన్ దాఖలు చేసి దొడ్డి దారిన ఆర్డర్ తెచ్చే ప్రయత్నం చేసిందని జగన్ తరఫు న్యాయవాది సుజాత శర్మ అన్నారు. ఈ పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాల్సిన అవసరం లేదని కోర్టు స్పష్టం చేసిందని ఆమె మీడియాకు వివరించారు. హత్యయత్నం జరిగిన చోటు కేంద్రం పరిధిలో ఉందని చంద్రబాబు మాట్లాడారని, ఇప్పుడేమో కుట్ర ఎక్కడ భయటపడుతుందోనని, ఎన్ఐఏ విచారణను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు.

బాబు రాజకీయ వ్యభిచారి
కారుమూరి నాగేశ్వరరావు

పశ్చిమ గోదావరి, మేజర్‌న్యూస్: చంద్రబాబు నాయుడు తన స్వలాభం కోసం ఏ పార్టీతో అయినా కలిసిపోయే రాజకీయ పచ్చి వ్యభిచారని వైసీపీ నాయకుడు కారుమూరి నాగేశ్వరరావు బాబుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆయన శనివారం ద్వారకా తిరుమలలో మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు ఈ రోజు ఒకటి మాట్లాడితే రేపు ఒకటి మాట్లాడుతున్నాడని, ఆయన ఏం మాట్లాడుతున్నాడో ఆయనకే తెలియకుండా పోతోందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రత్యేక హోదా కోసం వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి తెలంగాణ సీఎం కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్‌కు మద్దతిస్తుంటే దానిని జగన్ కేసీఆర్ కలిసి పోటీ చేసే అంత ఇదిగా అల్లరి రాజకీయాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి




హైదరాబాద్, మేజర్‌న్యూస్:ఏపీకి ప్రత్యేక హోదాపై గతంలో ఎగతాళి, ఎద్దేవా చేసిన సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికలు సమీపిస్తున్న వేళ మరో వేషానికి సిద్ధమవుతున్నారని వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. దివంగత నేత ఎన్టీఆర్ విగ్రహం ముందు చంద్రబాబు ఫోటో చూస్తే గాంధీ ముందు గాడ్సే నిలబడ్డట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. శనివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా చంద్రబాబు అవలంభిస్తున్న విధానాలపైన నిప్పులు చెరిగారు. "హరికృష్ణ పార్థివ దేహం వద్ద చంద్రబాబు టీఆర్ఎస్‌తో రాజకీయాలు మాట్లాడారు. కానీ అందరికీ తెలిసేలా కేటీఆర్ మా పార్టీ అధ్యక్షుడు ఇంటికి వచ్చి ఫెడరల్ ఫ్రంట్ గురించి చర్చించారు. టీఆర్ఎస్ పార్టీ ఏపీలో పోటీ చేయదు అయినా ఆ పార్టీని బూచిగా చూపెట్టే ప్రయత్నం చంద్రబాబు చేస్తున్నారు. చంద్రబాబుకు ప్రజలపై మమకారం లేదు, కేవలం ద్వేషం మాత్రమే ఉంది. హామీ లేకుండా ఆ రోజు దివంగత నేత వైఎస్సార్ ఎన్నికలకు వెళ్లారు. కానీ చంద్రబాబు ఓట్ల పండుగకు ముందు వృద్ధులకు పింఛన్లు పెంచుతున్నారు. తెలంగాణ ప్రాజెక్టులు కడుతుంటే మా పార్టీ నిరసన తెలిపింది, ప్రశ్నించింది.

వైసీపీకి రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం : గత 2014లో బీజేపీ ఆహ్వానం ఉన్నా మా పార్టీ వెళ్లలేదు. రాష్ట్రాన్ని చీల్చిన కాంగ్రెస్‌తోను వెళ్లలేదు.

పోలవరం సందర్శన ప్రభుత్వానికి ఇమేజ్

- రాజధాని సందర్శనకు రోజుకు 3,500 మంది
- జిల్లాల నుంచి బస్సుల్లో తీసుకొచ్చిచూపిస్తున్న సీఆర్‌డీఏ
- పనుల పురోగతి, వేగంపై సందర్శకుల్లో ఆశ్చర్యం

విజయవాడ, సూర్య బ్యూరో : అమరావతిని సందర్శించాలనే ఉత్సాహంతో ఉన్న వారందరికీ ప్రభుత్వం తీపికబురు అందించింది. రాష్ట్రం నలుమూలల నుంచి వందలాది మంది రైతులు రోజువారీ సందర్శనతో ఆ ప్రాంతం ఇసుక వేస్తే రాలనంతగా మారింది. ప్రభుత్వం వీరి రాక కోసం ఉచిత రవాణా సౌకర్యాన్ని సమకూర్చింది. దగ్గరుండి మరీ వచ్చిపోయే వారందరికీ పోలవరం ప్రాజెక్టు విశేషాలను విడమరిచి చెప్పేందుకు ఇంజనీర్లకు బాధ్యత అప్పగించింది. ఇది కాస్తా ప్రయోగాత్మకంగా విజయవంతమైంది. పోలవరం సందర్శన కాస్తా ప్రభుత్వానికి ఎనలేని ఇమేజ్ తెచ్చింది. రాజధాని పురోగతిని చూపించేందుకు సీఆర్‌డీఏ అమరావతి యాత్రకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా రాష్ట్రం నలుమూలల నుంచి



స్వయంశక్తి సంఘాల మహిళలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీలు, ఆసక్తి కలిగి ఉన్న ఇతరులను అమరావతి పర్యటనకు తీసుకొస్తోంది. ప్రస్తుతం ఒక్కో జిల్లా నుంచి 11 బస్సులు చొప్పున 13 జిల్లాల నుంచి రోజూ 143 బస్సుల్లో వీరందరినీ అమరావతికి తీసుకొచ్చి ఇక్కడ జరుగుతున్న పనులను వారికి వివరిస్తోంది. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ లు, అఖిల భారత సర్వీసు అధికారులు, ఎన్జీవోల నివాస గృహ సముదాయాలు, నగరంలో పట్టణ పేదల కోసం నిర్మిస్తున్న బహుళ అంతస్తుల సము దాయాలు, ప్రస్తుతం కార్యకలాపాలు జరుగుతున్న సచివాలయం, అసెంబ్లీ భవనాలు, నిర్మాణంలోని హైకోర్టు భవనం, విశాలమైన రహదారులు, శాశ్వత ప్రాతిపదికన నిర్మించబోయే సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయాల టవర్ల కోసం వేసిన ర్యాఫ్ట్ ఫౌండేషన్ వంటివి వారికి చూపిస్తున్నారు. రూ.40 వేల కోట్ల విలువైన పనులు ప్రస్తుతం రాజధానిలో జరుగుతున్నాయని చెబుతూ వాటి పురోగతిని వివరిస్తున్నారు.

సంక్రాంతి తర్వాత రోజుకు 10 వేల మంది : ప్రస్తుతం రోజుకు 3,500 మందిని అమరావతి యాత్ర కోసం తీసుకొస్తున్నారు. వేల మంది కార్మికులు ఒకే చోట పనిచేస్తుండటం, భారీ యంత్రాలను వినియోగిస్తుండటం, పనులు శరవేగంగా జరుగుతున్న తీరు చూసి వారు ఆశ్చర్యపోతున్నారు. నాలుగేళ్ల కిందట వరకూ పొలాలుగా ఉన్న ప్రదేశాల్లో ఇప్పుడు భారీ భవంతులు, విశాలమైన రహదారులు రావడం చూసి, ఇంత పెద్ద ఎత్తున పనులు జరుగుతు న్నాయా? ఇవేవి తమకు తెలియడం లేదే? అని అనుకుంటున్నారు. ఈ విషయాలను తమ గ్రామాల్లో వివరిస్తామని వారు చెబుతున్నారు. మరింత ఎక్కువ మందికి రాజధాని పనులను చూపించాలనే ఉద్దేశంతో సందర్శకుల సంఖ్యను మరింత పెంచాలని సీఆర్‌డీఏ భావిస్తోంది.



చంద్రబాబుతో తాము కలిస్తే తప్పా: వీహెచ్

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: బడుగు, బలహీన వర్గాల వ్యక్తిని సీఎల్పీ నేతగా నియమించిన ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీకి ఆ పార్టీ నేత వీ హనుమంతరావు కృతజ్ఞతలు తెలిపారు. దళితుడిని సీఎం చేస్తానని సీఎం కేసీఆర్ మోసం చేశారని ఆరోపించారు. ఒంటేరు ప్రతాప్‌రెడ్డికి చాలా ప్రాధాన్యత ఇచ్చామని ఆయన తెలిపారు. ఆయారాం, గయారాంలకు జిల్లా అధ్యక్ష పదవులు ఇవ్వొద్దని, పార్టీ మారుతున్న నాయకులకు బుద్ధి చెప్పాలన్నారు. తెలంగాణ కోసం లేఖ ఇచ్చిన సీఎం చంద్రబాబుతో తాము కలిస్తే తప్పా అని ప్రశ్నించారు. తెలంగాణను అడ్డుకున్న జగన్ దగ్గరకు టీఆర్ఎస్ నేతలు ఎలా వెళ్తారని వీహెచ్ నిలదీశారు.

అమరావతిలో శ్రీవారి ఆలయానికి 31న భూమిపూజ

తిరుపతి,మేజర్‌న్యూస్: ఏపీ రాజధాని అమరావతిలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం నిర్మాణానికి ఈ నెల 31 తేదీన ఉదయం 9.15 నుంచి 9.50 మధ్య భూమి పూజ చేయనున్నట్లు టీటీడీ చైర్మన్ పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ టీటీడీ ఆధ్వర్యంలో శ్రీవారి ఆలయాన్ని 25 ఎకరాల్లో రూ. 150కోట్లతో భూమి పూజకు సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా రానున్నారని తెలిపారు. సీఆర్‌డీఏ 25 ఎకరాలు టీటీడీకి కేటాయించిందని, ఇందులో 5 ఎకరాల్లో శ్రీవారి ఆలయం, మిగిలిన 20 ఎకరాల్లో ఆధ్యాత్మిక కార్యకలాపాల నిర్వహణ కోసం ఆడిటోరియాలు, కల్యాణ మండపాల వంటివాటి నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించామన్నారు.

యువతతోనే దేశాభివృద్ధి

- ప్రాధాన్యతలో వారికే తొలిస్థానం ఇవ్వాలి
- యువత ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకోవాలి
- లక్ష్యంపై యువతకు పూర్తి స్పష్టత ఉండాలి-అప్పుడు అద్భుతాలు సాధిస్తారు
- అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సు అన్నా హజారే
- యువత హక్కుల కోసం పోరాడాలి-కవిత

హైదరాబాద్, మేజర్‌న్యూస్: లక్ష్యాల సాధనలో ఎదురయ్యే సవాళ్లు, సమస్యలను అధిగమిస్తూ యువత ముందుకు సాగినప్పుడే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని సామాజిక ఉద్యమకారుడు అన్నా హజారే పేర్కొన్నారు. హైదరాబాద్‌లో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సు ప్రారంభోత్సవానికి ఆయన హాజరయ్యారు. 135 దేశాలకు చెందిన 550 మంది ప్రతినిధులు, 40 మంది వివిధ రంగాల ప్రముఖులు ఈ సదస్సులో పాల్గొన్నారు. యువత చిన్నచిన్న లక్ష్యాలతో పాటు జీవిత లక్ష్యం ఏర్పరచుకోవాలని హజారే సూచించారు. కొంతమంది యువత తినడం, తాగడం, చావటమే జీవితమనుకుంటున్నారని, అలాంటి వారికి సరైన దిశానిర్దేశం చేస్తే వారు జాతి నిర్మాణానికి ఎంతో దోహదపడతారని చెప్పారు. ప్రజలకు చేసే సేవ భగవంతుని సేవతో సమానమన్నారు. వివాహం చేసుకుంటే తన గ్రామానికి, సమాజానికి సేవచేసే అవకాశం ఉండదని భావించానని, అందుకే వివాహాన్ని పరిత్యజించినట్లు ఆయన వెల్లడించారు. ఒక్కో గ్రామాన్ని యువత దత్తత తీసుకొని అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. అప్పుడే ప్రపంచ దేశాలను తలదన్నేలా భారతదేశం నిలుస్తుందని చెప్పారు. ఏడాది, ఐదేళ్లు, పదేళ్లు ప్రాతిపదికగా లక్ష్యాలు నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. యువశక్తి సరికొత్త దిశగా ప్రయాణించి అద్భుతాలు సృష్టించాలని చెప్పారు. జీవింతలో సాధించాల్సిన లక్ష్యాలపై ముందే స్పష్టత ఉండాలన్నారు. ఎన్ని అవరోధాలు ఎదురైనా వెనుకడుగు వేయొద్దన్నారు. నిరంతరం నేర్చుకోవాలనే జిజ్ఞాస కూడా యువతలో ఉండాలన్నారు. ప్రజలకు సేవ చేసేందుకే మనల్ని దేవుడు ఇక్కడికి పంపారు. భగవంతుడు పుణ్యక్షేత్రాల్లోనే కాదు అన్ని చోట్లా ఉంటాడు అని అన్నా



హజారే తెలిపారు.

యువత హక్కుల కోసం పోరాడాలి-కవిత యువత మేల్కొని తమ హక్కుల కోసం పోరాడాలని నిజామాబాద్ ఎంపీ కవిత పిలుపునిచ్చారు. సమాజంలో ఉన్న సమస్యలన్నీ మనం సృష్టించుకున్నవేనని, సుస్థిర అభివృద్ధికి కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. సరైన విధానాలతో యువతకు ప్రోత్సాహం అందించాలని చెప్పారు. అభివృద్ధి చెందిన దేశాల యువతకు, వర్తమాన దేశాల యువతకు చాలా వ్యత్యాసం ఉందని, దీన్ని ఎలా గుర్తించి ఐక్యంగా ఎలా పరిష్కరించుకోవాలనేదే ఈ సదస్సు ప్రధాన ఉద్దేశమన్నారు. సరైన విధానాలతో ముందుకెళ్లి యువతకు తగిన ప్రోత్సాహం అందిస్తే ఆ దేశం కచ్చితంగా అభివృద్ధి సాధిస్తుందని చెప్పారు. ప్రపంచంలో ఉన్న సమస్యలన్నీ మనకు మనం సృష్టించుకున్నవేనని ఆమె అన్నారు. ప్రపంచంలో ఏటా 22 వేల మంది చిన్నారులు చనిపోతున్నారు. సుస్థిర అభివృద్ధికి ఉత్సాహంగా పని చేయాల్సిన అవసరం ఉంది. మన వల్ల ఉద్భవించిన కొన్ని సమస్యలకైనా ఈ సదస్సులో పరిష్కారం లభిస్తుందని నమ్ముతున్నాను. యువత కలిసికట్టుగా పోరాటం చేస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయి అని కవిత పేర్కొన్నారు. మన వల్ల ఉద్భవించిన కొన్ని సమస్యలకైనా ఈ సదస్సులో పరిష్కారం లభిస్తుందని నమ్ముతున్నాను.

రైతుబంధుపై అన్నాహజారే ప్రశంసలు : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రైతుబంధు పథకంపై సామాజిక ఉద్యమకారుడు అన్నాహజారే ప్రశంసల వర్షం కురిపించారు. రైతుబంధు పథకం రైతుల పాలిట ఆశాదీపం. రైతుబంధు మంచి పథకం. రైతులకు ఇలాంటి పథకం అవసరం. ప్రతి రాష్ట్రంతో పాటు కేంద్రం కూడా రైతుబంధు గురించి ఆలోచన చేయాలి. సమర్థ నాయకత్వం వల్లే తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా నిలిచింది అని అన్నాహజారే పేర్కొన్నారు. తెలంగాణ అమలు చేస్తున్న రైతుబంధు దేశానికి అత్యవసరమని చెప్పారు. అన్ని రాష్ట్రాలు తప్పకుండా రైతుబంధు లాంటి పథకాలు అమలు చేయాలి. కేంద్రానికి వ్యాపారులపై ఉన్న శ్రద్ధ రైతుల మీద లేదు. రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నా కేంద్రానికి పట్టింపు లేదు. విశ్వనాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేస్తున్నామని కేంద్రం అబద్ధాలు చెప్తోంది. రైతుబంధు పథకం సముద్రంలో దీపస్తంభం లాంటిది అని అన్నాహజారే పేర్కొన్నారు. వ్యవసాయ అభివృద్ధికి నీరు, నీటి కోసం ప్లానింగ్ తో పాటు పంట ప్రణాళిక, సరైన మార్కెటింగ్ వసతులు కల్పించినప్పుడే రైతుల జీవితాలు బాగుపడుతాయి. కానీ రైతులను పట్టించుకునే వారే కరువయ్యారు." అని అన్నా హజారే ఆవేదన వ్యక్తం చేశారు.



ఈ నెల 30 నుంచి నిరాహారదీక్ష : ఈ నెల 30వ తేదీ నుంచి నిరాహారదీక్ష చేపట్టనున్నట్లు ప్రముఖ గాంధేయవాది అన్నా హజారే తెలిపారు. లోక్‌పాల్, లోకాయుక్త 2013లో తయారైంది. 2014లో చట్టరూపం దాల్చింది. తాను అధికారంలోకి వచ్చిన వెంటనే లోక్‌పాల్‌ను నియమిస్తానని బీజేపీ ప్రధాని అభ్యర్థిగా నరేంద్రమోదీ ప్రకటించారు. అదేఏడాదిలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఎంతో కొంత దీనిపై ముందడుగు పడుతుందని ఆశించాం. కానీ గడిచిన ఐదు సంవత్సరాలు ఏమీ చేయలేదు. అధికారం చేపట్టి ఇంతవరకూ లోక్‌పాల్‌ను నియమించలేదు. ఇందుకు నిరసనగా తాను ఈ నెల 30వ తేదీ నుంచి తన స్వగ్రామమైన రాలేగావ్ సిద్ధిలో నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు అన్నా హజారే పేర్కొన్నారు.

నాకు దక్కిన అదృష్టం ఇది



హైదరాబాద్, సూర్యప్రధాన ప్రతినిధి: తెలంగాణ శాసన సభాపతి పోచారం శ్రీనివాస రెడ్డి శనివారం అసెంబ్లీ ఆవరణలోని గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ఒకరు (గాంధీ) దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహనీయులు, మరొకరు (అంబేద్కర్)రాజ్యాంగాన్ని రచించిన మహనీయులు. వాళ్లిద్దరి నీ స్పీకర్ స్థానంలో ఉండి గౌరవించుకోవడం నాకు లభించిన అదృష్టంగా భావిస్తున్నా అని వ్యాఖ్యానించారు. సభను హుందాగా, పక్షపాతం లేకుండా సజావుగా నడిపించే బాధ్యత తనపై ఉందని పేర్కొన్నారు. సభ నియమ, నిబంధనల ప్రకారం ప్రతిపక్ష పార్టీలకు మాట్లాడే స్వేచ్ఛను ఇస్తానని, వారి సూచనలు స్వీకరించి సభా సంప్రదాయాలను పాటిస్తానని వ్యాఖ్యానించారు.

సత్తుపల్లి, అశ్వారావుపేటలను కలిపి జిల్లా చేయాలి



హైదరాబాద్, సూర్యప్రధాన ప్రతినిధి: సత్తుపల్లి, అశ్వారావుపేట లను కలిపి ఒక జిల్లా ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి అన్నారు. శనివారం మీడియాతో మాట్లా దుతూ... అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా గవర్నర్ నరసింహన్ చేసిన ప్రసంగంలో అర్ధ సత్యాలే ఉన్నాయన్నారు. మిషన్ భగీరథ ప్రాజెక్టు కోసం తవ్విన గుంతలను ఇప్పటికీ పూడ్చ లేదని పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల 18 జిల్లాలో రైతుల పరిస్థితి బాగాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా పెంచిన పెన్షన్ ఎప్పటి నుంచి ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. అమాయక ప్రజలను మోసం చేసి అధిక వడ్డీలు వసూలు చేస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. మంచి రేవులలో ఉన్న వాటర్ బాడీని కాపాడాలని కేసీఆర్‌ను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు

ఎమ్మెల్యేగా రాజాసింగ్ ప్రమాణ స్వీకారం



హైదరాబాద్, సూర్యప్రధాన ప్రతినిధి: బీజేపీ నేత, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ శనివారం ఉదయం అసెంబ్లీలో ప్రమాణ స్వీకా రం చేశారు. తెలంగాణ శాసనసభ నూతన స్పీకర్ పోచారం శ్రీనివాస రెడ్డి ఆయన చేత ప్రమాణం చేయిం చారు. గురువారం అసెంబ్లీ లో జరిగిన ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకా రానికి రాజాసింగ్ సహా మరో నలుగురు ఎమ్మెల్యేలు హాజరు కాని విషయం తెలిసిందే. ఎమ్మెల్యేగా ప్రమాణం చేసిన అనంతరం మీడియా సమావేశంలో రాజాసింగ్ మాట్లాడారు.

ఎంఐఎం పార్టీ నాయకులు హిందు వులకు వ్యతిరేకంగా మాట్లాడారని, సీఎం కేసీఆర్ ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేను ప్రొటెం స్పీకర్‌ను చేసినందుకు ఆలోచించాలన్నారు. బంగారు తెలంగాణ కావాలంటే అందరినీ కలుపుకొని వెళ్లాలని కేసీఆర్‌కు విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు. ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి దూరంగా ఉంటానని, హిందూ ధర్మం పట్ల వ్యతిరేకంగా ఉండే ఎంఐఎం పార్టీ ఎమ్మెల్యే, ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్ ఖాన్ ముందు తాను ప్రమాణం చేయనని రాజాసింగ్ గతంలోనే ప్రకటించిన విషయం తెలిసిందే.

కేసీఆర్‌తో కాంగ్రెస్ ఎమ్మెల్యేల భేటీ



హైదరాబాద్, సూర్యప్రధాన ప్రతినిధి: సీఎం కేసీఆర్‌ను కాంగ్రెస్ ఆదివాసీ ఎమ్మెల్యే లు కలిశారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో రేగా కాంతారావు, ఆత్రం సక్కు, సీతక్క, పోదం వీరయ్య ఉన్నారు. పోడు భూములు, ఆదివాసీ సమస్యలు పరిష్కరించాలని నేతలు కోరి నట్లు సమాచారం. ఫిబ్రవరి మొదటి వారంలో ఆదివాసీ ఎమ్మెల్యేలతో సమావేశమ వుతానని కేసీఆర్, ఎమ్మెల్యేలకు హామీ ఇచ్చారు. ములుగు జిల్లా ఏర్పాటు చేసినందుకు సీఎంకు సీతక్క కృతజ్ఞతలు తెలిపారు.

ఇటీవల సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి అసెంబ్లీ లాబీల్లో మాట్లాడుతూ కేసీఆర్‌ను కలుస్తానని ప్రకటించిన విషయం తెలిసిందే. తన నియోజకవర్గ ప్రజలకోసం కేసీఆర్‌ని కలుస్తానని ప్రకటించారు. తన అవసరం ముఖ్యమంత్రికి లేదని, నియోజకవర్గ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి అవసరం తనకుందని తెలిపారు. అపాయింట్ మెంట్ ఇచ్చే వరకు వేచి చూస్తానని జగ్గారెడ్డి చెప్పారు. తన నియోజకవర్గానికి సీఎం వస్తే సన్మానం చేస్తానని, లేకుంటే సైలెంట్‌గా ఉంటానని ఆయన అన్నారు.

టీపీసీసీ అధికార ప్రతినిధి వంటేరు ప్రతాప్డ్డి శుక్రవారం టీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కేటీఆర్, ప్రతాప్‌రెడ్డికి, ఆయన అనుచరులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలోకి రావాలని గతంలో మూడు సార్లు కేటీఆర్ కోరారని, గతంలోనే టీఆర్ఎస్‌లో చేరి ఉంటే ఎంతో బాగుండేదని ఒంటేరు అన్నారు. ఎన్నికల్లో కేసీఆర్‌కు రైతులు అండగా నిలిచారని, ఎన్నికల్లో గెలవాలనే పోరాటం చేశానని కేసీఆర్‌పై వ్యక్తిగత ద్వేషం లేదని, గజ్వేల్ అభివృద్ధి కోసమే టీఆర్ఎస్‌లో చేరానని ఒంటేరు ప్రతాప్‌రెడ్డి స్పష్టం చేశారు. మొన్న జగ్గారెడ్డి, కేసీఆర్‌ను కలుస్తానని ప్రకటించడం.. నిన్న ఒంటేరు ప్రతాప్‌రెడ్డి టీఆర్ఎస్‌లో చేరడం, ఇప్పుడు కాంగ్రెస్ ఆదివాసి ఎమ్మెల్యేలు కేసీఆర్‌ను కలవడం రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

గవర్నర్ ప్రసంగం నిరాశకలిగించింది



హైదరాబాద్, సూర్యప్రధాన ప్రతినిధి: ఉభయసభలను ఉద్దేశిం చి గవర్నర్ ప్రసంగంలో తెలంగాణ ప్రజలకు నిరాశ కలిగించిందని బీజేపీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు అన్నారు. మెజార్టీ ప్రజల సమస్యలు పరిష్కారం, ఇచ్చిన హామీలు అమలుకు తీసుకోబోయే చర్యలు ఏమిటో తెలుపలేదన్నారు.

గతంలో ఉన్న ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చిందని గత ప్రభ్యత్వం చెప్పినవి మళ్ళీ ఇప్పుడు చెప్పారని విమర్శించారు.ఇచ్చిన హామీలు ఎప్పటి వరకు పూర్తి చేస్తాము అని క్లారిటీ లేదన్నారు. నిరుద్యోగభృతి పథకం అమలుపై స్పష్టత ఇవ్వలేదని దీంతో నిరుద్యోగులు నిరుత్సాహంలో మునిగి పోయారన్నారు. ఆయుశ్మన్ భవ పథకం ద్వారా పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని, అట్లాంటి పథకాలను గవర్నర్ ప్రసంగంలో పేర్కొనకపోవడం బాధాకరమన్నారు. కేంద్రం ప్రభ్యత్వం రాష్ట్రానికి చేసిన ఒక్క పథకం కూడా గవర్నర్ ప్రసంగం లో లేదన్నారు.

మాటకారి ప్రభుత్వం

టీఆర్ఎస్ ప్రభుత్వం మాటకారి ప్రభుత్వమని గవర్నర్ ప్రభుత్వ మాటలను మాత్రమే తెలిపారని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ విమర్శించారు. టీఆర్ఎస్ మేనిఫెస్టో ను చదివారని దుయ్యబట్టరు. కొత్త సీసా పాత సార లాగా ఉందని చమత్కరించారు. నీళ్లు లేని గ్రామాలకు ఎప్పటి వరకు నీళ్లు ఇస్తామన్న విషయాన్ని తెలుపలేదన్నారు. హైదరాబాద్ గురించి గవర్నర్ ప్రసంగంలో ఒక్కమాట కూడా లేదన్నారు. గత నాలుగున్నరేళ్ల పాలనలో పాలనలో ప్రజలకు మోసం చేశారు. ఇప్పుడు మంచి పాలనను అందించాలని కోరుకుంటున్నానన్నారు.

కాంగ్రెస్‌కు దెబ్బ మీద దెబ్బ

- పార్టీని వీడుతున్న నేతలు
- పోటీ చేసి ఓడిపోయిన నేతలు
- మరికొంతమంది ఎమ్మెల్యేలు చేరుతారని వార్తలు

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించి అధికారంలోకి వస్తామన్న కాంగ్రెస్‌పార్టీ నేతలు ఘోరంగా ఓడిపోవడంతో ఆందోళ నలో ఉన్నారు. ఎన్నికల్లో ఓడి



పోయి ఆందోళనలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. తెలం గాణలో కీలక స్థానాల్లో పోటీచేసిన నేతలు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతుండటం హస్తం నేతల్ని కలవరానికి గురిచేస్తోంది. శాసనసభ ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే పార్టీ ఆర్మూర్ అభ్యర్థి, ఎమ్మెల్సీ ఆకుల లలిత కాంగ్రెస్‌ను వీడి టీఆర్ఎస్‌లో చేరారు. గజ్వేల్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రత్యర్థిగా పోటీ చేసిన వంటేరు ప్రతాప్‌రెడ్డి తాజాగా టీఆర్ఎస్‌లో చేరారు. వంటేరు కాంగ్రెస్‌ను వీడటం పార్టీ వర్గాలపై ప్రభావం ఉంటుందని పేర్కొంటున్నారు. ఓ వైపు కొంతమంది ఎమ్మెల్యేలు పార్టీకి గుడ్‌బై చెబుతారనే ప్రచారంతో పాటు తాజా పరిణామాలు కాంగ్రెస్‌కు మరింత ఇబ్బందికరంగా మారాయి. ఈ పరిస్థితుల్లో నేతలు పార్టీని వదిలి వెళ్ల కుండా నిలువరించేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేయా లో అర్థంకాక ముఖ్య నేతలు సతమతమవుతున్నారు. బుజ్జ గించే నేతలు కూడా కరువయ్యారు. ఉన్న కొంత మంది నేతలు పదవుల కోసం పోరాటం చేస్తున్నారే తప్పా పార్టీని, నేతలను కాపాడుకునేందుకు ఏ మాత్రం ప్రయత్నం చేయడంలేదని పార్టీ నేతలే బహిరంగంగా ఆరోపిస్తున్నారు. శాసనసభ నియోజకవర్గాలకు బాధ్యులుగా వ్యవహరించిన పలువురు పార్టీకి దూరం అవుతుండటం లోక్‌సభ ఎన్నికల్లో నష్టం కలిగిస్తుందని పేర్కొంటున్నారు. పార్టీని వీడుతున్న వారికి ఎలాంటి బలమైన హామీ ఇవ్వలేని



పరిస్థితులు ఉండటంతోనే నిలువరించలేకపోతున్నామని వాపోతున్నారు. కాంగ్రెస్‌లోనే ఉండాలని చెబుతున్నామని.. అంతకుమించి ఏమీ చేయలేకపోతున్నామని ముఖ్యనేత ఒకరు ఆవేదన వ్యక్తంచేశారు. ఆర్థికంగా చితికిపోయిన వారిని ఓదార్చేదిక్కుకూడా లేదని ఆయన అన్నారు.

పెరగనున్న విమాన సర్వీసులు

విజయవాడ, సూర్య బ్యూరో : ప్రస్తుతం విజయవాడ నుంచి ఢిల్లీ, ముంబై బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ వంటి ప్రాంతాల వరకు మ్రామే విమానాలు నడుస్తున్నాయి. వీటిలో ఒక్క ముంబై తప్ప మిగిలిన అన్ని ప్రాంతాలకు రెగ్యులర్ విమానాలు నడుస్తున్నాయి. ప్రాంతీయంగా చూస్తే విశాఖపట్నం, తిరుపతి, కడపలకు మరికొన్ని సర్వీసులు నడుస్తున్నాయి. రానున్న మార్చి నుంచి వేసవి ప్రత్యేక విమాన సర్వీసులను నడపటానికి విమానయాన సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయి. విజయవాడ నుంచి హైదరాబాద్, విశాఖపట్నం, చెన్నై, బెంగళూరులకు మరిన్ని విమానాలు నడిపేందుకు స్పైస్‌జెట్, ఇండిగో సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయి. మరికొద్ది రోజుల్లో అధికారికంగా తమ షెడ్యూల్స్ వివరాలను ఈ సంస్థలు ప్రకటించనున్నాయి. అంతర్జాతీయంగా ఇటీవలే తొలి సర్వీసుగా సింగపూర్‌కు ఇండిగో సంస్థ విమానాన్ని ప్రారంభించింది. దేశీయంగా మరిన్ని ప్రాంతాలకు విమాన సర్వీసులు నడపాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. కష్ణా, గుంటూరు, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరిజిల్లా, ప్రకాశంజిల్లాతో పాటు పొరుగు రాష్ట్రం తెలంగాణా లోని ఖమ్మం జిల్లాకు విజయవాడ ఎయిర్‌పోర్టు దగ్గరగా ఉండటం వల్ల దేశీయంగా, అంతర్జాతీయంగా కూడా ఈ ప్రాంతవాసుల నుంచి ఎంతో డిమాండ్గ ఉంది. విజయవాడ విమానాశ్రయం ఇప్పటివరకు దేశీయంగా నిర్వహిస్తున్న ఆప రేషన్స్ మీదనే వద్ధి చెందుతోంది. సింగపూర్‌కు సర్వీసు 80-90 శాతం ఆక్యుపెన్సీ సాధిస్తోంది. ఇదే ఉత్సాహంలో దుబాయ్‌కు కూడా సర్వీసు నడిపేందుకు సానుకూల పరిస్థితులు నెలకొన్నాయి. దుబాయ్‌కు కూడా సాకారమైతే ప్రపంచ దేశాలకెక్కడికైనా చేరుకోవటానికి విమాన సదు పాయాలు కలిగిన డెస్టినేషన్ ఎయిర్‌పోర్టులకు మరింత కనెక్టివిటీ ఏర్పడుతోంది. అంతర్జాతీయానం వేళ్ళూనుకుంటున్న తరుణంలోనే, దేశీయంగా మరిన్ని నూతన ప్రాంతాలకు విమానాల అనుసంధానం ఏర్పడాల్సి ఉంది. ఈ తరుణంలో విమానయాన సంస్థలు శుభసంకేతాలను ఇవ్వటంతో ఎయిర్‌పోర్టు అధికారులు కూడా సంతోషంగా ఉన్నారు. దేశ ఆర్థిక రాజధాని ముంబైకి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ వారంలో మంగళ, శుక్ర, ఆదివారాలలో మూడు రోజులు సర్వీసును నడుపుతోంది. నగర వ్యాపార వర్గాలు ముంబై సర్వీసును డైలీగా తిప్పాలని ఎప్పటి నుంచో కోరుతున్నారు. ముంబైకి డైలీ సర్వీసు నడపాలన్న ఆలోచనలో ఇండిగో ఉంది. ముంబైకి సర్వీసు నడిపితే ఎలా ఉంటుందో అధ్యయనం చేసిన తర్వాతే రెగ్యులర్‌గా నడపాలన్న ఆలోచనను ఇండిగో చే సింది. ప్రస్తుతం వారంలో మూడు రోజులు మాత్రమే విమాన సర్వీసు నడుపుతున్న ఎయిర్‌ఇండియా ఎక్స్‌ప్రెస్‌కు ఆక్యుపెన్సీ కూడా 85-90 శాతం మేర ఉండటం గమనార్హం. విజయవాడ విమానాశ్రయం నుంచి దేశ ఆర్థిక రాజధాని ముంబైకి రెగ్యులర్ సర్వీసుతో పాటు కోల్‌కతా, కోయంబత్తూరు, అహ్మదాబాద్, వారణాసి తదితర ప్రాంతాలకు విమాన సర్వీసులు నడపటానికి విమానయాన సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయి. బెజవాడ నుంచి డొమిస్టిక్ ఆపరేషన్స్‌లో పాలు పంచుకుంటున్న స్పైస్‌జెట్, ఇండిగో, ఎయిర్ ఇండియా విమానయాన సంస్థలు ఈ మేరకు ఎయిర్‌పోర్టు అధికారులకు సంకేతాలిచ్చాయి. సమ్మర్ షెడ్యూల్స్ కోసం విమానాశ్రయ అధికారులు విమానయాన సంస్థలను ప్రతిపాదనలు కోరగా సరికొత్త రూట్లపై అవి సంకేతాలిచ్చాయి. ఇదే జరిగితే దేశీయంగా మరిన్ని రూట్లకు కనెక్టివిటీ ఏర్పడటంతో పాటు మరింత వద్ధికి దోహదపడే అవకాశాలు ఉన్నాయి.

పెరగనున్న మరిన్ని సర్వీసులు : ముంబైకి వారంలో



మూడుసార్లు కాకుండా డైలీ చేయాలన్న ఆలోచనలో ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ ఉన్నట్టు తెలుస్తోంది. చెన్నైకు స్పైస్ జెట్ విమాన సర్వీసులను నడువుతోంది. కోయంబత్తూరుకు కూడా సర్వీసు నడపాలన్న ఆలోచనలో ఇండిగో సంస్థ ఉన్నట్టు తెలుస్తోంది. గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌కు విమాన సర్వీసులు నడపాలన్న ఆలోచనలో ఎరురిండియా, ఇండిగో సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయి. గుజరాత్‌కు వ్యాపార కలాపాల మీద రాకపోకలు సాగించే వారి సంఖ్య ఎక్కువగా ఉందని అధ్యయనంలో తేలటంతో ఈ రెండు సంస్థలు పోటీలు పడటం గమనార్హం. వారణాసికి సర్వీసు నడపాలన్న ఆలోచనలో స్పైస్ జెట్ సంస్థ ఉంది. గతంలో వారణాసికి ఈ సంస్థ విజయవాడ నుంచి నేరుగా విమాన సర్వీసు నడిపింది. ఆ తర్వాత అర్ధంతరంగా రద్దు చేసింది. ఈ సర్వీసు రద్దుపై స్థానికంగా తీవ్ర వ్యతిరేకత కూడా వచ్చింది. మళ్ళీ ఈ సర్వీసును పునరుద్ధరించాలని భావిస్తోంది. గతంలో మాదిరిగా డైరెక్టు సర్వీసు కాకుండా హైదరాబాద్‌కు వెళ్ళి అక్కడి నుంచి ఫ్లైట్ మారేలా సర్వీసును నడపాలన్న ఆలోచనలో స్పైస్‌జెట్ యాజమాన్యం ఉన్నట్టు తెలుస్తోంది. రాబోయే కాలంలో అంతర్జాతీయ విమాన సర్వీసులలో నవ్యాంధ్రప్రదేశ్ కీలకం కానుంది.

21న తిరుమలలో పున్నమి గరుడసేవ

తిరుమల, మేజర్‌న్యూస్: తిరుమలలో ఈ నెల 21న పున్నమి గరుడసేవ జరగనుంది. ఆ రోజుమలయప్ప గరుడ వాహనంపై ఊరేగుతారు. అదేరోజు శ్రీరామకృష్ణతీర్థ ముక్కోటి కూడా కనువిందుగా జరుగుతుంది. శ్రీవారి ఆలయానికి 6 మైళ్ల దూరంలో ఉన్న ఇక్కడ ఏటా రామకృష్ణ తీర్థ ముక్కోటి నిర్వహిస్తారు.

సూర్య
హైదరాబాద్
ఆదివారం
20 జనవరి 2019

సంపాదకీయం
editpage@suryaa.com

ఉత్తరాఖండ్‌లో వింత ఆచారం

మహిళలు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తున్న ఈనాటి తరుణంలో సైతం వారిని వెనక్కు లాగే అరాచకాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని ఓ వింత ఆచారం మహిళలపై వివక్షకు సాక్ష్యంగా నిలుస్తోంది. చంపావట్ జిల్లాలోని కొన్ని గ్రామాల్లో రుతుక్రమం సమయంలో మహిళలు ఇంటి నుంచి దూరంగా ఉండాలనేది ఆచారంగా ఉంది. జిల్లాలోని మారుమూల గుర్చామ్ గ్రామంలో నైతే మహిళలు ఆ సమయంలో ఇళ్లలో ఉండకూడదంటూ గ్రామ పంచాయతీ తీర్మానం చేసింది. వారి కోసం ఓ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ భవనాన్ని ప్రభుత్వ నిధులను వినియోగించారు. ఇది వెలుగులోకి రావడంతో ఉత్తరాఖండ్ మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి విచారం వ్యక్తంచేశారు. తక్షణం ఈ కేంద్రాన్ని మూసివేయాలని ఆదేశించారు. ఘటనపై దర్యాప్తునకు ఆదేశించారు.



రాజకీయ భోగిమంటలు



సూటిగా సుతిమెత్తగా


భండారు శ్రీనివాసరావు
98491 30595

నాకు జ్యోతిష్యం చెప్పడం రాదు, హస్త సాముద్రికం తెలియదు. ఊహాగానాలు చేయడం నా తత్వానికే విరుద్ధం. అయినా చెబుతున్నాను. మరో మూడు నాలుగు మాసాల పాటు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల నడక గాడి తప్పుతుంది. వేడి పెరుగుతుంది. ఇలా జరగాలని నేను కోరుకోవడం లేదు. కానీ జరిగేదానిని ఆపలేము కదా! రాజకీయ నాయకులు ఒకరినొకరు కలుసుకోవడం విడ్డూరమేమీ కాదు. ఉత్తర ధ్రువం, దక్షిణ ధ్రువం వంటి నేతలు కలుసుకున్నా, ఎదురుపడ్డా, పలకరించుకున్నా మీడియాకు అది వార్తే. అదే వారిద్దరూ ఒకటవుతున్నారు, కలిసిపోవాలని అనుకుంటున్నారు అన్నప్పుడు అది సంచలన వార్త కూడా అవుతుంది. ఎక్కడి ఉదాహరణలో ఎందుకు? తెలుగు రాష్ట్రాల సంగతే చూద్దాం. తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావు, ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొన్నేళ్ళ క్రితం రాజ భవన్‌లో గవర్నర్ ఇచ్చిన తేనీటి విందుకు హాజరయ్యారు. ఇదే వార్త సంచలనం అయికూర్చుంది. రోజల్లా మీడియాలో గిరికీలు కొట్టింది. ముందు ఎవరు ఎవర్ని పలకరించారు? కరచాలనం చేయడానికి ముందు ఎవరు చేయి చాపారు? ఏమి మాట్లాడుకున్నారు? ఇలా సాగిపోయాయి వార్తాకథనాలు. ఇందులో తప్పు పట్టాల్సింది ఏమీ లేదు. ప్రజల్లో పేరు ప్రఖ్యాతులు కలిగిన వ్యక్తులు, వాళ్ళు సినిమా రంగానికి చెందినవాళ్ళు కావచ్చు, రాజకీయ రంగానికి చెందినవాళ్ళు కావచ్చు, వాళ్ళ ప్రతి కదలిక మీదా మీడియా కన్ను వుంటుంది. అందుకు సంబంధించిన మీడియా కథనాలపై ప్రజలకు ఆసక్తి వుంటుంది. ఈ కథనాలను వండి వార్చడంలో కొన్ని ఉత్ప్రేక్షాలంకారాలు దొర్లినా అవి ఆ వార్తలకు కొత్త సొగసు అద్దుతాయి తప్పిస్తే సమాజానికి జరిగే హాని ఏమీ వుండదు.

రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు వుండరు అనే సామెతను రాజకీయ నాయకులే పదేపదే ప్రస్తావిస్తూ పార్టీల కలయికలు, విడిపోవడాలు అత్యంత సహజం అనే నిర్ధారణకు జనం వచ్చేలా వారివంతు వారి ప్రయత్నం చేస్తూనే వున్నారు. అంచేత రాజకీయాల్లో శత్రువులు, మిత్రులు అంటూ విడిగా వుండరు, రాజకీయాలు చేసే వాళ్ళే రాజకీయాల్లో వుంటారనే అభిప్రాయం ప్రజల్లో కూడా బలపడి పోయి పార్టీల కలయికలు, విడిపోవడాలు ఇవన్నీ ఆటలో అరటిపండు అనే రీతిలో తేలిగ్గా తీసుకునే పరిస్థితి ఏర్పడింది.

ఈ నేపథ్యంలో, మొన్నీమధ్య తెలంగాణా రాష్ట్ర సమితి కార్య నిర్వాహక అధ్యక్షులు, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తనయుడు కె. తారకరామారావు కొందరు పార్టీ ముఖ్యులను వెంటబెట్టుకుని హైదరాబాదులోని వైసీపీ అధ్యక్షుడు వై.ఎస్. జగన్మోహనరెడ్డి నివాసానికి వెళ్లి గంటల తరబడి చర్చించారు. ఇదేమీ రహస్యంగా జరిగింది కాదు. ఈ భేటీ గురించి అంతకు ముందు రోజు నుంచీ మీడియాలో వార్తలు వస్తూనే వున్నాయి. ఈ పార్టీల నేపథ్యం గమనంలో పెట్టుకుని చూస్తే కచ్చితంగా ఈ సమావేశం మీడియా దృష్టిలో ఒక సంచలన సమాచారమే. ఈ రెండు పార్టీలు తమ ఆవిర్భావం నుంచి విభిన్న ధ్రువాలే. తెలంగాణ సాధన కోసం టీఆర్ఎస్ పుష్కర కాలంగా సాగించిన ఉద్యమం తుది దశకు చేరుకున్న సమయంలో పురుడు పోసుకున్న వై.ఎస్.ఆర్.సి.పీ. సమైక్య రాష్ట్ర నినాదాన్నే ఆదినుంచీ అందుకుంది. ఆ రకంగా ఈ రెండు పార్టీలకు పొసగడం అనేది గగన కుసుమం అని తీర్మానించుకున్న రోజులు కూడా వున్నాయి.

ఇదిగో ఈ నేపథ్యంలో జరిగిన భేటీ కాబట్టే అటు మీడియా కన్ను, రాజకీయుల దృష్టి దీనివైపు మళ్ళింది. ఈ ఇద్దరూ రహస్య సమాలోచనలు చేసినట్టు లేదు. ఈ సమావేశంలో రెండు పార్టీలకు చెందిన ముఖ్య నాయకులు కూడా పాల్గొన్నారు. భేటీ ముగిసిన తర్వాత ఇద్దరు నాయకులు మీడియాను కలిసి చర్చల సారాంశం చెప్పారు. జగన్ సమక్షంలోనే విలేకరులతో ముందు కేటీఆర్ మాట్లాడారు. ఉన్న విషయం చెప్పారు. టీఆర్ఎస్ అధినేత ఆదేశాల ప్రకారం తానూ జగన్ మోహన రెడ్డిని కలుసుకున్నానని వెల్లడించారు. జాతీయ రాజకీయాల్లో గుణాత్మకమైన మార్పు తీసుకురావడానికి ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు గురించి చాలారోజులుగా



కేసీఆర్ ఆలోచిస్తూ వస్తున్నారని, దానికి మద్దతు కోరడానికి జగన్ మోహన రెడ్డిని కలుసుకోవడం జరిగిందని మదిలో కదలాడుతున్న ఫెడరల్ ఫ్రంట్ గురించి చర్చించామని వివరించారు. భావసారూప్యత కలిగిన ప్రాంతీయ పార్టీల నడుమ సఖ్యతను పెంపొందించి వాటి బలాన్ని పెంచేలా చేయడం, తద్వారా ఆయా ప్రాంతీయ ప్రయోజనాలను సాధించుకోవడం అనేది ఫెడరల్ ఫ్రంట్ ఉద్దేశమని అన్నారు. కేంద్ర రాజకీయాల్లో ఈ ఫ్రంట్ అటు బీజేపీకి, ఇటుకాంగ్రెస్ కు దూరంగా ఉంటుందని చెప్పారు. ఈనాటి చర్చల్ని మరింత ముందుకు తీసుకుపోవడానికి తమ అధినాయకుడు, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ త్వరలో ఆంధ్రప్రదేశ్ వెళ్లి వైసీపీ అధ్యక్షుడు జగన్ మోహన రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఈ అంశంపై మరింత లోతుగా చర్చిస్తారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా డిమాండ్ ను తమ పార్టీ బలపరుస్తుందని కేటీ ఆర్ స్పష్టం చేశారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధనలో ఎవరు కలిసివచ్చినా కలుపుకుపోవడానికి తమ పార్టీ ఎల్లప్పుడు సిద్ధమేనని చెబుతూ, ఇరుగు పొరుగు రాష్ట్రాలయిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కు చెందిన మొత్తం 42 మంది ఎంపీలు ముక్త కంఠంతో పట్టుబడితే కేంద్రంపై ఒత్తిడి పెంచడం సాధ్యం కాగలదని జగన్ మోహన రెడ్డి అన్నారు. కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ ప్రతిపాదనని ఎలా ముందుకు తీసుకుపోవాలి అనే విషయాన్ని గురించి తమ పార్టీ వారితో చర్చిస్తానని ఆయన చెప్పారు.

ఒకప్పుడు రాజకీయంగా, సైద్ధాంతికంగా విభేదించిన ఈ రెండు పార్టీల నాయకులు కేంద్ర రాజకీయాల్లో తీసుకురావాల్సిన మార్పుల గురించి ఒక అవగాహనకు వచ్చే ప్రయత్నం చేయడం ఆహ్వానించదగ్గ విషయమే. కొత్తగా విడిపోయిన రాష్ట్రాల నడుమ పరిష్కరించుకోవాల్సిన అనేక అంశాలు వుంటాయి. తెలంగాణ వైపు నుంచి అధికార పక్షమే ముందు చొరవ తీసుకుంది. పైగా మరో అయిదేళ్ళు అధికారంలో వుండే పార్టీ. మరో వైపు వైసీపీ ఆ రాష్ట్రంలో పాలక పక్షం కాకపోయినా ప్రధాన ప్రతిపక్షం. అక్కడి అధికార పార్టీ టీడీపీ మరో ఫ్రంటు యూపీఏతో కొత్త బంధం ఏర్పరచుకుంది. కాబట్టి ప్రధాన ప్రతిపక్షాన్ని ఫెడరల్ ఫ్రంట్ దిశగా ఆకర్షించే ప్రయత్నం టీఆర్ఎస్ చేస్తోందని అనుకోవాలి. ఇందులో రాజకీయం లేకపోలేదు, కానీ అది జాతీయ రాజకీయాలకు పరిమితమని భేటీలో పాల్గొన్న నాయకులు చెప్పారు. కానీ అసలు రాజకీయం అక్కడే, అప్పుడే మొదలయింది. నాయకులు ఇరువురూ మీడియా ఎదుట మాట్లాడి వెనుతిరిగారో లేదో, వెనువెంటనే ఈ భేటీ భేరీలు అటు అమరావతిలో మోగాయి. తెలుగుదేశం పార్టీ నాయకులు కేటీఆర్, జగన్ భేటీని తప్పుపడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను దెబ్బతీసే కుట్రగా అభివర్ణించారు. రాష్ట్ర ప్రయోజనాలను అడుగడుగునా అడ్డుకుంటున్న టీఆర్ఎస్‌తో జగన్ మోహన రెడ్డి దోస్తీ చేయడం ద్వారా రాష్ట్రాన్ని మోసం చేస్తున్నారని ఆరోపించారు.

మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఒక అడుగు ముందుకు వేసి గతంలో కేసీఆర్ ఏయే సందర్భాలలో ఆంధ్రప్రజలను, వారి ఆచార వ్యవహారాలను, సాంప్రదాయాలను, వంటకాలను సయితం వదలకుండా ఎలా కించపరుస్తూ వ్యాఖ్యలు చేసారో వాటినన్నిటినీ గుదిగుచ్చి ఒక పెద్ద జాబితా చదివారు. అంటే జగన్ తో కేటీఆర్ సమావేశం ముగియగానే ఎదురుదాడికి టీడీపీ శ్రేణులు సర్వ సంసిద్ధంగా ఉన్నాయనుకోవాలి. ఈ ఆరోపణలు, విమర్శలు, వ్యాఖ్యలు వీటన్నిటి టీకా తాత్పర్యం ఒక్కటే. ఆంధ్ర ప్రదేశ్ ప్రయోజనాలకు టీఆర్ఎస్ ఆగర్భ శత్రువు. ఆ శత్రువుతో కలిసేవాళ్ళు ఆంధ్రప్రదేశ్ కు ప్రప్రథమ శత్రువు. అంటే ఏమన్నమాట. వై ఎస్ ఆర్ సీపీ అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలకు భంగం కలిగేలా వైరి పక్షంతో చేతులు కలుపుతున్నారు అని. కొద్దికాలం క్రితం చంద్రబాబునాయుడు కేసీఆర్ కు స్నేహ హస్తం అందించాలని కోరుకున్నారు. కానీ ఆయన తిరస్కరించారు. ఈ విషయాన్ని చంద్రబాబే స్వయంగా వెల్లడించేదాకా బయట ప్రపంచానికి తెలియదు. ఒకవేళ చంద్రబాబు కోరుకున్నట్టే టీడీపీ, టీఆర్ఎస్ కలయిక సాధ్యం అయిన పక్షంలో ఇప్పుడు మంత్రి ఉమామహేశ్వరరావు వాక్రుచ్చిన జాబితా యావత్తూ వైసీపీ వాళ్ళు పఠించేవారేమో! ఇక్కడ అన్ని పార్టీలు ఒక విషయం గమనంలో పెట్టుకోవాలి. మీమీ ప్రయోజనాలకోసం మీకెలాగూ రాజకీయాలు చేయక తప్పదు. చేసుకోండి నిరభ్యంతరంగా. కానీ అందులో అటూ ఇటూ వున్న అమాయక ప్రజలని భాగం చేయకండి. వారి వేష భాషలను, ఆహార వ్యవహారాలను చిన్నబుచ్చే పద్ధతిలో మాటల తూటాలు విసరకండి.

నిజానికి కేటీఆర్, జగన్మోహనరెడ్డిని కలిసింది జాతీయ స్థాయిలో ఎన్డీయే, యూపీఏ కూటములకు ప్రత్యామ్నాయంగా ఫెడరల్ ఫ్రంట్ అనే తృతీయ రాజకీయ కూటమి అవకాశాలు గురించి చర్చించడానికి. గతంలో ఇదే పనిమీద కేసీఆర్ పలు రాష్ట్రాలకు వెళ్లి వచ్చారు కూడా. అలాగే చంద్రబాబునాయుడు కూడా ఎన్డీయేకు వ్యతిరేకంగా, ఇంకా నిక్కచ్చిగా చెప్పాలంటే ప్రధాని మోడీని గద్దె దించే ధ్యేయంతో వివిధ రాష్ట్రాలకు వెళ్లి అనేక రాజకీయ పార్టీల అధినాయకులతో సంప్రదింపులు చేశారు కూడా. నిజానికి, కేటీఆర్, జగన్ భేటీలో ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు అంటూ ఏమీ లేవు. కానీ ఎన్నికలు ముంగిట్లో ఉన్న వేళ. ప్రత్యర్థులు ఒకచోట చేరితే అలక్ష్యం చేయరాదు అనే రాజ(కీయ)నీతి వారిచేత అలా మాట్లాడించి ఉండవచ్చు.

టీడీపీ నాయకులు చేసిన ఆరోపణలు అన్నీ కొట్టివేయదగ్గవి కావు. తెలంగాణ ఉద్యమం తీవ్ర స్థాయిలో వున్నప్పుడు ఆంధ్రులు, ముఖ్యంగా తెలంగాణా ప్రాంతంలో స్థిరపడ్డ సీమాంధ్ర ప్రజల మనసులు గాయపడిన మాట కూడా వాస్తవం. ఆ రకంగా వారికి టీఆర్ఎస్ అంటే ద్వేష భావం వుండి ఉండొచ్చన్న భావన ఒకటుంది. హైదరాబాదు మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలు, నిరుడు చివరాఖర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ ఘన విజయం చూసిన తర్వాత తెలంగాణలో నివసిస్తున్న సీమాంధ్రుల మనసులు తేలికపడినట్టే భావించాలి.

అయితే, అటు ఆంధ్రప్రదేశ్ లో విభజన జరిగిన తీరు బాగాలేదని బాధపడేవారు, బాధ పడుతున్నవారు ఇప్పటికీ కానవస్తారు. అయితే వారి కోపం అల్లా అడ్డగోలుగా రాష్ట్ర విభజన చేసిన కాంగ్రెస్ పార్టీ మీద. ఆ కోపాన్ని గత ఎన్నికల్లోనే వాళ్ళు తీర్చుకుని బేబాకీ చేసుకున్నారు.

కాకపోతే ఇప్పుడు కొత్తగా తెరమీదకు వచ్చిన అంశం ప్రత్యేక హోదా. ఒక్క బీజేపీని మినహాయిస్తే ఈ హోదా అంశాన్ని ఏ ఒక్క పార్టీ కూడా వ్యతిరేకించడం లేదు. ఇప్పుడు టీఆర్ఎస్ కూడా తమకు అభ్యంతరం లేదని తేల్చి చెప్పింది. కేంద్రంలో మళ్ళీ అధికారంలోకి రాగానే తొలి సంతకం ప్రత్యేక హోదా మీదనే అని కాంగ్రెస్ అధినాయకులతో సహా బల్ల గుద్ది చెబుతున్నారు. కాంగ్రెస్‌తో కొత్తగా చెలిమి చేస్తున్న టీడీపీ కూడా వారి హామీనే సమర్ధిస్తోంది. బీజేపీనా, కాంగ్రెసా అనేదానితో తమకు నిమిత్తం లేదనీ, ఎవరు ప్రత్యేక హోదా ఇస్తే వారికే తమ మద్దతు అని వై.ఎస్.ఆర్.సి.పీ. అంటోంది. జనసేనాని పవన్ కళ్యాణ్ ధ్యేయం కూడా ప్రత్యేక హోదా సాధనే. రాష్ట్రంలోని అన్ని పార్టీలకి ఇదొకటే లక్ష్యం. కానీ వాటన్నిటికీ మరో ధ్యేయం వుంది. అది అధికారం. దానికోసం తాము గట్టిగా కోరుకుంటున్న ప్రత్యేకహోదా కోసం గట్టిగా గొంతులు కలపలేకపోతున్నాయి. అందుకే ఇన్ని పిల్లిమొగ్గలు. ఇన్ని కొత్త స్నేహాలు. ఇన్నికొత్త వ్యూహాలు. ఇన్ని ఎత్తులు, ఇన్ని పై ఎత్తులు.

బూత్ రాజకీయాలు



వ్యంగల్పిక

జి.ఎస్. దేవి
బోథెల్, వాషింగ్టన్

ఎంతటి ఆక్స్ ఫర్డ్ రిటర్న్ అయినప్పటికీ కడుపు మండితే ముందు చప్పున తెలుగువాడి నోటి కొచ్చేవి చచ్చేటన్ని శుద్ధ సంస్కృత పదాలే! ఆ నాగరిక భాషలో అరితేరాలంటే చదువు సంధ్యల్లాంటి ఝంఝాటాలేవీ ఉండక్కర్లా. ఏ నీళ్ల పంపు దగ్గరికెళ్లి ఓ అరగంట నిలబడ్డా నాలుగు అడ్డదిడ్డమైన ముక్కలు నాలుక్కవే తగులుకుంటాయ్. కావాల్సిన క్వాలిఫికేనల్లా శుంఠత్వంలో సూక్ష్మగ్రాహ్య బుద్ధి!

ఆడాళ్ల పురాణాలు.. మగధీరులం మనకెందుకులే అని రోషాలు పడే పుణ్యపురుషులకు పూటుగా తాగించి వాగించే పబ్బులు.. కల్లుపాకలు ఎట్లాగూ డే అండ్ నైట్ సందు గొందుల్లో వెలుగొందుతూనే ఉండె! కల్లా కపటం లేని మాటలకంటే కటికర్రువు గానీ కల్లిబొల్లి కబుర్లకు ఎక్కడంటే అక్కడే బండబూతు రచ్చబండలు! తప్పు పట్టేం ప్రయోజనం? 'చెరపకురా చెడేవం'టూ మంచి ముక్కలు రెండు చెప్తేనే ముప్పే రోజుల్లో! మూతి మీది పళ్లు ముప్పైరెండూ రాలి పడే తీరులో పాత చెప్పులు వర్షంలా వచ్చి పడతాయ్ ముందు! కల్లా కపటాలేవీ ఎరక్కుండా మసలడమే పెద్ద తప్పు నడత ఇవాళా రేపూ! చౌడప్ప అనే కవి ఉన్నాడొకప్పుడు. తెలుగక్షరం అతగాని ముతక భాషతో సుసంపన్నమైం తరువాత గాని ఆ జ్ఞాని గొప్పను వప్పలేదు జనం. నీతులు మెచ్చని బుద్ధిమంతులు బూతులు వింటే మాత్రం మూతులు చాచి మరీ ముద్దులతో ముంచెత్తేస్తారన్నది ఆయన వాదం. అచ్చంగా ఇప్పటి ఎన్నికల సభలకొచ్చి చూసినట్లే చెప్పుకొచ్చాడు కదూ! అవాచ్యాల ప్రాచుర్యం అప్పటికన్నా ఇప్పుడు వెయ్యింతలు పెరిగిందన్న మాట నిజం. సన్నాసి, దద్దమ్మ.. లాంటి సవాలక్ష పద సంపద మన కపారంగా ఉందని గొప్పలు పోతుంటాం. వాడకంలో ఉన్నప్పుడే కదా ఏ వాడకట్టు కూతలకైనా రాజయోగం! ఆ దిశగా కృషి చేసే దుర్భాషా సేవక శ్రేణులన్నింటికీ నాయకత్వం వహిస్తున్నది ఈ తరం నేతాగణమే! అభిశంసించడం కాదు.. అభినందించాలి నిజానికి మనమందరం. వాడినవే మళ్లీ మళ్లీ వాడుతుండడం వల్ల తీరా ఎన్నికల వేళ దగ్గర పడే వేళకి నసాళాని కంటే మసాలా కూతలు కరువై పోతున్నాయని నయా నాయకుల వాపోత ! కొత్త బూతుల ఆవిష్కరణలు పుంజుకోని పక్షంలో రాజకీయ పక్షాలకు నిజంగా గడ్డుకాలమే! వాడిన వాడకట్టు భాషే పడికట్టుగా వాడేస్తున్నారు నేతాశ్రీలు కొందరు. వాడీ వేడీ చల్లబడ్డ ఉపన్యాసం రాజకీయ సన్యాసానికి దగ్గరి దారి కదా! మరి ముంచుకు రాబోతున్నవేమో మహా పెద్ద ఎన్నికలాయె! పేరులోనే సాధారణం. ఏ సాధారణ ఎన్నికలు సీదా సాదాగా సాగిన దాఖల్లాలేవు. సాక్షాత్ ఎన్నికల సంఘమే స్వేచ్ఛాయుత వాతావరణం అభిలషిస్తున్నప్పుడు .. తప్పుడు కూతల్నిహ యధేచ్ఛగా వాడుకోడం తప్పెలా అవుతుందసలు? అన్ని ఏర్పాట్లూ అయిపొయ్యాయంటున్నాయ్ అన్ని పార్టీలూ అప్పుడే! మనీ మేటరనా ఆ సంకేతాలు? మనీ మేక్స్ ఎనీ థింగ్ అన్న మాట నిజమే కానీ బిలియన్సాఫ్ డాలర్స్ పోసినా అప్పటి కప్పుడు అపద్ధర్మంగా ఎ బిట్ ఆఫ్ బిచ్ లాంగ్వేజైనా డెవలప్పవడం కుదిరే పనేనా? ఆ రపాడే పాడు కూతలేవో పెందళాడే పోగేసుకొని పేటెంట్ రైట్స్ రాబట్టటమెలాగో ముందాలోచించాలి నేతాగణం! ఎంత బక్క పార్టీలోనయినా ఒక్క రోజులోనే బక్కెట్సాఫ్ మనీ వాటర్లా ఊరడం పెద్ద మేటరేం కాదీ విరాళాల సీజన్లో! విరివిగా కావాల్సిందల్లా ముందు జనం విరగబడి వచ్చిపడి విధిగా ఎంజాయ్ చేసే ఫాల్తూ లాంగ్వేజెస్! టంగ్‌ను తాటాకు బద్దలా వాడితే గాని ఓటమిని ఓ టర్మ్ వరకైనా దగ్గరికి రానీయడం కుదరని రాజకీయమిప్పటిది. సర్దా కోసం ఏ పెద్దమనిషీ దద్దమ్మ.. సన్నాసివంటి వెగటు వకాబ్యులరీ జోకికెళ్లడు కదా! చెడ్డ మాటకు ముఖ్యాంశాన్నుంచి దృష్టి మళ్ళించే శక్తి ఎక్కువ. రాక్షసాధముడని కూడా భయపడకుండా రావణాసురుడి మీదకు దాడికి దిగి మరీ భార్యను తిరిగి తెచ్చుకున్న మర్యాద రామన్న శ్రీరామచంద్రుడు. ఓ తాగుబోతు కుంక తప్పుడు కూతలకు బెదిరి మళ్లీ ఆమెను అడవులకే వదిలేసాడే! పుల్ల విరుపు మాటల పవరేంటో ఇక వేరేగా చెప్పాలా? వార్డు ఎన్నికల్లో వినిపించే బూతు పురాణాలు వారణాసి వీధుల వరక్కూడా పాకడం యాదృచ్ఛికమేం కాదు. పొల్లుమాటలకు జియో సెల్లు ఫోన్లకు మించి గిరాకీ ఎక్కువిప్పుడు. ఆ డేమేజింగ్ సరుకు సరఫరాకే నగదు సప్లై కన్నా ఎక్కువగా డిమాండుందిప్పుడు. వాడకట్టు భాష వాడకందార్లు రోజు రోజుకీ రాజకీయాల్లోకొచ్చేయడమే రఫ్ఫాడుకునే లాన్గ్వేజీ లోటుకి కారణం. ఒక సన్నాసి పార్టీ వాడిన భాషే మరో సంకర కూటమి వాడుకోడానికి లేదాయ. ఓ పిచ్చి కుంక తనే పదే పదే వాడేసిన కూతలను మళ్లీ మళ్లీ పెదాలకు తెచ్చేస్తుంటే ఆ పదాల పదును బండబారి పోతుంది కదా!. మాయాబజారులో ఘటోత్కచుడు భాష గూర్చి అన్న మాటే బూతులకూ వర్తిస్తుంది. ఎవరో పుట్టిస్తేనే తిట్టైనా పుట్టేది. నిజమే కానీ ఇంకెవరో ముదుర్లు ముందుగా వాటిని తమ ఖాతాల్లోకి జమేసేసుకోడమే కొరతకు మరో కారణం. ఆ పిచ్చి కూతల్నింక మరే సన్నాసి నేత వాడినా నో యూజ్! సరి కదా.. కుంకల పార్టీ వంక కన్నేసాడన్న పుకార్లు పుట్టి పుట్టి మునిగే ప్రమాదం కద్దు. ఎవరి స్తోమతులకు తగ్గట్లుగా వాళ్లే తప్పుడు కూతల్ని వెదికి పట్టుకుని తమదైన శైలిలో పెందలాడే వాడకంలో పెట్టేసుకోడం సుఖం. ఓ పెద్దమనిషి ఎదుటి బుల్లి పెద్దని పప్పు అని తప్పు పడతాడు, ఆ బుల్లినేత చేతే మళ్లీ ఏ రక్త పింజారి అనో తిట్లు తింటాడు. ఒక ముఖ్య నేతను మరో ముఖ్య నేత దూత అనరాని మాటలన్నీ అని ఎన్నికలన్నీ అయిపుచ్చుకున్నాక అయాం సారీ! అని ముక్తాయింపిచ్చేస్తాడు. ఇంకో చాదస్తపు మర్యాదస్తుడికి తెగ ఒళ్లు మండినా తిట్టిపోసేందుకు చప్పున ఏ కూళ కూతా గట్టిది బుర్రకు తట్టి చావదు. ఏదో అనబోయి ఇంకేదో అనేసి మీడియాకి కడు నిండుగా భోజనం పెట్టేస్తాడు. థూ అని ఊసేసిన పక్షంలోకే తూఫ్ః మనేసి దూరిపోయే రాజకీయాలల్లో ఎది పాడు కూత? ఏది హితబోధ? సుద్ద పప్పు, గడ్డం బాబా, కామ పిశాచి, కిరాతక నేత. కోడి కత్తి.. తరహా కూతలన్నీ కొత్త తరం నేతలు పుట్టుకొచ్చే కొద్ది పాత తరం క్లాసిక్ అబ్యూజస్ అయిపోతాయ్!

మరీ సరికొత్త తరమొకటి తరముకొచ్చేస్తుందిప్పుడు. దానికి కిక్కెక్కించే కొత్త బూతుపదాలు దొరకబుచ్చుకునే పనే బూత్ మేనేజ్ మెంట్ కొత్త నిర్వచనం ఇప్పుడు! అశుద్ధ రాజకియాలకి సందర్భ శుద్ధులేంటి? టగ్ ఆఫ్ వార్ ముందున్నప్పుడు టంగ్ మీద కంట్రోలుంటేనే హర్డిల్. ఎన్నికల కోడులు కూడా ఎక్కడా పాడు కూతంటే అర్ధమేంటో ఇతమిత్థంగా తేలేదెప్పుడూ! కంగారులో మాకు మా వత్తు ఇవ్వడం మర్చేపోయాడు. వాస్తవానికా కామాంధుడి

కడుపులోని ఉద్దేశం మాత్రం రా.. అమ్మా! అనే అని తీర్మానాలొచ్చేసి ఖర్మగాలి క్రమశిక్షణ చర్యలూ తప్పని రాజకీయాలీ రోజుల్లోవి. అంత మాత్రానికే రామా అంటం మానేస్తామంటే అది రాజకోయాలకే అనర్థమవుతుంది. కాలం మీదే ఖర్మం ఆధారపడున్న పొలిటికల్ ఫీల్డులో బాపూజీ మూడు కోతుల ముచ్చట మీదనే పిచ్చి నమ్మకం పెట్టుకోడమే ఎవరి బావి వాళ్లే మళ్లీ బైటపడలేనంత తోతుగా తవ్వుకున్నట్లవుతుంది గానీ!

ఏడు దశాబ్దాల బట్టి ఎడతెరిపి లేకుండా వచ్చి పడుతున్న ఎన్నికల జాతర్లు మనవి! కొత్తగా చెత్త పదాల మీద ఇప్పుడీ రవంతాళీ ఏంటన్నది కదా క్వొశ్చన్? ఈ సారొస్తున్న సాధారణ ఎన్నికలంత సాధారణంగా ముగిసేవి కావు. పక్క పార్టీ గెలుపు గుర్రాల కింత మేత ఆశ చూపించి ఆకర్షించుకోడం, ఆఖరి సెకను దాకా పోటీదారులెవరో తేల్చక ఆపోజిషనోడి గుండెల్లోకి మెట్రోబళ్లు తోలించడం.. ఓకే.. ఓకే.. ఓపెన్ గా ఒప్పుకోవాలంటే చిన్నా



చితకా పార్టీలక్కూడా ఇప్పుడా జాకాల్స్ జిత్తులన్నీ ఊహించలేనంత జిమ్మిక్కుకులేం కావు. ఊహల కందనిదల్లా ఉచ్ఛనీచాలెరుగని ఏ భయంకర పదజాలంతో ఓటర్ల ముందు ఎదుటి పక్షం దూకుడు పెంచేస్తుందో అనే! అవతలి నేతగాడి ఏ దురుసు నిందలతో తమ రాజకీయ భవితవ్యం తలకిందులవుతుందో అనే! శుద్ధీ బుద్ధీ లేని కూతలు ఊరూ వాడా తిరిగి ముందే పోగేసి పెట్టుకుంటే గానీ.. ఎంత లావు రాజకీయ జ్ఞానికైనా ఈ సారి ఎన్నికల్లో కత సుఖాంతమయేటంత సీను లేదు మరి. తిట్టనేది నోటికి రానిచ్చేది లేదని శపథం పట్టి ప్రయోజనం శూన్యం. బూతు సినిమాలు, వీడియోలు లైవ్ లో చూసి చుసి జనాలు విసుగెత్తున్నారు ! రాబోయే ఎన్నికల వైపే ఆశగా చూస్తున్నారు. ప్రజాస్వామ్య మిదన్న ఇంగితం మరవున పడితే ఎంత ప్రజానాయకుడి కథయినా చివరికి పోయేది కంచికే.. గతాలు గుర్తుంచుకొంటే మంచిది! మంచి మాటలే చెబుతామంటున్న పెద్దలంతా ముందా ఒట్టును బుద్ధిగా గట్టున కట్టేసుకోండి! ఎన్నికల గోదాట్లోకి దూకినా గట్టున పడాలంటే పుట్ల కొద్దీ తిట్ల పురాణాలను నమ్ముకోక తప్పని దుస్థితి! ఎంత చెడ్డ తిట్టుకి అంత దొడ్డతనంగా ఉందిప్పటి కటిక పరిస్థితి. నాలుగోట్లు ఎక్కువ రాలాలంటే రాలుగాయితనంలో రాటుదేలి తీరాల్సిందే!

నిబద్ధతతో నాలుగు నీచపదాలైనా నోటికి పట్టించుకోలేని శుంఠలకు నేటి పాలిటిక్సులో నో ఎంట్రీ! మత్స్యం నుంచి స్కాందం దాకా.. అష్టాదశ పురాణాలున్నాయి మనకు. ఏం లాభం?

తిట్లకంటూ ఏ ప్రత్యేకంగా ఏ పురాణం లేనప్పుడు! ఫ్చ్! ఎంత లోటు! ఎన్నికలు కదా! మరీ కొట్టచ్చినట్లు కనపిస్తుందిప్పుడా చేటు. తీర్మానాలు, మ్యానిఫెస్టోలు, వైట్ పేపర్లు, పాయింట్ బై పాయింట్ ఒకర్నొకరు ఎండగట్టుకోడాలు, ప్రజాకోర్టుల్లో పెట్టే ఛార్జీషీట్లు.. గత్రాలు! ఓకే..

ఓకే.. వేల రకాల జోకులు పార్టీల ముందు ప్రయోగాలకి ఎప్పుడూ సిద్ధంగా ఉండేవేలే సాధారణంగా ఏ సాధారణ ఎనికలకైనా ముందు! అనూహ్యంగా అసభ్యమైన పదజాలంతో హఠాత్తుగా ఎదుటి వాడి మీద దాడికి తెగబడే పద్ధతొక్కదానికి మాత్రమే ఇప్పుడు బాగా పదును! తిరిగే కాలు కన్నా తిట్టిపోసే నోరే తిరుగులేని ఆయుధం ఇవాల్టి తింగరి పాల్టిక్సులో!

ఏ పార్టీ ప్రజలకేం ఒరగబెట్టింది, బెడుతున్నది, బెట్టపోతున్నదన్న బెడద ఓట్లేసే అమాయక జనాలకే పట్టడంలేదు! సంక్షేమ పథకాల మీద ఆసక్తి కన్నా ఏ పార్టీ పెద్దాయన ఏ తరహా శుద్ధ అశుద్ధ పదాలతో దాడికి దిగబోతున్నాడన్న దాని మీదనే.. దాం తాడు తెగ.. మీడియాక్కూడా ఏక్కడలేని ఫోకస్! సాక్షాత్ విదురుడే వాలంటీరుగా వస్తానన్నా ఈ కల్లల కాలంలో విజ్ఞత గల ఏ పార్టీ సలహాదారు డుగానైనా పెట్టుకోదు. పజ్జెనిమిదో శతాబ్ది నాటి కథే మళ్లి రిపీట్ అవుతుందా ఇప్పుడు? కాసుల పురుషోత్తం అనే ఓ కవి పుణ్యాత్ముడు ఉత్తి పుణ్యానికి ఘంటసాల శ్రీకాకుళం దాకా వెళ్లి అక్కడి ఆంధ్ర మహావిష్ణువుని తగులుకున్నాడు! 'ఆంధ్రనాయక శతకం' వంకతో పాపం ఆ గాడ్ గారిని తో సీస పద్యాలల్లో తెగ ఆడుకున్నాడు! ఏనాడో విజయనగరం మహారాజుల కాలంలో ఓ వెలుగు వెలిగిన ఆ దేవుడు ఇప్పుడు ఏ చక్రమూ తిప్పలేక చతికిల పడున్నాడన్నది ఆ కవిగారి ఆక్రోశం. పట్టించుకోకుండా వదిలేసిన పై నున్న పెద్ద రాజుల్ని తిట్టాలి నిజానికి. వాళ్ల నిర్లక్ష్యాన్ని వేలెత్తయినా చూపించకుండా బండరాయిలా పడుండే దేవుణ్ని పట్టుకుని పాపం ఈ కాసుల కవిగారి కూసుళ్లకర్థమేంటో! నిందల మీద నిందలేసుకుంటూ పోయే శిశుపాలుడి వారసులకే యమ డిమాండుగా ఉందీ నాటి రాజకీయ నాటకాల్లో. పాడు నోరు ఒక్కటుంటే చాలు .. పాదాభివందనాలే! ఏం చేసైనా సరే తమలో కలిపేసుకు తీరాలనే! ఎన్నికల పేకాటలో ఇంకే తుర్ఫు ముక్క అక్కర్లే దిప్పుడు. గతంలో తుపుక్కుమని ఉమ్మేసిన పదాలన్నింటినీ తిరిగి తెచ్చేకుని పొల్లు పోకుండా పొద్దస్తమానం ఊసేసే పాటి తెంపరితనం ఉంటే సరి.. గెలుపు గ్యారంటీ మరి!

ప్రజాస్వామ్యం.. అవినీతి రహిత రాజ్యం అంటూ తుళ్లింతలు పోయే మూర్ఖ శిఖామణులను ఏ చతురాత్మా చతుర్వ్యూహః చతుర్దంష్ట్ర చతుర్భుజమ్ మార్కు అవతార మూర్తులొచ్చినా సేవ్ చేసేటంత సీను లేదిప్పుడ ! ముందు పోయి ఓ నలుగురు పలుగాకుల మధ్య నలిగి నాలుగు ఆకతాయి ముక్కలు ముక్కున కరుచుకురా తమ్ముడూ.. ఫో ! తలకెక్కిందా!

ఎక్కిందిరా అడిబండా !

కొద్దిగా ఏం ఖర్మ.. కొండంత గుండడి గుండగొయ్య!

మొండికట్టె మొప్పె! పడిసేటు గరాసా!

కొయ్యతిప్పు కూళ ! దూబర దిండి పలుగాకి!

సుద్దులమారి డబ్బాకోరు!

ఏందిరా ఏబ్రాసీ ఈ దుర్భాషా స్రవంతి?

మరి నువ్వే కదరా దరిబేసి!

పిచ్చి కూతలు నాలుగు ముందు పోగేసుకు రమ్మన్న వాగింది! మన నేతాశ్రీల నోళ్ల నుంచి విని పట్టుకున్న గబ్బు కూతల్లో గుర్తున్నంత వాటిలో ఇవి కొన్నేరా బందెలమారి ! ఇంకా జెరికి, వాజ, చేడి, పెయ్య లాంటి తేలిక తిట్లు బోలెడు పుట్లకొద్దీ మా నోట్లో ఊరుకొస్తున్నాయ్! అవీ ఇప్పుడే కక్కేయమంటావా ధగిడికె! ఒద్దొద్దులే! పెద్ద ఎన్నికల తద్దినాలు తొందర్లోనే రానున్నాయ్! ముందెళ్ళి ఏ పెద్ద పార్టీలోనో టిక్కెట్టుకోసం తిప్పలు పడు! ఈ బూతుల స్పిరిటే కంటిన్యూ చేస్తే గెలుపు గ్యారంటీ! బెస్టాఫ్ లక్ రా సన్నాసి తమ్ముడా!

సూర్య లేఖలు

ఏ నావదే తీరమో -ఏ నేతదే కూటమో !

దేశంలో సార్వత్రిక ఎన్నికలు సమీపించే కొలదీ రాజకీయ ముఖచిత్రంలో స్పష్టత రావడం పోయి మరింత అయోమయం అలముకొంటుంది. ప్రజల్ని కన్ఫ్యూజ్ చేసి కొట్టేద్దామని వివిధ పక్షాల వ్యూహం అయితే అయి ఉండొచ్చు కానీ అసలు అజెండాలు మరుగున పడి ఆపద్ధర్మ ఎజెండాలతో జెండాలు ఎగురుతున్నాయి. ప్రస్తుతానికి స్థూలంగా నాలుగు స్థంభాలాట నడుస్తోంది. ఒకటి కమల మిత్రులు,రెండోది కాంగ్రెస్ మిత్రులు మూడోది పక్కా ప్రాంతీయ వాదులు నాలుగోది పక్క చూపుల ప్రాంతీయవాదులు. ఈ నాలుగు కూటములూ ఉన్నా అవి మళ్ళీ రాయిలాంటి స్థిరమైన బంధం కలవి కావు, మెత్తని ప్లాస్టిక్ లాంటి బంధం కలవి. అవసరం బట్టీ, అవకాశం బట్టీ, అనుకూలత బట్టీ మారగలిగేవి. ఎందుకలా అనాల్సి వస్తుందంటే రాహుల్ ప్రధాని అభ్యర్థి అన్న డీఎంకే స్టాలిన్ కలకత్తా మమత ర్యాలీకి వెళ్ళాడు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు సమదూరం అన్న మాయావతి అదే పాట ఎత్తుకున్న మమత ర్యాలీకి డుమ్మా కొట్టారు. ఏదో తన పార్టీ తరపున వేరే లీడర్ని పంపినా అది మొక్కుబడి చర్యనే. మిగతా ప్రాంతీయ పార్టీల్లో చాలావరకూ అదే వైఖరి.

అయితే ఈ మార్పుకి పార్టీలనే నిందించనక్కర లేదు. పరిస్థితులు అలా ఉన్నాయి. జాతీయ పార్టీలు ఒంటి చేత్తో మెజారిటీ సాధించే పరిస్థితి మృగ్యం. చెయ్యి అనుకున్నంత పైకి లేవడం లేదు. కమలం తాజాదనంతో లేదు. రానున్నది సంకీర్ణ యుగంలా కనబడుతోంది. ప్రాంతీయ శక్తులు ఎక్కడివక్కడ బాహుబలులు కానీ జాతీయ స్థాయిలో దుర్బలులు. ఒకరి ఆసరా ఒకరికి అవసరం. కనుక ఇప్పుడెన్ని కూటములు ఏర్పడినా, ఎన్ని ఒప్పందాలు కుదిరినా అవి ఎన్నికల వరకే. ఎన్నికలు జరిగిన మరుసటి రోజే లెక్కలు మారిపోతాయి. వచ్చే ఫలితాలే మిత్రుల్ని, శత్రువుల్ని, కూటముల రూపురేఖల్ని నిర్ణయిస్తాయి. అంతవరకూ సాగేవి తాత్కాలిక సర్దుబాట్లు మాత్రమే. పౌరసమాజం ఇప్పుడే అప్రమత్తతతో ఉండాలి. అభివృద్ధి, సంక్షేమం, ఉపాధి, ఉద్యోగంలాంటి ప్రాముఖ్యత కల అంశాలు వెనక్కిపోయి, భావోద్వేగాలు ముంచుకురాకుండా, ముందుకు రాకుండా తామే ప్రజల తరపున ఎజెండా తయారుచేయాలి. వివిధ పక్షాలు దానికి కట్టుబడేలా వత్తిడి తీసుకురావాలి.

–డా.డి.వి.జి.శంకరరావు, మాజీ ఎంపీ, పార్వతీపురం



పెరిగిన బంగారం, వెండి ధరలు

న్యూఢిల్లీ : బంగారం ధర వరుసగా రెండో రోజు శనివారం తగ్గింది. స్థానిక నగల వ్యాపారుల నుంచి డిమాండ్ తగ్గడంతో పది గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర రూ. 60 మేర తగ్గి రూ. 33160 స్థాయికి చేరుకుంది. స్థానిక పరిస్థితుల ప్రభావంతో పాటు అంతర్జాతీయ మార్కెట్లోనూ ట్రెండ్ బలహీనంగా ఉండడమే ధర తగ్గుదలకు కారణమని బులియన్ వర్గాలు తెలిపాయి. మరో వైపు, వెండి కూడా బంగారం బాటలోనే నడించింది. వెండి ధర కిలోకు రూ. 280 మేర తగ్గి రూ. 40100 వద్ద నమోదైంది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ తగ్గడమే వెండి ధర క్షీణతకు కారణమని మార్కెట్ వర్గాలు తెలిపాయి.

అలాగే, అంతర్జాతీయంగా బంగారం ధర ఔన్స్‌కు 0.77 శాతం క్షీణించి 1282.55 డాలర్లకు పడిపోగా, వెండి ధర ఔన్స్‌కు 1.26 శాతం క్షీణించి 15.41 డాలర్లకు తగ్గింది. ఇక, దేశ రాజధాని ఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం ధర రూ. 60 తగ్గి రూ.33160 వద్ద నమోదు కాగా, 99.5 స్వచ్ఛత కలిగిన బంగారం ధర రూ. 33010గా నమోదైంది.

ఇక, సార్వభౌమ పసిడి పథకంలో 8 గ్రాముల బంగారం ధర రూ. 25500 వద్ద స్థిరంగా ఉంది.

బిజినెస్

బలహీనపడిన రూపాయి ప్రభావం

- పెట్రోల్ ధర 17 పైసలు, డీజెల్ ధర 19 పైసలు పెంపు
- పెరుగుతున్న క్రూడ్ ధరలు
- దేశీయ మార్కెట్‌పై ప్రభావం గణనీయం



హైదరాబాద్ : అంతర్జాతీయ చమురు మార్కెట్‌లో క్రూడాయిల్ ధర పెరుగుతుండడంతో ఆ ప్రభావం దేశీయ మార్కెట్‌పైన కనిపిస్తోంది. డాలర్ మారకంతో రూపాయి బలహీనపడుతుండడంతో ఆయిల్ కంపెనీలు క్రూడ్ ధరలు పెంచుతూ పోతున్నాయి. ప్రధాన నగరాల్లో లీటర్ పెట్రోల్ ధర 17, 20 పైసల మధ్య పెరగగా, లీటరు డీజెల్ ధర 20 పైసల వరకు పెరిగింది. ఢిల్లీలో శనివారం లీటర్ పెట్రోల్ ధర 17 పైసలు పెరిగి రూ. 70.72కు, డీజెల్ ధర 19 పైసలు పెరిగి రూ. 65.16 స్థాయికి చేరాయి. హైదరాబాద్‌లో లీటర్ పెట్రల్ ధర రూ. 75.03గా, లీటర్ డీజెల్ ధర రూ. 70.83కు చేరాయి. ముంబయిలో లీటర్ పెట్రోల్ ధర 17 పైసలు పెరిగి రూ. 76.35గా, డీజెల్ ధర 20 పైసలు పెరిగి రూ. 68.22గా ఉన్నాయి. చెన్నైలో పెట్రోల్ ధర రూ. 73.41గా, డీజెల్ ధర రూ. 68.82 స్థాయికి చేరాయి. కోల్‌కతాలో పెట్రోల్ ధర రూ. 72.82కు, డీజెల్ ధర రూ. 66.94కు చేరాయి. బెంగళూరులో పెట్రోల్ ధర రూ. 73.05గా, డజెల్ ధర రూ. 67.10గా ఉన్నాయి. అంతర్జాతీయ ముడి చమురు ధరల పెరుగుదల ప్రభావంతో దేశీయంగా కూడా చమురు ధరలు పెరుగుతున్నాయి. 2019 ప్రారంభం నుంచి ఇప్పటి వరకు పెట్రోల్ ధర లీటర్‌కు రూ. 1.82, డీజెల్ ధర రూ. 2 వరకు పెరిగాయి.

బీఎండబ్ల్యూ నుంచి రెండు కొత్త బైక్‌లు



న్యూఢిల్లీ : లగ్జరీ కార్ల తయారీలో ప్రసిద్ధి చెందిన బీఎండబ్ల్యూ రెండు ప్రీమియం బైకుల 2019 మోడళ్లను భారత మార్కెట్లో విడుదల చేసింది. బీఎండబ్ల్యూ కు చెందిన మోటార్ సైకిళ్ల తయారీ సంస్థ బీఎండబ్ల్యూ మోటరాడ్ భారత మార్కెట్లలో శుక్రవారం ఆర్1250జీఎస్, ఆర్1250జీఎస్ అడ్వెంచర్ పేరుతో రెండు బైకులను విడుదల చేసింది. ఈ సూపర్ బైక్‌లు బ్లాక్, బ్రీజ్, సిల్వర్ మెటాలిక్ రంగుల్లో , రెండు వేరియంట్లలో లభించనున్నాయి. దేశీయ డీలర్ల వద్ద బుక్కింగ్‌లు అందుబాటులో ఉన్నాయి. 1,254 సీసీ ట్విన్ సిలిండర్ ఇంజిన్,136హెచ్‌పీ పవర్,143 ఎన్ఎం గరిష్ఠ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. వీటి ధరల శ్రేణి రూ. 16.5 లక్షల నుండి 21.95 లక్షలుగా ఉంది.

ఫేస్‌బుక్ మెడకు జరిమానా ఉచ్చు

- డేటా బ్రీచ్ ఆరోపణల ఎఫెక్ట్
- భారం రూ.16 వేల కోట్ల పైమాటే?
- యూజర్ల వ్యక్తిగత వివరాలు అమ్ముకుందని ఆరోపణలు
- ఆరోపణలపై విచారణ జరుపుతున్న ఎఫ్‌టీసీ




న్యూయార్క్ : సోషల్ మీడియా దిగ్గజం ఫేస్‌బుక్ భారీ జరిమానా చెల్లించాల్సి రావచ్చనే వార్తలు వినిపిస్తున్నాయి. డేటా బ్రీచ్ ఆరోపణలతో ఇబ్బందు లు ఎదుర్కొంటున్న సంస్థపై మరో పిడుగు పడేలా ఉంది. ప్రపంచవ్యాప్తంగా తనకు ఉన్న 8.7 కోట్ల మంది ఫేస్‌బుక్ యూజర్ల డేటాను ఫేస్‌బుక్ అమ్ము కుంటోంద న్న ఆరోపణలు ప్రకంపనలు సృష్టిస్తు న్నాయి. వినియోగదారుల వ్యక్తిగత వివరాలను అ మ్ముకుని సంస్థ లాభపడుతోందన్న ఫిర్యాదుపై విచా రణ జరుపుతున్న ఫెడరల్ ట్రేడ్ కమిషన్ (ఎఫ్‌టీసీ) ఫేస్‌బుక్‌కు అత్యధిక జరిమానా విధించే అవకాశం ఉందని పరిశీలకులు చెబుతున్నారు. 'న్యూయార్క్ టైమ్స్' కథనం మేరకు ఫేస్‌బుక్‌కు దాదాపు రూ.16 వేల కోట్లకు పైగా జరిమానా విధించవచ్చునని భావిస్తున్నారు. 2012లో గోప్యత ఉల్లంఘనకు పాల్పడినందుకు గూగుల్‌పై ఎఫ్‌టీసీ ఇదే మొత్తం జరిమానా విధించింది. ఫేస్‌బుక్‌పై విధించే జరి మానా అంత కంటే ఎక్కువే ఉండవచ్చునని భావి స్తున్నారు. ఫేస్‌బుక్ యూజర్ల డేటా లీకైందని, ఇకపై అటువంటి పొరపాటు జరగకుండా చూస్తామని ఫేస్‌బుక్ సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ అమెరికా పార్లమెంటరీ కమిటీ ముందు హాజరై వివరణ ఇచ్చుకోవడం తెలిసిందే. ఆయన పత్రికల ద్వారా క్షమాపణలు కూడా తెలిపారు.

లాలూకు బెయిల్ మంజూరు

- 2006లో లాలూపై ఈ కేసు నమోదు
- రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసిన పటియాలా కోర్టు
- లాలూ కుటుంబీకులకు మధ్యంతర బెయిల్ పొడిగింపు

న్యూఢిల్లీ : రాష్ట్రీయ జనతా దళ్ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ రైల్వే శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఐఆర్‌సీటీసీ హోటళ్ల నిర్వహణకు సంబంధించి అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి లాలూకు బెయిల్ మంజూరైంది. ఢిల్లీలోని పటియాలా న్యాయస్థానం లాలూకు బెయిల్ మంజూరు చేసింది. తొలుత ఈ కేసుకు సంబంధించి లాలూకు గతంలో ఇచ్చిన మధ్యంతర బెయిల్‌ను ఈ నెల 28 వరకు పొడిగించింది. లాలూతో పాటు ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆయన భార్య రబ్రీ దేవి, కుమారుడు తేజస్వి యాదవ్‌కు కూడా మధ్యంతర బెయిల్‌ను ఈ నెల 28 వరకు పొడిగించారు.

అయితే, లాలూకు రెగ్యులర్ బెయిల్ మంజూరు విషయమై ఈ నెల 28న తీర్పు ప్రకటిస్తామని న్యాయస్థానం తెలియజేసింది. కానీ, శనివారం మధ్యాహ్నం మరోసారి విచారించిన కోర్టు ఆయనకు రెగ్యులర్ బెయిల్ ఇచ్చేందుకు అంగీకరించింది. లక్ష రూపాయల బెయిల్ బాండ్, ఒకరి పూచీకత్తుతో బెయిల్ మంజూరు చేసింది.



కాగా, 2006లో ఐఆర్‌సీటీసీలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై లాలూ, ఆయన కుటుంబంపై సీబీఐ కేసు నమోదు చేసింది.

ఢిల్లీ రియల్టీ రంగంపై

ఐటీ కొరడా



న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీ పరిధి లోని రియల్టీ రంగంలో రూ. 20 వేల కు పైబడి నగదు రూపంలో లావాదేవీలు జరిపిన వ్యాపారులు అందరికీ అక్కడి ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ తాఖీదులు జారీ చేయనున్నట్లు సమాచారం. ఇందు నిమిత్తం ఇప్పటి వరకు జరిగిన రిజిస్ట్రేషన్లను ఐటీ అధికారులు జల్లెడ పడుతున్నారు. తద్వారా 2015-18 కాలంలో జరిపిన స్థిరాస్తి కొనుగోళ్లు, అమ్మకాల్లో అవకతవకలపై కొరడా ఝళిపించనున్నారు. ఇప్పటికే అక్కడి ఐటీ బృందాలు 21 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సోదాలు జరిపాయి. 2015 జున్ 1 నుంచి గత డిసెంబర్ వరకు జరిపిన రూ. 20 వేలకు పైబడి జరిగిన నగదు లావాదేవీల వివరాలన్నీ ఐటీ బృందాలు సేకరించినట్లు సీనియర్ అధికారి ఒకరు తెలియజేశారు. నల్ల ధనం ఎక్కువగా స్థిరాస్తి రంగంలోకి మళ్లుతున్న విషయాన్ని పసిగట్టిన ఐటీ శాఖ రియల్టీ సెక్టార్‌లో సెక్షన్లకు పలు మార్పులు చేసింది. కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు ఆదేశాల ప్రకారం 2015 జూన్ 1 నుంచి వ్యవసాయ భూములతో సహా రియల్ ఎస్టేట్‌కు సంబంధించి ఎటువంటి లావాదేవీలు జరిపినా అది చెక్, ఆర్టీజీఎస్, ఈ-చెల్లింపుల ద్వారానే జరగాల్సి ఉంటుంది. నిబంధనలు అతిక్రమిం చి ఇటువంటి లావాదేవీలు జరిపినట్లయితే సెక్షన్ 271డి ప్రకారం అమ్మకందారుడు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. వచ్చే నెలలో నిబంధనలు అతిక్రమించి లావాదేవీలు జరిపిన అమ్మకందారులు, కొనుగోలుదారులకు ఆదాయ పన్ను శాఖ అధికారులు నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిసింది. రూ. 20 వేలకు పైబడి తీసుకున్న నగదుపై లావాదేవీలపై జరిమానా విధించనున్నారు. ఈ సందర్భంగా కొనుగోలుదారుడు కూడా ఆ నగదు ఎక్కడి నుంచి వచ్చిందో లెక్క చెప్పాల్సి ఉంటుందని ఐటీ అధికారి ఒకరు తెలిపారు.

'జొమాటో'తో జత కట్టిన పేటీఎం

- పేటీఎం యాప్ పైన రెస్టారెంట్ల నుండి ఫుడ్ ఆర్డర్ చేసుకోవచ్చు
- ప్రస్తుతం ఢిల్లీ ఎన్‌సీఆర్‌లోని ఆండ్రాయిడ్ వినియోగదారులకు అందుబాటులో
- టైర్ 2, టైర్ 3 పట్టణాలలో ఆన్‌లైన్ ఫుడ్ ఆర్డరింగ్ పెరుగుదలే లక్ష్యం

న్యూఢిల్లీ : డిజిటల్ చెల్లింపుల కంపెనీ అయిన పేటీఎం ఆన్‌లైన్ ఫుడ్ ఆర్డరింగ్, డెలివరీ కోసం 'జోమాటో'తో జత కట్టినట్లు ప్రకటించింది. ఈ నూతన సదుపాయం ద్వారా పేటీఎం వినియోగదారులు తమ పేటీఎం యాప్‌పైనే తమకు నచ్చిన రెస్టారెంట్ల నుండి ఫుడ్ ఆర్డర్ చేసుకోవచ్చు.



ఈ నూతన సేవలు ప్రస్తుతం ఢిల్లీ ఎన్‌సీఆర్‌లోని ఆండ్రాయిడ్ వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయి. పేటీఎం ఐఓఎస్ యాప్ వినియోగదారులతో పాటు దేశవ్యాప్తంగా ఇతర వినియోగదారులకు త్వరలోనే దీనిని అందుబాటులోకి తీసుకురానున్నట్లు సంస్థ తెలిపింది. టైర్ 2, టైర్ 3 పట్టణాలలో ఆన్‌లైన్ ఫుడ్ ఆర్డరింగ్ పెరుగుదలే లక్ష్యంగా ఈ ఒప్పందం చేసుకున్నట్లు సంస్థ అధికారులు తెలిపారు. కాగా, 'జోమాటో'లో 100 నగరాలలో 80 వేలకు పైగా రెస్టారెంట్లు అందుబాటులో ఉన్నాయి.

అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌కు షాక్ ఇవ్వనున్న రిలయన్స్

న్యూఢిల్లీ : ఈ-కామర్స్ దిగ్గజాలు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లకు షాక్ ఇచ్చేందుకు ముకేశ్ అంబానీ సారథ్యంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ సిద్ధం అవుతోంది. ఆసియాలోనే అత్యంత సంపన్నుడైన అంబానీ తన జియో టెలికమ్ సర్వీస్‌ను, రిటైల్ నెట్‌వర్క్‌ను ఏకం చేసి అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌కు దీటుగా ఈ-కామర్స్ సంస్థను ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. గుజరాత్‌లోని 12 లక్షల మంది చిన్న రిటైలర్లు, షాప్‌కీపర్లతో జియో-రిలయన్స్ రిటైల్ కలిపి ఆన్‌లైన్ మార్కెట్ ప్లేస్‌ను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ప్రస్తుతం రిలయన్స్ జియోకు 280 మిలియన్ల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. అంబానీకి చెందిన రిటైల్ నెట్‌వర్క్‌లో దాదాపు 10 వేల అవుట్‌లెట్లు ఉన్నాయి. వాటిలో 6500 అవుట్‌లెట్లు పట్టణాలు, నగరాల్లో ఉన్నాయి.



కేంద్ర ప్రభుత్వం గత నెలలో ఈ-కామర్స్ సంస్థల విషయంలో నిబంధనలను కఠినతరం చేసింది. తమ వాటాలు ఉన్న సంస్థల ఉత్పత్తులను విక్రయించరాదని ప్రభుత్వం ఆంక్షలు విధించింది. అలాగే, ఏదైనా ఉత్పత్తిని తమ ఫ్లాట్‌ఫామ్‌లోనే ఎక్స్‌క్లూజి వ్‌గా విక్రయించాలని బలవంతం చేయకూడదని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఆంక్షలు అమెజాన్, వాల్‌మార్ట్ సొంతమైన ఫ్లిప్‌కార్ట్‌లపై తీవ్ర ప్రభావం చూపాయి. రిలయన్స్ వంటి స్థానిక సంస్థలకు మేలు చేసేందుకే ఇటువంటి నిబంధనలు తీసుకు వస్తున్నట్టు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ భావిస్తున్నాయి. కాగా, రిలయన్స్ నుంచి త్వరలోనే రానున్న ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌కు సంబంధించిన పూర్తి వివరాలను ఈ ఏడాది జూలైలో అంబానీ వెల్లడించనున్నారు.

ఫేస్‌బుక్ సంచలనం 'బూ' మరణించింది

న్యూఢిల్లీ : సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండేవారికి 'బూ' అనే కుక్క గురించి తెలిసే ఉంటుంది. కోటి మందికి పైగా ఫాలోయర్లు ఉన్న ఈ బుజ్జి కుక్కపిల్ల సోషల్ మీడియాలో ఓ సెన్సేషన్. ఎందుకంటే ఏ జంతువుకూ ఇంత మంది ఫాలోయర్లు లేరు. అయితే, 'బూ' గురించి ఓ చేదు వార్త తెలిసింది. 'బూ' శుక్రవారం మరణించిందనే వార్త ఫేస్‌బుక్ అధికారిక ఖాతాలో పోస్ట్ కనిపించింది.



పొమె రేనియన్ జాతికి చెందిన ఈ కుక్క పేరు 'బూ' కొంత కాలంగా ఫేస్‌బుక్‌లో ఇదో సెలబ్రిటీగా మారిపోయింది. సెలెబ్రిటీ అంటే అలాంటి ఇలాంటి సెలెబ్రిటీ కాదు. ఏకంగా 1.66 కోట్ల మంది ఫాలోయర్లు ఉన్నారు.

'బూ' శుక్రవారం ఉదయం నిద్రలోనే చనిపోయిందని యజమానులు 'బూ' ఫేస్‌బుక్ ఖాతాలో తెలిపారు. 2017లో దాని సహచర కుక్క మరణించినప్పటి నుంచి 'బూ' ఆరోగ్యం స్థిరంగా లేదని అన్నారు. 'బూ' చాలా చలాకీగా ఉండే కుక్క అని, అయితే, దానికి గుండెపోటు రావడం బాధాకరమని అన్నారు.

'బూ' పేరుతో ఫేస్‌బుక్ పేజీ ప్రారంభించినప్పటి నుంచి అనేక మంది 'బూ'ను ఫాలో అవుతూ వచ్చారని, మీ ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలని ఆ పోస్టులో రాసుకొచ్చారు.

అత్యధిక వృద్ధి రేటు సాధించామన్నది అబద్ధం


న్యూఢిల్లీ : జాతీయ ప్రజాస్వామ్య కూటమి హయాంలో అత్యధిక వృద్ధి రేటు సాధించినట్లు భారతీయ జనతా పార్టీ అబద్ధాలు చెప్పుకుంటున్నదని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పి. చిదంబరం ఆరోపించారు. ఈ మేరకు ఆయన ట్విటర్ ద్వారా బిజెపిపై ధ్వజమెత్తారు. బిజెపి చెప్పుకుంటున్నట్లుగా సాధించిన వృద్ధి రేటును ఆర్థిక శాస్త్ర, గణాంకాల నిపుణులు కూడా వ్యతిరేకిస్తున్నారని ఆయన తెలిపారు. 'నీతి ఆయోగ్ సమర్పించిన తప్పుడు నంబర్ల ఆధారంగా ఎన్‌డిఎ హయాంలోనే అత్యధిక వృద్ధి రేటును సాధించినట్లు బిజెపి చెప్పుకొంటున్నది. బిజెపి చెబుతున్న వాటిని ఆర్థిక శాస్త్ర నిపుణులు, గణాంక నిపుణులు అందరూ వ్యతిరేకిస్తున్నారు. నిజమేమిటంటే ఐక్య ప్రగతిశీల కూటమి హయాంలో (2004-2009) మాత్రమే అత్యుత్తమైన వృద్ధి సాధించాం. నిజానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అత్యుత్తమైన వృద్ధి రేటు అదే. ఇటీవల కేంద్ర గణాంకాల కార్యాలయం (సిఎస్ఓ), ఆగస్టులో ఎన్ఎస్‌సి కమిటీ ప్రకటించిన గణాంకాలు మాత్రమే విశ్వసనీయమైనవి' అని చిదంబరం ట్వీట్ చేశారు. ఆయనతో పాటు మరో కాంగ్రెస్ సీనియర్ నేత అహ్మద్ పటేల్ కూడా బిజెపి ప్రభుత్వం తీసుకువస్తున్న ఆర్థిక విధానాలను విమర్శించారు. గత నాలుగున్నర సంవత్సరాలలో దేశ అప్పులు 50 శాతం పెరిగాయని అహ్మద్ పటేల్ విమర్శలు గుప్పించారు.



ఎల్‌జీ వీ40 థింక్యూ సేల్

- 5 కెమెరాల ఎల్‌జీ వీ40 థింక్యూ అమెజాన్‌లో భారీ ఆఫర్
- రూ. 10 వేల తగ్గింపుతో రూ.49వేలకే లభ్యం
- ఎంఆర్‌పీ రూ. 60 వేలు

న్యూఢిల్లీ : ట్రిపుల్ రియర్ కెమెరాలతో ఎల్‌జీ వీ40 థింక్యూ స్మార్ట్ ఫోన్ ఇప్పుడు మార్కెట్లో అందుబాటులోకి వచ్చింది. శనివారం నుంచి ఈ స్మార్ట్ ఫోన్ విక్రయానికి లభ్యం అవుతోంది. ఎల్‌జీ వీ40 థింక్యూ వెనుక వైపు మూడు, రెండు సెల్ఫీ కెమెరాలు ఉండడం విశేషం. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో పని చేసే ఈ కెమెరాలు యూజర్లకు ఫోటోగ్రఫీలో కొత్త అనుభవం అందించనున్నాయి. ఈ స్మార్ట్ ఫోన్ గ్రే, బ్లూ కలర్స్‌లో లభ్యం కానున్నది. భారత మార్కెట్లో ధర రూ. 60 వేలు. అయితే, అమెజాన్ గ్రేట్ ఇండియన్ సేల్‌లో ప్రైమ్ సభ్యులకు మాత్రమే. రూ.49900కే లభిస్తోంది.



ఎల్‌జీ వీ40 థింక్యూ ఫీచర్లు :
6.40 అంగుళాల డిస్‌ప్లే
స్నాప్‌డ్రాగన్ 845 సాక్
1440/3120 పిక్సెల్స్ రిజల్యూషన్
ఆండ్రాయిడ్ 9 పై
6 జీబీ ర్యామ్, 128 జీబీ స్టోరేజ్
8+5 ఎంపీ ఫ్రంట్ కెమెరా
12+12+16 రియర్ కెమెరా
3300 ఎంఏహెచ్ బ్యాటరీప

గ్రేట్ ఇండియన్ సేల్‌కు

అమెజాన్ సిద్ధం

న్యూఢిల్లీ : ఈ-కామర్స్ సంస్థ అమెజాన్ మరోమారు గ్రేట్ ఇండియన్ సేల్‌కు సిద్ధమైంది. ఆదివారం నుంచి 23 వరకు నాలుగు రోజుల పాటు సంస్థ ఈ సేల్‌ను నిర్వహించనున్నది. అయితే, ఒక రోజు ముందుగానే అంటే శనివారమే ప్రైమ్ మెంబర్లకు సేల్ అందుబాటులోకి వచ్చింది. ఇది ఆదివారం అర్ధరాత్రి నుంచి అందరికీ అందుబాటులోకి రానున్నది. గ్రేట్ ఇండియన్ సేల్‌లో భాగంగా స్మార్ట్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్లెట్లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలపై సంస్థ రాయితీలు, గంపగుత్త ఆఫర్లు ప్రకటించింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో ఒప్పందం కుదుర్చుకున్న అమెజాన్ ఆ బ్యాంకు క్రెడిట్, డెబిట్ కార్డులతో కొనుగోలు చేసే వినియోగదారులకు 10 శాతం తక్షణ రాయితీ ప్రకటించింది. అలాగే, ఈఎంఐ లావాదేవీలకు కూడా ఈ ఆఫర్ వర్తిస్తుందని సంస్థ తెలిపింది. దీనితో పాటు 10 కోట్ల ఉత్పత్తులపై నో-కాస్ట్ ఈఎంఐ ఆప్షన్ కూడా ఉన్నట్లు సంస్థ తెలియజేసింది.



ఇద్దరు పీఎన్‌బీ డైరెక్టర్లపై వేటు



ముంబయి : పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను నీరవ్ మోడీ రూ. 13 వేల కోట్లకు మోసం చేసిన కేసులో ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. బ్యాంక్‌కు చెందిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సంజీవ్ శరణ్, కె. వీర బ్రహ్మజీరావులను విధుల నుంచి ప్రభుత్వం తొలగించింది. ఈ చర్యను ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ స్వాగతించింది. సంఘం ప్రధాన కార్యదర్శి సిహెచ్ వెంకటాచలం మాట్లాడుతూ, 'మేము కేంద్ర ప్రభుత్వ చర్యను స్వాగతిస్తున్నాం. అత్యున్నత నిర్వహణ బృందానికి తెలియకుండా ఇంత భారీ స్థాయిలో మోసం జరగడానికి అవకాశం లేదు. ప్రభుత్వం కూడా వారి వాదనలు విన్న తరువాతే ఈ నిర్ణయం తీసుకొంది' అని పేర్కొన్నారు. ఇదే తొలిసారి నేషనల్ బ్యాంక్స్ స్కీమ్ 1970 కింద ఒక జాతీయ బ్యాంక్‌కు చెందిన ఇద్దరు డైరెక్టర్లను తొలగించడం ఇదే తొలిసారి. 2018 జూలైలో శరణ్, బ్రహ్మజీలకు ప్రభుత్వం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. బ్రాడీ హౌస్ బ్రాంచ్‌లో స్విఫ్ట్ వ్యవస్థను దుర్వినియోగం చేయడంపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరించాలని నోటీస్‌లో ప్రభుత్వం కోరింది. వారి వివరణలు పరిశీలించిన అనంతరం బ్యాంక్ బోర్డు అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకొని వారిని ప్రభుత్వం తొలగించింది.

లాభాల్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్



న్యూఢిల్లీ : హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2018 అక్టోబర్- డిసెంబర్ త్రైమాసిక ఫలితాలను శనివారం విడుదల చేసింది. ఏడాదికేడాదికి పోలిస్తే సంస్థ నికర లాభం 20.31 శాతం పెరిగిందని బ్యాంక్ తెలియజేసింది. గత త్రైమాసికంలో సంస్థ నికర లాభం రూ. 5585.85 కోట్లు వచ్చినట్లు బ్యాంక్ వెల్లడించింది. అంతకు ముందు ఇదే త్రైమాసికంలో రూ. 4642.60 కోట్ల లాభం వచ్చినట్లు బ్యాంక్ తెలిపింది. ఈసారి నికర వడ్డీ ఆదాయం పెరగడంతో సంస్థ లాభపడినట్లు బ్యాంక్ తెలియజేసింది. కంపెనీ నికర వడ్డీ ఆదాయం గత త్రైమాసికంలో 21.9 శాతం పెరిగి రూ. 12576.75 కోట్లుగా నమోదైందని హెచ్‌డీఎఫ్‌సీ వెల్లడించింది. అంతకు ముందు ఏడాది ఇదే త్రైమాసికంలో నికర వడ్డీ ఆదాయం రూ. 10314.3 కోట్లుగా నమోదైనట్లు బ్యాంక్ తెలిపింది. ఇతర ఆదాయం డిసెంబర్ త్రైమాసికంలో 27.2 శాతం పెరిగి రూ. 4921 కోట్లుగా ఉందని బ్యాంక్ వెల్లడించింది.

మానవతా దృక్పథంతో బదిలీలు చేపట్టండి



హైదరాబాద్, మేజర్‌న్యూస్‌ః తెంగాణ సీఎం కేసీఆర్ కు వైసీపీ అధినేత జగన్ ఓ లేఖ రాశారు. అంతర్రాష్ట్ర ఉద్యోగుల బదిలీల అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతూ ఈ లేఖ రాశారు. అంతర్రాష్ట్ర బదిలీలను సత్వరమే పూర్తి చేయాలని, మానవతా దృక్పథంతో ఆలోచించి బదిలీలు చేపట్టాలని కోరారు. పరస్పర బదిలీలపై కమిటీ సవరణ ఉత్తర్వులు విడుదల చేయాలని, అవి వెలువడిన వెంటనే ఉద్యోగుల బదిలీలు జరపాలని ఆ లేఖలో జగన్ విజ్ఞప్తి చేశారు.

దాడులు ఆపకుంటే తీవ్రంగా ప్రతిఘటిస్తాం

కడప, మేజర్‌న్యూస్‌ః టీడీపీ నేతలు తమపై దౌర్జన్యం చేస్తున్నారనీ, దాడులు నిర్వహిస్తున్నారని ఆరోపిస్తూ వైసీపీ నేతలు కడప జిల్లాలో ఆందోళనకు దిగారు. కమలాపురం నియోజకవర్గంలోని ఎమ్మార్వో కార్యాలయం ముందు టీడీపీ నేతల దౌర్జన్యం, గూండాగిరి నశించాలి అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నేత వైఎస్ వివేకానందరెడ్డి, ఎమ్మెల్యే రవీందన్రాథ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ వైసీపీ నేతలు, కార్యకర్తలపై టీడీపీ నేతలు జులుం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైసీపీ శ్రేణులపై దాడులకు దిగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడులు, దౌర్జన్యాలు మరోసారి పునరావృతం అయితే తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు.


ఉనికిని కాపాడుకునేందుకే

• తాము మాత్రం దేశ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నాం • ఇదే తనకు, విపక్ష పార్టీలకు ఉన్న తేడా • విపక్షాలు ఇలాంటి ర్యాలీలతో వార్తల్లోకెక్కవచ్చు • ప్రజల హృదయాలను మాత్రం గెలవలేవు • వారు ఏకతాటిపైకి రాకముందే ఎన్నికల్లో సీట్ల గురించి చర్చలు • విపక్షాల ఐక్య ర్యాలీపై మోడీ విమర్శలు



సిల్వాసా: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలో కోల్‌కతా బ్రిగేడ్ మైదానంలో నిర్వహించిన విపక్షాల ఐక్య ర్యాలీపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విమర్శలు గుప్పించారు. గుజరాత్‌లోని సిల్వాసాలో జరిగిన ఓ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీలన్నీ తమను తాము కాపాడుకునేందుకు ప్రయత్నిస్తుంటే, తాను మాత్రం దేశ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నానని వ్యాఖ్యానించారు. ఇదే తనకు, విపక్ష పార్టీలకు ఉన్న తేడా అన్నారు. విపక్షాలు ఇలాంటి ర్యాలీలతో వార్తల్లోకెక్కవచ్చు గానీ ప్రజల హృదయాలను మాత్రం గెలవలేరన్నారు. మహా కూటమి నాకు వ్యతిరేకంగా ఏర్పాటు చేస్తున్నది కాదు. దేశ ప్రజలకు వ్యతిరేకంగా చేస్తున్నది. విపక్షాలన్నీ కలిసి ఏకతాటిపైకి రాకముందే వారంతా ఎన్నికల్లో సీట్ల గురించి చర్చలు జరువుతున్నారు అని విరుచుకుపడ్డారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్ర అసెంబ్లీకి భాజపా నుంచి ఒక్క ఎమ్మెల్యేనే ఉండటం వల్ల అన్ని పార్టీలు అక్కడ సమావేశమయ్యాయని మోడీ ఎద్దేవా చేశారు. ఒక్క ఎమ్మెల్యే ఉన్న పార్టీనే బంగాల్ ప్రభుత్వానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఆ ఒక్కడి నుంచి కాపాడుకోవడానికి రక్షించడం, రక్షించండి అని కేకలు వేస్తున్నారు అని విమర్శించారు. సభ అనంతరం ప్రధాని సిల్వాసాలో ఓ మెడికల్ కళాశాలకు శంకుస్థాపన చేశారు.

మోడీ ప్రభుత్వంలో తుగ్లక్ ఆదేశాలొస్తున్నాయి



న్యూఢిల్లీ: మోడీ ప్రభుత్వంలో రాత్రికి రాత్రి తుగ్లక్ ఆదేశాలు వస్తున్నాయంటూ బీజేపీ రెబెల్ నేత శతృఘ్న సిన్హా విమర్శించారు. కోల్ కతా లో బీజేపీ యేతర పక్షాలు నిర్వహించిన ర్యాలీ అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ, నోట్ల రద్దు వల్ల సామాన్య ప్రజలకు ఏం మేలు జరిగింది? నోట్ల రద్దుతో రైతులు, దినసరి కూలీలు, సామాన్యులపై తీవ్ర ప్రభావం పడిందని అన్నారు. రాత్రికి రాత్రి జీఎస్టీ అమలు చేశారని, చిరు వ్యాపారాలు, సంస్థలపై జీఎస్టీ తీవ్ర ప్రభావం చూపిందని విమర్శించారు. దీనిపై ఎలాంటి ఆలోచన, చర్చలు లేకుండా జీఎస్టీలో 300కు పైగా సవరణలు జరిగాయని విమర్శించారు. రాఫెల్ కుంభకోణం వ్యవహారాన్ని దాచేందుకు ఎందుకు చూస్తున్నారని ప్రశ్నించారు. కాపలాదారే దొంగ అని ప్రజలు అనుకుంటున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'రాఫెల్ విమానాల ధరలు మూడింతలు ఎందుకు పెరిగాయి? ఒక్కో విమానం రూ. 1600 కోట్లకు ఎందుకు కొనుగోలు చేశారు? ప్రభుత్వ రంగ సంస్థ హెచ్ఏఎల్ కు విమానాల ఒప్పందం ఎందుకు ఇవ్వలేదు? సుఖోయ్ వంటి విమానాలు తయారు చేసిన ఘనత హెచ్ఏఎల్ కు ఉందని' ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. 'మోడీ హయాంలో మేడ్ ఇన్ ఇండియా ఎక్కడైనా కనబడిందా? చైనా నుంచి ఇబ్బడిముబ్బడిగా వస్తున్న వస్తువులను అడ్డుకున్నారా? హామీలు మాత్రం ఘనంగా ఇచ్చారు. చర్యలు మాత్రం శూన్యమ'ని ధ్వజమెత్తారు. విపక్షాలంతా ఏకమవ్వాల్సిన సమయమొచ్చిందని ఈ సందర్భంగా శతృఘ్న సిన్హా పిలువునిచ్చారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ మైదానంలో విపక్షాలు చేపట్టిన ఐక్యతా ర్యాలీకి బీజేపీ ఎంపీ శత్రుఘ్న సిన్హా హాజరుకావడంపై భాజపా నేత రాజీవ్ ప్రతాప్ రూడీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సిన్హా పేరు ప్రస్తావించకుండా ఆయనపై తీవ్ర విమర్శలు చేశారు. కొంతమంది తెలివి వేరే విధంగా ఉంటుంది.

వచ్చే అయిదేళ్లలో తెలంగాణ సస్యశామలం

• అన్ని ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేస్తాం • సంక్షేమం, అభివృద్ధికి తగిన ప్రాధాన్యత • సంక్షేమమే రెండోసారి గెలిపించింది • హామీలన్నీ అమలు చేస్తాం • మిగులు విద్యుత రాష్ట్రంగా తెలంగాణ నిర్మాణం • పెన్షన్లు రూ. 2016 అందచేస్తాం • కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ కొనసాగిస్తాం • రైతు బంధు కింద ఎకరాకు రూ.10వేలు • ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ నరసింహన్ ప్రసంగం • అనంతరం సభ రేపటికి వాయిదా

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: ఆరు దశాబ్దాల సుదీర్ఘ పోరాటం ద్వారా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కల సాకారం అయిందని ఉమ్మడి తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ అన్నారు. ప్రజల ఆశీస్సులతో టీఆర్ఎస్ పార్టీ భారీ మెజార్టీ సాధించి రెండోసారి అధికారంలోకి వచ్చింది. అభివృద్ధి, సంక్షేమం దిశగా ప్రభుత్వం పయనిస్తోంది అని గవర్నర్ నరసింహన్ స్పష్టం చేశారు. తెలంగాణ రెండో శాసనసభలో గవర్నర్ నరసింహన్ ఉభయసభలను ఉద్దేశించి శనివారం ప్రసంగించారు. సాగునీటి ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తోంది. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసందుకు ప్రభుత్వం కృాఎషి చేస్తోంది. కొత్తగా ఎన్నికైన శాసనసభ్యులకు నరసింహన్ అభినందనలు తెలిపారు. ముందుగా తెలుగులో తన ప్రసంగాన్ని ప్రారంభించిన ఆయన అనంతరం ఆంగ్లంలో ప్రసంగిస్తూ ముగింపు సైతం తెలుగులో ముగించారు. సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి ప్రభుత్వం ముందుకుసాగుతోందని.. విద్యుత్ కోతలను అధిగమించి ప్రభుత్వం తొలి విజయం సాధించిందని చెప్పారు.

నీటిపారుదల రంగానికి 1.17లక్షల కోట్లు : నీటి పారుదల రంగానికి గడిచిన నలుగున్నరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం 77 వేల 777 కోట్ల ఖర్చు చేసింది. రాబోయే కాలంలో లక్షా 17 వేల కోట్ల అంచనా వ్యయంతో పనులు చేస్తుంది. సమైక్య రాష్ట్రంలో ఉద్దేశ్యపూర్వకంగా ధ్వంసం చేసిన చెరువుల పునరుద్ధరణ కోసం చేపట్టిన మిషన్ కాకతీయ సత్ఫలితాలనిచ్చింది. ఇప్పటికే నాలుగు దశల్లో 20 వేల 171 చెరువుల పునరుద్ధరణ చేయడం జరిగింది. తెలంగాణ వచ్చేనాటికి తీవ్ర విద్యుత్ సంక్షోభం నెలకొని ఉంది. ఈ సంక్షోభాన్ని తెలంగాణ తొమ్మిది నెలల్లోనే అధిగమించింది. రాష్ట్రాన్ని మిగులు విద్యుత్ రాష్ట్రంగా మార్చేందుకు 28 వేల మెగావాట్ల స్థాపిత సామర్థ్యం గల కొత్త విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. 1080 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న భద్రాద్రి పవర్ ప్లాంట్‌లో ఈ ఏడాది నుంచే ఉత్పత్తి ప్రారంభిస్తామని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను. తెలంగాణ ఏర్పడే నాటికి 7,778 మెగావాట్ల స్థాపిత విద్యుత్ సామర్థ్యం మాత్రమే ఉంటే ప్రస్తుతం16 వేల 503 మెగావాట్ల స్థాపిత విద్యుత్ సామర్థ్యం అందుబాటులో ఉంది. నా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయి. కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం అనేక రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా పురోగమిస్తోంది. అందువల్లనే రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వంపై విశ్వాసం ప్రకటిస్తూ తీర్పునిచ్చారు.

ఈ విజయాన్ని నా ప్రభుత్వం వినమ్రంగా స్వీకరిస్తూ.. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు చర్యలు ప్రారంభించింది. ప్రస్తుత పద్ధతిలోనే డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణం కొనసాగిస్తూ.. సొంత ఇంటి స్థలం ఉన్న పేదలకు గృహ నిర్మాణం కోసం ఐదు నుంచి ఆరు లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తాం. రైతు సమన్వయ సమితి సభ్యులకు గౌరవ భృతి లక్ష రూపాయల వరకు రైతు రుణ మాఫీ చేస్తాం.

ఎస్సీ ఎస్టీ జనాభా సమగ్ర అభివృద్ధి కోసం.. ప్రత్యేక పథకాల రూపకల్పన కోసం వేసిన కమిటీ ఇచ్చిన నివేదికను నా ప్రభుత్వం అమలు చేస్తోంది. చట్టసభల్లో బీసీలకు, మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల కోసం ప్రభుత్వం పోరాటం చేస్తోంది. ఎస్టీలకు 10 శాతం, మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్ల కోసం అసెంబ్లీ తీర్మానం చేసింది.. ఈ రిజర్వేషన్ల అమలు కోసం ప్రభుత్వం కేంద్రంపై రాజీలేని పోరాటం చేస్తోంది. ఎస్సీ వర్గీకరణ కోసం కూడా కేంద్రం పై పోరాటం చేస్తుంది. రైతులకు గిట్టుబాటు ధర రావడం కోసం పెద్ద ఎత్తున ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వం, ఐకెపి మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఈ యూనిట్లు పనిచేస్తాయి. సందర్భోచితంగా ఐకేపీ ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం యోచిస్తోంది.

ఐటీ రంగం అభివృద్ధిలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. జీఎస్టీ వసూళ్లలోనూ తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచింది.

మార్చి నాటికి మిషన్‌భగీరథ పూర్తి.: 2019 మార్చి నాటికి మిషన్ భగీరథ పథకం పూర్తవుతుంది. ఇప్పటికే మిషన్ భగీరథ ద్వారా అన్ని గ్రామాలకు, ఇంటింటికీ నల్లా ద్వారా మంచినీరు అందిస్తున్నాం. ఇటీవలే సీతారామ ప్రాజెక్టుకు అన్ని అనుమతులు సాధించడం సంతోషదాయకం. పాలమూరు – రంగారెడ్డి, కాళేశ్వరం ప్రాజెక్టుల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మిషన్ కాకతీయ ద్వారా సాగునీటితో పాటు భూగర్భ జలాలు పెరిగాయి.

రైతుబంధు రూ.10వేలు : రైతులకు పెట్టుబడి సాయంగా రైతుబంధు పథకం ప్రవేశపెట్టడం సంతోషదాయకం. ఈ పథకాన్ని దేశంలోని ఆర్థికవేత్తలు, వ్యవసాయవేత్తలు ప్రశంసించారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి రైతుబంధు కింద ఎకరాకు రూ. 10 వేల చొప్పున ఇవ్వబోతున్నాం. రైతుబంధు పథకంతో రైతులందరూ సంతోషంగా ఉన్నారు. తెలంగాణ ప్రారంభించిన రైతుబంధు పథకం దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఇప్పుడు దేశంలోని పలు రాష్ట్రాలు రైతుబంధు పథకం అమలు చేసే దిశగా ముందుకెళ్తున్నాయి. అస్తవ్యస్తంగా ఉన్న భూ వివరాలను క్రమబద్ధీకరించాం. రూపాయి ఖర్చు లేకుండా రైతులకు కొత్త పాసుపుస్తకాలు అందించాం. రైతు సమస్యలపై చర్చల కోసం రైతు వేదికలు నిర్మిస్తున్నాం. రైతుబీమా ద్వారా చనిపోయిన రైతు కుటుంబాలను ఆదుకుంటున్నాం. ఇప్పటి వరకు 282కోట్ల రూపాయలను ఈ పథకం ద్వారా రైతు కుటుంబాలకు అందజేశాం.

గాడిన పడుతున్న గ్రామీణ ఆర్థిక వ్యవస్థ : చిన్నాభిన్నమైన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఇప్పుడిప్పుడే మెరుగుపడుతోంది. ధ్వంసమైన కులవృత్తులు మళ్లీ జీవనం పోసుకుంటున్నాయి. చేనేత కార్మికులను ఆదుకోవడానికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టాం. ప్రభుత్వ అవసరాల కోసం చేనేత కార్మికుల నుంచి భారీ ఎత్తున వస్త్రాలు కొనుగోలు చేస్తున్నాం. వరంగల్‌లో టెక్స్‌టైల్ పార్క్ నిర్మాణానికి శంకుస్థాపన చేశాం. గద్వాలలో కూడా టెక్స్‌టైల్ హబ్ నిర్మించే యోచనలో ఉన్నాం. కేజీ టూ పీజీ ఉచిత విద్యలో భాగంగా గురుకులాలు ప్రారంభించాం.



ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం : వచ్చే విద్యాసంవత్సరంలో మరో 119 గురుకులాలు ఏర్పాటు చేయనున్నాం. ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేస్తున్నాం. డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేశాం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఔషధాల కోసం వచ్చే బడ్జెట్‌లో నిధులు మరిన్ని పెంచుతున్నాం. ప్రజల చెంతకే వైద్య సేవల కోసం బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేస్తున్నాం. ఉచిత వైద్య పరీక్షల కోసం తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్ ఏర్పాటు చేశాం. త్వరలోనే సూర్యాపేటలో వైద్య కళాశాల ఏర్పాటు చేస్తాం.

కేసీఆర్ కిట్ ఓ హిట్ : ప్రసూతి, శిశు మరణాలు తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాం. కేసీఆర్ కిట్‌లో శిశువు, తల్లి కోసం రూ. 2 వేల విలువ చేసే 16 రకాల వస్తువులు ఇస్తున్నాం. కంటి వెలుగు శిబిరాల్లో వైద్య పరీక్షలు కొనసాగుతున్నాయి. ఈ పథకం కింద ప్రజలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, కళ్లద్దాలు పంపిణీ చేశాం. త్వరలోనే ఈఎన్టీ శిబిరాలను గ్రామాల్లో ఏర్పాటు చేస్తాం. తండాలను గ్రామపంచాయతీలుగా మార్చి గిరిజనుల కలలు సాకారం చేశాం.

పోలీస్ కమాండ్ కంట్రోల్...

దేశానికే ఆదర్శంగా నిలిచేలా పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్మిస్తున్నాం. స్థానికులకే ఉద్యోగాలు దక్కేలా జోన్ల సంఖ్య, రిజర్వేషన్లు పెంచాం. ఆసరా పెన్షన్లు పెంచబోతున్నాం. ఎన్నికల్లో సాధించిన విజయాన్ని పునాదిగా చేసుకొని తెలంగాణ ప్రజల జీవితాల్లో వెలుగు నింపి వారికి ఆనందం, సంపద కలిగేలా బంగారు తెలంగాణ నిర్మాణం దిశగా నా ప్రభుత్వం పునరంకితం అవుతుందని ధృాఎఢ విశ్వాసం వ్యక్తం చేస్తున్నాను అని గవర్నర్ నరసింహన్ తెలిపారు.

సంక్షేమ పథకాల వల్లే రెండోసారి టీఆర్ఎస్‌ను ఆదరించారు...


తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి గిరిజనుల కలలను సాకారం చేశాం. కంటి వెలుగు ద్వారా ప్రజలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి కళ్లద్దాలు పంపిణీ చేస్తున్నాం. పరిపాలన, శాంతిభద్రతల విషయంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాం. స్థానికులకే ఉద్యోగాలు దక్కేలా జోన్ల సంఖ్య, రిజర్వేషన్లను పెంచాం. ప్రభుత్వ పారదర్శకత వల్ల రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయి. ఇప్పటికే కొత్తగా 4వేల పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేశాం.

త్వరలో ట్రంప్, కిమ్ భేటీ

న్యూఢిల్లీ: ఉత్తర కొరియా అణు కార్యక్రమం, క్షిపణి కార్యక్రమాల విధ్వంసం అనే అంశంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ ల మధ్య రెండవ శిఖరాగ్ర సమావేశం వచ్చే నెలలో జరగనుంది. అమెరికా అధ్యక్ష కార్యాలయమైన వైట్ హౌస్ ఈ మేరకు ప్రకటన చేసింది. వైట్ హౌస్ లో ఉత్తర కొరియా రాయబారి కిమ్ యోంగ్ చోల్ తో సమావేశం అనంతరం ఈ మేరకు ప్రకటన వెలువడింది. ఉత్తర కొరియా అణ్వాయుధ కార్యక్రమాన్ని రద్దు చేసుకుంటామన్న వాగ్దానం ఇంకా అమలు కాని అంశంపై కూడా ఈ సమావేశంలో చర్చ జరిగింది. అయితే, రెండవ శిఖరాగ్ర సమావేశం జరగాల్సిన స్థలంపై మాత్రం వైట్ హౌస్ స్పష్టత ఇవ్వలేదు. ట్రంప్, కిమ్ జోంగ్ మధ్య తొలి శిఖరాగ్ర సమావేశం గత ఏడాది జూన్ నెలలో సింపూర్ లో జరిగిన విషయం విదితమే.

మొదటి పేజీ తరువాయి

ఫెడరల్ ఫ్రంట్ హుళక్కే



ద్వేషాన్ని విస్తృతంగా ప్రజల్లో ప్రచారం చేయాలని చంద్రబాబు పార్టీ నేతలకు సూచించారు. ఎలక్షన్ మిషన్ 2019 లక్ష్యాన్ని సాధించేందుకు నేతలు కృషి చేయాలని చంద్రబాబు నాయుడు సూచించారు. శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు తెలుగుదేశం పార్టీ ప్రతినిధులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, గ్రామ, మండల, రాష్ట్ర పార్టీ బాధ్యులతో ఎలక్షన్ మిషన్–2019పై సీఎం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో 25 ఎంపీ, 150 అసెంబ్లీ స్థానాల్లో ఘన విజయమే లక్ష్యమని, అంతా సమిష్టిగా పనియేయాలని నేతలకు స్పష్టం చేశారు. సత్తెనపల్లిలో ఎన్‌టిఆర్ గార్డెన్స్ చాలా గొప్పగా చేశారని, బుద్ధపూర్ణిమ తరహాలో అభివృద్ధి చేశారని కొనియాడారు. ప్రజల్లో అద్భుతమైన స్పందన ఉందని, అన్ని వర్గాల ప్రజలు టీడీపీ వెంటే ఉన్నారని చంద్రబాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చినట్లు బీజేపీ నేతలు ప్రకటించడం హాస్యాస్పదంఅ ఉందని విమర్శించారు. 29సార్లు ఢిల్లీ వెళితే మొండి చేయి చూపడమే ప్రత్యేక ప్రాధాన్యమా అని ఆయన ప్రశ్నించారు. గాయాలపై కారం చల్లడమే ప్రత్యేకతా ? అని నిలదీశారు. కోల్‌కతా ర్యాలీలో 20కి పైగా పార్టీల నేతలు పాల్గొంటే బీజేపీయేతర పక్షాల్లో టీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వైసీపీ అధ్యక్షుడు వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరు కాకపోవడాన్ని చూస్తే వీరిద్దరూ ప్రధాని మోడీ వెంటనే ఉన్నారని స్పష్టమవుతోందని చెప్పారు.

డబ్బు పెట్టే అభ్యర్థుల కోసం వెతుకులాట : టీఆర్ఎస్‌తో అంటకాగుతున్న ప్రతిపక్ష నేత జగన్ వైఖరిని ఎండగట్టాలని పార్టీ నేతలకు చంద్రబాబు పిలుపునిచ్చారు. వరంగల్‌లో రాళ్లేసిన వాళ్లలో జగన్ లాలూచీ పడ్డారని విమర్శించారు. కేసుల కోసం మోడీతో, అక్రమాస్థుల కోసం కేసీఆర్‌తో జగన్ లాలూచీ రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. డబ్బు పెట్టే అభ్యర్థుల కోసం వైసీపీ వెతుకుతోందని, ఆ పార్టీ అభ్యర్థులు ఎవరూ ప్రజల్లో ఉండేవారు కాదని చంద్రబాబునాయుడు విమర్శించారు. బీజేపీ దేశంలోని ఆలయాల్లో అశాంతిని సృష్టిస్తోందని, దీనికి శబరిమలలో జరిగిన ఉద్రిక్తతలే ఉదాహరణ అని చెప్పారు. కర్నాటకలో బీజేపీ దుర్మార్గపు రాజకీయాలను చేస్తోందని, కాంగ్రెస్, జేడీ(ఎస్) ప్రభుత్వాన్ని కూలదోసేందుకు కుట్రలు పన్నుతోందని మండిపడ్డారు. వీటన్నింటినీ ప్రజల్లోకి తీసుకువెళ్లాలని చెప్పారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ చరిత్రాత్మక విజయం సాధించాలన్నారు. ఓటర్ల జాబితా అందరికీ అందుబాటులో ఉంచామని, మార్పులు, చేర్పులపై అంతా శ్రద్ధ చూపాలని కోరారు. ఎన్‌టిఆర్ 23వ వర్ధంతిని ఘనంగా నిర్వహించిన పార్టీ శ్రేణులను చంద్రబాబు అభినందించారు. ఇదే స్ఫూర్తితో మరింత ఉత్సాహంగా పనిచేయాలని సూచించారు.

స్పెషల్ ట్రీట్‌మెంట్ అంటే ఇదేనా : ఏపీకి స్పెషల్ ట్రీట్‌మెంట్ ఇచ్చామని బీజేపీ అనడం హాస్యాస్పదమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. శబరిమలలో ఉద్రిక్తతలు రెచ్చగొడుతోందని, రామాలయాన్ని మళ్లీ తెరమీదకు తెస్తోందని, కర్నాటకలో బీజేపీ దుర్మార్గ రాజకీయాలు చేస్తోందని మండి పడ్డారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని, ఎమ్మెల్యేల కొనుగోళ్లకు తెరదీశారని సీఎం దుయ్యబట్టారు. కాంగ్రెస్, జేడీఎస్ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు కుట్రలు చేస్తున్నారని, బీజేపీ కుట్రలను పదిమందికి చెప్పాలని నేతలకు ఆదేశించారు. ప్రతి కార్యకర్త ఒక మొబైల్ మీడియాగా మారాలని, ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయాలని అన్నారు. ఓటర్లలో అవగాహన కల్పించాలని చంద్రబాబునాయుడు సూచించారు. ఆదాయం ఉన్న తెలంగాణలో పల్లెలు ఎలా ఉన్నాయని, పట్టణాల్లో ఏం అభివృద్ధి జరిగిందని ఆయన ప్రశ్నించారు.

మొదటి పేజీ తరువాయి

రైతుబంధు బాటలో మోడీ, బాబు

పథక రూపకల్పనతో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మార్గదర్శిగా నిలిచారని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. రైతును నమ్ముకొంటే గట్టెక్కవచ్చు అని రైతుబంధుతో నిరూపించిన కేసీఆర్ బాటలోనే ప్రధాని నరేంద్రమోడీ, ఏపీ సీఎం చంద్రబాబు నడిచేందుకు సిద్దమవుతున్నారు.

రైతు బంధువే శ్రీరామరక్ష...?

వచ్చే ఎన్నికల్లో అన్ని వర్గాలను ఆకట్టుకొనే పనిలో పడిన ప్రధాన పార్టీలన్నీ ఇప్పుడు ప్రధానంగా రైతులను నమ్ముకొంటున్నాయి అని చెప్పడానికి కేంద్రం, ఏపీ సర్కార్ రైతు బంధు పథకాన్ని అమలుచేయడమే. ఓ మెజార్టీ సామాజిక వర్గానికి ఉండే ఓట్ల తరహాలో మెజార్టీ సంఖ్యలో రైతు వర్గాలు ఉన్నాయి. దీంతో వచ్చే ఎన్నికల్లో తిరిగి గట్టెక్కాలంటే రైతుయే తమకు దిక్కు అని కేంద్రంలోని మోడీ సర్కార్‌తోపాటు, ఏపీలోని చంద్రబాబు ప్రభుత్వం భావిస్తోంది. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో రైతుబంధువే అందుకుకొందని రెండోసారి కేసీఆర్ సీయంమై నిరూపించారు. దీంతో కేంద్రంతోపాటు ఏపీ రాష్ట్రార్లు ఈ దిశగా అడుగులు వేయగా, అదే దిశగా పయనించేందుకు సిద్దంగా ఉన్నాయని తెలుస్తోంది. ఇక సీఎం కేసీఆర్ రైతుబంధు పథకంను ఏపీలో కూడా అమలు చేయాలని భావిస్తున్న చంద్రబాబు సర్కార్ ఓ లెక్క ప్రకారం ఆ దిశగా అడుగులు వేస్తున్నట్లు సమాచారం. వైసీపీ అధినేత రైతు కుటుంబానికి పంట సాయం కింద రూ. 12,500 ఇస్తానని ప్రకటించారు. అయితే కుటుంబానికి రూ. 12,500 ఇవ్వడం వల్ల రైతులకు జరిగే మేలు కొంత మాత్రమే. అలా కాకుండా ఏకరాకు ఇంత సాయం చేస్తామని ప్రకటించడం ద్వారా కేసీఆర్ బాటలోనే పయనించాలని టీడీపీ సర్కార్ కూడా యోచిస్తోంది. రాష్ట్రంలో 3 కోట్ల 60లక్షల ఓటర్లు ఉన్నారు. ఇప్పటి వరకు ఏ ఎన్నికలను పరిశీలించిన 70శాతం వరకు ఓటర్లు మాత్రమే తమ ఓటును ఉపయోగించుకొన్న పరిస్థితియే. ఈ లెక్క ప్రకారం వచ్చే ఎన్నికల్లోనూ ఏపీలో ఉన్న 3.60కోట్ల ఓటర్లలో పోల్ అయ్యే ఓట్లు 2.45కోట్లు మాత్రమే. వీటిలో రెండు ప్రధాన పార్టీలకు టీడీపీకి ఉన్న ఓటు బ్యాంకు ప్రకారం ఒక కోటి ఓట్లు, వైసీపీకి ఒక కోటి ఓట్లు సహజంగానే పోల్ అవుతాయి. ఇక మిగిలిన 45లక్షల ఓట్లలో జనసేన, వామపక్షాలు, ఇక కాంగ్రెస్ వంటి పార్టీలు కొన్ని లక్షల ఓట్లు తీసుకొన్నా మిగిలిన ఓట్లు టీడీపీ, వైసీపీకి ప్రధానం. ఈ ఓట్లను తమవైపు తిప్పుకొన్న ప్రధాన పార్టీలకే విజయం వరిస్తుంది. అందుకే వివిధ రంగాలలో ఉన్న ఓటర్ల కంటే మెజార్టీ సంఖ్యలో ఉండే రైతాంగ ఓటర్లను ఆకట్టుకోవడమే లక్ష్యంగా కేంద్రంలోని మోడీ సర్కార్, ఆంధ్రప్రదేశ్‌లోని చంద్రబాబు సర్కార్ రైతుబంధు తరహా పథకం రూపకల్పన చేసేందుకు కసరత్తు పూర్తిచేసినట్లు సమాచారం. జాతీయ స్థాయిలోనూ, వివిధ రాష్ట్రాలలోనూ బీజేపీకి వ్యతిరేక పవనాలు వీస్తున్న సమయంలో ఈ రైతుబంధు తరహా పథకానికి వ్యూహ రచన చేస్తోందని సమాచారం.

ఏపీలో ముందడుగు : నవ్యాంధ్రలో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ అన్నదాతకు అభయం ఇచ్చేందుకు ఏపీ సర్కారు సిద్ధమైంది. ప్రతి రైతుకు పెట్టుబడి సాయం అందించే కొత్త పథకాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. రైతుబంధు మాదిరి కాకుండా కౌలు రైతులకు కూడా ఈ పథకాన్ని వర్తింపచేయాలని భావిస్తోంది. ఏపీ ప్రతిపక్ష నేత వై.ఎస్ జగన్ తన పాదయాత్ర ముగింపు సందర్భంగా శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం బహిరంగసభలో ప్రతి కుటుంబానికి రూ. 12,500 పంటసాయం అందిస్తామని ప్రకటించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతి రైతుకూ పెట్టుబడి సాయం అందించే పథకానికి ముందుగానే శ్రీకారం చుట్టనున్నారు. తెలంగాణలో ప్రస్తుతం అమలు చేస్తున్న రైతు బంధు పథకంలా ఆంధ్రప్రదేశ్‌లోనూ రైతుకు మేలు చేసే పథకానికి ప్రభుత్వం రూపకల్పన చేస్తోంది. ఓ వైపు కేంద్రప్రభుత్వం వచ్చే సార్వత్రిక ఎన్నికలలోపు రైతుబంధు పథకాన్ని అమలు చేయాలని సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో అంతకంటే ముందుగానే ఈ పథకాన్ని ప్రకటించి ప్రజలకు చేరువ కావాలని యోచిస్తోంది. హెక్టారుకు రూ. 15వేలు ఇవ్వాలని కేంద్రప్రభుత్వం భావిస్తోంది. రైతులు పంటల సాగుకు అవసరమైన పెట్టుబడి సొమ్ము కోసం వెతకనవసరం లేకుండా రైతులకు నేరుగా కొంత ఆర్థిక సాయాన్ని ఈ ఖరిఫ్ సీజన్‌నుంచే అందించేలా చర్యలు చేపడుతున్నారు. కేవలం భూ యజమానులకే కాకుండా కౌలు రైతులకు మేలు చేసేలా పెట్టుబడి సాయం అందించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. రైతే భూమిని సాగు చేసుకుంటూ ఉంటే నేరుగా ఆయనకే లబ్ది చేకూరుస్థారు. ఒక వేళ కౌలుకు ఇచ్చి ఉంటే సహాయాన్ని ఇద్దరి మధ్య పంచేలా యోచిస్తున్నట్లు సమాచారం. ఇలా చేయడం వల్ల ఇద్దరికీ ఊరటగా ఉంటుందని కూడా ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే కౌలు రైతులకు రుణాలు అందేలా చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం రైతులకు సాయం చేయడంలో ఆదర్శ రాష్టంగా ఉన్నామని, వారిని మరింతగా ఆదుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఇన్‌పుట్ సబ్సిడీ, విత్తనాలు, ఎరువుల సరఫరా, పశుపోషణకు సాయం, సాగునీరు, కేంద్రప్రభుత్వంతో నిమిత్తం లేకుండా మద్దతు ధరలతో పంటల



కొనుగోలు, రుణమాఫీ వంటి పథకాల ద్వారా రైతులకు ప్రభుత్వం ఇప్పటికే అండగా ఉంటోంది.

నేడు సమన్వయ కమిటీలో నిర్ణయం : సోమవారం ఉదయం టీడీపీ సమన్వయ కమిటీ ఉండవల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాసంలో సమావేశం కానుంది. ఈ సమావేశంలో మంత్రులు, పార్టీ ప్రధాన కార్యదర్శులు పాల్గొంటారు. జిల్లాల నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, జిల్లా పార్టీ అధ్యక్షులు పాల్గొననున్నారు. అదే రోజు మధ్యాహ్నం 3గంటలకు వెలగపూడి సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈ కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నారు. డ్వాక్రా గ్రూపులకు రూ. 10వేల ఆర్థికసాయంతో పాటు రైతులకు పెట్టుబడి సాయం అందించే పథకానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చే అవకాశం ఉందని టీడీపీ నేతలు అంటున్నారు. వృద్ధాప్య, వికలాంగ, ఇతర సామాజిక పింఛన్లను రెట్టింపు చేసిన రాష్ట్రప్రభుత్వం అన్నదాతలకూ ఆర్థిక వరం ప్రకటించేందుకు సిద్ధమవుతోంది. దీనిపై అధికారుల స్థాయిలో కసరత్తు ఇప్పటికే మొదలైనట్లు సమాచారం. రైతు పెట్టుబడి సాయంపై ఆర్థిక, వ్యవసాయ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. ఈ ఖరిఫ్ నుంచే అమలు చేయాలని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం.

పింఛన్ల పెంపునకు ఆదరణ : పండుటాకులు, వికలాంగులకు అందిస్తున్న సంక్షేమ పింఛన్ల మొత్తాన్ని రెట్టింపు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి ప్రజలనుంచి, పార్టీ వర్గాల నుంచి ఆదరణ లభిస్తున్న తరుణంలో రైతులకు కూడా వరాలు కురిపించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. కొత్తగా మరో 3లక్షల మందికి పింఛన్లు ఇవ్వాలని యోచిస్తున్న ప్రభుత్వం అదే తరహాఓ రైతులకు కూడా పంటసాయం కింద సహాయం చేస్తే ఆత్మహత్యలను నిరోధించవచ్చని యోచిస్తోంది. ఎన్నికల షెడ్యూల్ విడుదల కన్నా ముందుగానే ఈ పథకాన్ని అమలు చేయడం ద్వారా ప్రజల్లోకి సంక్షేమ పథకాలు చేరువ అవుతాయని ప్రభుత్వం భావిస్తోంది.


రంగులు మార్చే పేటెంట్ బాబుదే : వైపీపీ నేత పేర్ని నాని



విజయవాడ, మేజర్‌న్యూస్: గడిచిన నాలుగున్నరేళ్ల కాలంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యవహరిస్తున్న తీరు చూస్తుంటే దేశంలో ఇంత పచ్చి అవకాశవాది ఎవరూ ఉండరనే విషయం మనకు తెలుస్తోందని వైసీపీ అధికార ప్రతినిధి పేర్ని నాని విమర్శించారు. ఊసరవెల్లిలా రంగులు మార్చే పేటెంట్ కూడా చంద్రబాబుకే వచ్చిందని ఎద్దేవా చేశారు. చంద్రబాబు మీరు ఏది చెప్తే అది చేయడానికి ఇక్కడ ఎవరూ సిద్దంగా లేరు. హోదా వద్దు అనే కోదండరామ్‌తో చంద్రబాబు సావాసం చేస్తున్నారు. పాలార్ డ్యామ్ వద్దు అనే స్టాలిన్ ఇంటికి వెళ్లి చంద్రబాబు స్నేహం చేస్తారు. పోలవరానికి అడ్డు చెప్తున్న నవీన్ పట్నాయక్‌తో బాబు చెట్టాపట్టాలేసుకుని తిరుగుతారు. చంద్రబాబుకు నిలువెల్లా విషం అని నాని మండిపడ్డారు. మరోవైపు ఏపీ మంత్రి దేవినేని ఉమాపై కూడా నాని ధ్వజమెత్తారు. దోచుకున్న డబ్బుతో ఉమ నాలుక తిరగడం లేదని, ఆయన నోటికి అడ్డు అదుపు లేకుండా మాట్లాడుతున్నారన్నారు. తమ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిది మొదటి నుంచి ఒకే స్టాండ్ అని, ప్రత్యేక హోదా గురించి కేసీఆర్, కేటీఆర్‌తో చెప్పించిన ఘనత జగన్‌దేనన్నారు. చంద్రబాబులా జగన్ ఎప్పుడూ దివాలాకోరు రాజకీయాలు చేయరన్నారు.

రాజకీయ సర్వేలతో జోష్ !

- జోరుగా వ్యక్తిగత, పార్టీ పరమైన సర్వేలు
- ప్రత్యేక బృందాలతో రంగంలోకి ప్రైవేట్ సంస్థలు
- ఇంటింటికీ తిరుగుతూ ప్రజాభిప్రాయ సేకరణ
- రకరకాల ప్రశ్నలతో ప్రజల అంతరంగ శోధన
- వ్యక్తిగత సర్వేల్లో నిమగ్నమైన ఎమ్మెల్యేలు, నాయకులు



(అమరావతి 'సూర్య' ప్రత్యేక ప్రతినిధి) : నవ్యాంధ్రలో అప్పుడే సార్వత్రిక ఎన్నికల వేడి మొదలైంది. రాజకీయ సర్వేలతో నేతల్లో కొత్త జోష్ కనిపిస్తోంది. ఇప్పటికే నాయకులంతా ఎవరికివారు తమ తమ వ్యూహాల రచనలో నిమగ్నమయ్యారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే నాటికల్లా విజయావకాశాలపై పార్టీల నేతలు తమ బలాబలాలను లెక్కలు వేసుకునే పనిలో ఉన్నారు. అధికార తెలుగుదేశం పార్టీతోపాటు ప్రతిపక్ష వైసీపీ, జనసేన నేతలు కూడా ప్రజల మనసుల్లో ఏముందో తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అందరూ పావులు కదుపుతున్నారు. అయితే పార్టీలపైనా, నాయకులపైనా ప్రజల్లో ఎటువంటి అభిప్రాయం ఉంది? వారు ఎటువైపు మొగ్గు చూపుతున్నారన్నది ఫలితాలు వెలువడే వరకు తెలియదు. కానీ ప్రజల మదిలో ఏమున్నదో ముందుగా తెలుసుకునేందుకు సర్వేలు ఒక మార్గం. సార్వత్రిక ఎన్నికలకు మరో మూడు నెలల మాత్రమే సమయం ఉండడంతో ఏ పార్టీపై ప్రజలు ఏమనుకుంటున్నారు? ఏ నాయకుడిని జనాలు విశ్వసిస్తున్నారన్నది ముందుగా తెలుసుకుని తమ లోటుపాట్లను సరి దిద్దుకునేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు, నాయకులు సర్వేలకు దిగుతున్నారు. ఇదే సమయంలో పలు ప్రైవేటు, స్వచ్ఛంద సంస్థలు కూడా ప్రజల ఆలోచనా విధానం ఏవిధంగా ఉంది. వచ్చే ఎన్నికల్లో గెలుపు అవకాశాలు ఎవరికి ఎక్కువగా ఉన్నాయో తెలుసుకునేందుకు సర్వేలు చేపడుతున్నాయి. అందులోనూ ఈ సారి ఎన్నికల్లో పంచముఖ పోరు ఖాయంగా కనిపిస్తుండడంతో ఈ సర్వేలకు మరింత ప్రాధాన్యత పెరిగింది. ప్రస్తుతం ఈ తరహా సర్వేలు జిల్లాలో జోరందుకున్నాయి. ఓ వైపు స్వచ్ఛంద సంస్థలు, మరో వైపు ప్రధాన రాజకీయ పార్టీలు, ఇంకో వైపు ఎమ్మెల్యేలు, నియోజకవర్గ నాయకులు ఎవరికి వారు తమ స్థాయిలో సర్వేలు చేయించుకుంటున్నారు.

పెద్ద ఎత్తున సర్వే చేస్తున్న స్వచ్ఛంద సంస్థలు

గత నెల రోజుల నుంచి ఓ స్వచ్ఛంద సంస్థ జిల్లాలో పెద్ద ఎత్తున ఎన్నికల సర్వే చేస్తోంది. ప్రత్యేక బృందాలు జిల్లాలోకి దిగాయి. పట్టణ కేంద్రాలే లక్ష్యంగా ఈ బృందాలు సర్వే జరుపుతున్నాయి. పలు జిల్లాలోని పలువురు విద్యార్థుల సేవలను ఇందుకు ఉపయోగించుకుంటున్నారు. సర్వే చేసినందుకు ఒక వ్యక్తికి రోజుకు రూ.వెయ్యి ఈ సంస్థ చెల్లిస్తోంది. ప్రజల అంతరంగాన్ని తెలుసుకునేందుకు 18 ప్రశ్నలతో సర్వే చేయిస్తోంది. ఈ ప్రశ్నలను గమనిస్తే ప్రజలు ఏ వైపున ఉన్నారో స్పష్టంగా తెలిసిపోతుందని ఆ సంస్థ భావిస్తోంది. రాష్ట్రం నుంచి గ్రామం వరకు ప్రజా సమస్యలు తెలుసుకోవడంతో పాటు స్థానిక ఎమ్మెల్యే, సీఎం, ప్రతిపక్ష నాయకుల పని తీరుపై కూడా సర్వేలో ప్రశ్నలున్నాయి. ప్రతి వార్డులో 25 మంది ఓటర్ల చొప్పున సర్వే చేస్తున్నారు. ఓటర్ల జాబితా ఆధారంగా చేసుకొని అన్ని వర్గాలు సర్వే లో పాల్గొనేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అది కూడా సాంకేతికతను ఉపయోగించుకొని చేయడం విశే షం. ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా ట్యాబ్‌లు ఉపయో గించుకొని సర్వే చేస్తున్నారు. దీని ద్వారా ఆ గ్రామం, మండలం, నియోజకవర్గం, జిల్లాలో ఏ పార్టీ పరిస్థితి ఏమిటి? ఏ నాయకుడి పనితీరు ఎలా ఉంది? అన్నది తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇదే కాకుండా మరో రెండు ప్రైవేటు సంస్థలు కూడా జిల్లాలో ఎన్నికల సర్వేలు చేస్తున్నాయి.

ప్రధాన పార్టీల తరపున కూడా

స్వచ్ఛంద సంస్థలే కాకుండా పలు ప్రధాన రాజకీయ పార్టీలు కూడా జిల్లాలో ఎన్నికలు సర్వేలు చేస్తున్నాయి. వచ్చే ఎన్నికలు కీలకంగా మారనున్న నేపథ్యంలో గెలుపు అవకాశాలు ఎలా ఉన్నాయన్న విషయాన్ని బేరీజు వేసుకుంటున్నాయి. గత నాలుగేళ్ల నుంచి తాము చేస్తున్న ప్రతి కార్యక్రమాన్ని ప్రజల ముందుకు తీసుకెళ్లి వారి అభిప్రాయం తెలుసుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి. రాష్ట్ర స్థాయిలో పనితీరే కాకుండా గ్రామ, నియోజకవర్గ స్థాయిలో నాయకుల పనితీరును ప్రజల నుంచి రాబట్టుతున్నాయి. ఈ సర్వేలో ప్రజలను అడుగుతున్న ప్రశ్నలను గమనిస్తే ఎమ్మెల్యే లేదా ఇన్‌ఛార్జ్ వ్యవహార శైలి, వారి బలాబలాలు, గెలుపు అవకాశాల పైనే పార్టీలు దృష్టి పెట్టినట్టు అర్థమవుతోంది. కొంత మందిని నియమించుకొని నేరుగా ప్రజలతో మమేకమై సర్వే చేయించడం ఒక కార్యక్రమం అయితే ఫోన్ ద్వారా అభిప్రాయాలు తెలుసుకోవడం మరో విధానంగా సాగుతోంది. ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగానే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ల కేటాయింపు ఉంటుందని ఇప్పటికే ప్రధాన పార్టీలు తరచూ ప్రకటిస్తుండడం ఈ సందర్భంగా గమనార్హం. ఇదే నేపథ్యంలో ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జ్‌లు, టికెట్ ఆశావహులు కూడా నియోజకవర్గ స్థాయిలో సొంతంగా సర్వే చేయించుకుంటున్నారు. తమపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాన్ని తెలుసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో సర్వేలు పూర్తయినట్లు తెలుస్తోంది. ఈ సర్వే ఆధారంగా నాయకులు తమ వ్యవహారశైలి మార్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు రాజకీయవర్గాల్లో చర్చలు సాగుతున్నాయి.

వాలంటీర్లను అభినందించిన రెడ్‌క్రాస్ చైర్మన్



(మేజర్ న్యూస్ శ్రీకాకుళం) జిల్లా కేంద్రంలో ఈనెల 26వతేదీన రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు అధికారికంగా నిర్వహించబోయే రిపబ్లిక్‌డే వేడుకల్లో పాల్గొనే ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, యూత్ రెడ్‌క్రాస్ వాలంటీర్లను శనివారం రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి. జగన్మోహన్‌రావు అభినందించారు. రిపబ్లిక్‌డే వేడుకల్లో రెడ్‌క్రాస్ ప్రతిష్ఠను పెంచేలా ప్రదర్శనలు ఇవ్వాలని జగన్మోహన్‌రావు వాలంటీర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ మేనేజర్ ఎ. నర్సింగరావు, కో ఆర్డినేటర్ కె. సత్యన్నారాయణ తదితరులు ఉన్నారు.

పెళ్లి పత్రికపై ఓటు వేయండి



న్యూఢిల్లీ: రాజకీయ పార్టీల మీద అభిమానం కొన్నిసార్లు హద్దులు దాటుతుందని చెప్పడానికి ఉదాహ రణే ఈ పెళ్లి పత్రిక. త్వరలో వివాహ బంధం ద్వారా ఒక్కటి కాబోతున్న హరియాణాకు చెందిన ఓ జంట ఆహ్వాన పత్రికపై వచ్చే లోక్ సభ, విధానసభ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీకి ఓటు వేయండి. అదే మీరు మా పెళ్లికిచ్చే కానుక అంటూ ముద్రించింది. ఈ విషయాన్ని ఆమ్‌ఆద్మీ పార్టీ సామాజిక మాధ్యమ విభాగానికి చెందిన వ్యూహకర్త అంకిత్ లాల్ ట్విటర్ ద్వారా వెల్లడించారు. వధూవరులిద్దరూ జశ్వీందర్ సింగ్, ఇంద్రజీత్ కౌర్‌లని ఆయన పేర్కొన్నారు. ఇదే తరహాలో ఆమ్ ఆద్మీ పార్టీ అధికార ప్రతినిధి కుల్దీప్ కద్యాన్ మరో ఆహ్వాన పత్రికను ట్విటర్‌లో పంచుకున్నారు. ఆ పత్రికలో దిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, ఆప్ నాయకులు గోపాల్ రాయ్, నవీన్ జైహింద్‌ల చిత్రాలు ముద్రించారు. హరియాణాలో చాలా చోట్ల పరిస్థితి ఇలాగే ఉందని కద్యాన్ ఆ పత్రికను పోస్ట్ చేస్తూ వ్యాఖ్యానించారు. గత ఏడాది నవంబర్‌లో ప్రధాని మోదీకి ఓటు వేయండి అనే అక్షరాలు ముద్రించిన వివాహ ఆహ్వాన పత్రికలు సామాజిక మాధ్యమంలో చక్కర్లు కొట్టాయి. స్వచ్ఛ భారత్ లోగో, మోదీ చిత్రాలు ముద్రించిన ఆహ్వాన పత్రికలు కొన్నింటిని గతంలో ప్రధాని నరేంద్రమోదీ రీట్వీట్ చేసిన సందర్భాలున్నాయి.

టీడీపీ నేతల అవినీతి అక్రమాలు రోజు రోజుకు పెరుగుతున్నాయి

- నా నిరవధిక నిరాహార దీక్షతో నియోజకవర్గానికిచ్చిన హామీలు ముఖ్యమంత్రి నెరవేర్చాలి
- మాజీ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు



తాడేపల్లిగూడెం,సూర్యబ్యూరో: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ నేతల అవినీతి అక్రమాలు రోజు రోజుకు పెరుగుతున్నాయని మాజీమంత్రి పైడికొండల మాణిక్యాలరావు ఆరోపించారు. శనివారం ఆయన తాడేపల్లిగూడెంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ స్థానిక టీడీపీ నాయకుల కుతంత్రాలు కారణంగానే నియోజకవర్గానికి ఇచ్చిన హామీలను చంద్రబాబు కావాలనే అమలు చేయడం లేదని విమర్శించారు. ఆటో మొబైల్ రంగానికి కేంద్రంగా ఉన్న తాడేపల్లిగూడెంలో ఆటోనగర్ నిర్మాణం, విమానాశ్రయ భూముల్లో నివాసం ఉంటున్న వారికి పట్టాలు తదితర ప్రధాన హామీలు అమలు చేసే అవకాశం ఉన్నా కూడా స్థానిక నేతలు ఒత్తిడితో ముఖ్యమంత్రి నిలిపి వేయడం దారుణమన్నారు. సోమవారాన్ని పోలవరంగా మార్చానని చెబుతున్న ముఖ్యమంత్రి ఏ పనీ చేయకుండా ఈ జిల్లాపై ఎందుకు కక్ష గట్టారో చెప్పాలన్నారు. ఈ జిల్లా ప్రజలు మీకు అన్ని నియోజకవర్గాలు నెగ్గించి ఇస్తే ఈ జిల్లాను వెనుకబడిన జిల్లాగా వదిలేశారని ఆయన అన్నారు. జిల్లాను తాడేపల్లిగూడెం నియోజకవర్గ అభివృద్ధిని గాలి కొదిలేయడం వల్లే మీకు రాజీనామా అల్టిమేటం పంపానని చెప్పారు. ఇప్పటి వరకు నేను పంపిన అల్టిమేటంపై సీఎం స్పందించని కారణంగానే ఈనెల 21 నుంచి నిరవధిక నిరాహారదీక్షకు దిగుతున్నానని తెలిపారు. నా నిరవధిక నిరాహారదీక్ష ద్వారా అయినా ఈ జిల్లానియోజకవర్గానికిచ్చిన హామీలు ముఖ్యమంత్రి నెరవేర్చాలని అన్నారు. ఈ దీక్షకు ప్రజలంతా అండగా నిలిచి హామీలు అమలుకు సహకరించాలని పైడికొండల మాణిక్యాలరావు కోరారు

విచారణ సంస్థలనే కాదు వ్యక్తులను బహిష్కరిస్తున్నారు : బీజేపీ నేత ఐవైఆర్

విజయవాడ, మేజర్‌న్యూస్ః ఇంతవరకూ ఏపీ ప్రభుత్వం కేంద్ర దర్యాప్తు సంస్థలను మాత్రమే బహిష్కరిస్తుందని తాను భావించానని, కానీ ఇప్పుడు వ్యక్తులను కూడా బహిష్కరించడానికి అనుకూల మీడియా సాయంతో అనుకూల వాతావరణాన్ని సృష్టిస్తున్నట్టు కనిపిస్తోందని బీజేపీ నేత ఐవైఆర్ కృష్ణారావు వ్యాఖ్యానించారు. ఇటీవల టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, వైసీపీ అధినేత జగన్ భేటీపై ఏపీ సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై ఆయన ఈ మేరకు స్పందించారు. ఈరోజు సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ట్విట్టర్ లో ఐవైఆర్ స్పందిస్తూ "ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం బహిష్కరణ కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థల వరకే అనుకున్నాను. ఇప్పుడు వ్యక్తులను కూడా బహిష్కరించడానికి అనుకూల మీడియా సహాయంతో వాతావరణాన్ని సృష్టిస్తున్నట్టు కనిపిస్తున్నది అని ట్వీట్ చేశారు. ఈ ట్వీట్‌కు ఓ తెలుగు దినపత్రిక క్లిప్పింగ్ ను ఐవైఆర్ జతచేశారు.

ఎల్లో మీడియా ద్వారా బురదచల్లే ప్రయత్నం

వైపీపీ నేత ఆకేపాటి



కడప, మేజర్‌న్యూస్: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆ పార్టీ రాజంపేట పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తెలిపారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ల భేటీపై టీడీపీ అస్యత ప్రచారాలు చేస్తోందని మండిపడ్డారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఫెడరల్ ఫ్రంట్‌పై టీడీపీ అసత్య ప్రచాలు చేస్తూ ఎల్లో మీడియా ద్వారా వైఎస్ జగన్‌పై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నందమూరి హరికృష్ణ పార్థీవదేశం సాక్షిగా శవ రాజకీయాలు చేసింది చంద్రబాబు కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రం విడిపోవడానికి కారణమైన కాంగ్రెస్‌తో సిగ్గులేకుండా చంద్రబాబు పొత్తు పెట్టుకున్నారని విమర్శించారు.

దన్యం కొనుగోలు కేంద్రాలు విధిగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ కె. ధనంజయ రెడ్డి



(మేజర్ న్యూస్ శ్రీకాకుళం కలెక్టరేట్) జిల్లాలో దాన్యంకొనుగోలు కేంద్రాలు సక్రమంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. ధనంజయరెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం జిల్లా కలక్టర్ క్యాంపు కార్యాలయం వద్ద జిల్లా అధికారులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్స్, పౌర సరఫరాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో దాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వాహణ చాలా అధ్వాన్నంగా ఉందని అన్నారు. కొనుగోలు కేంద్రాలు నిర్వాహణ నిర్వహణపై పత్రికల్లో విమర్శలు ఎక్కువగా వస్తున్నట్టు తెలిపారు. విమర్శలకు అవకాశం లేకుండా పగడ్బందీగా నిర్వహించాలని చెప్పారు. మిల్లర్స్ యజమానులు కూడా ఇందుకు సహకరించాలని అన్నారు. మిల్లర్స్ కొనుగోలు చేసిన దాన్యాన్ని దాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద విధిగా నమోదు చేయించాలని ఆదేశించారు. వెలుగు, డిసిఎమ్.ఎస్, కోపరెటివ్ సహకార సంఘాలు ద్వారా జిల్లాలో 141 దాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహించ బడుతున్నట్టు తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు విధినిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని చెప్పారు. మిల్లర్స్ కొనుగోలు చేసిన దాన్యాన్ని దాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నమోదు చేయించుకోకపోతే చెల్లింపులు నిలువుదల చేయడం జరుగుతుందని అన్నారు. వెలుగు సిబ్బంది పిపిసి సెంటర్స్‌కు వెళ్లకుండా రికార్డులు నిర్వహిస్తున్నట్టు తన ద ష్టికి వస్తున్నట్టు తెలిపారు. సంబంధిత అధికారులు పిపిసి సెంటర్స్ తనికీలు చేయాలని ఆదేశించారు. పిపిసి సెంటర్ కు వచ్చిన దాన్యం లారీ, లేదా ట్రాక్టరు యొక్క ఫోటోను తీసి, దాన్యం సేంపిల్స్ సేకరించి పూర్తి వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. మిల్లర్స్ నుండి వచ్చిన బియ్యాన్ని నిల్వచేయడానికి ఎఫ్.సి.ఐ అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. గోదాములు కొరత ఏర్పడితే పౌర సరఫరాల గోదాములు వినియోగించాలని చెప్పారు. అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా పౌర సరఫరాల అధికారిని అదేశించారు. పౌర సరఫరాల తహశీల్దార్లు పిపిసి సెంటర్లు, రైస్ మిల్లులను తనికీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలక్టర్ కె.వి.ఎన్. చక్రధరబాబు, జిల్లా గ్రామీణ అభివ ద్ధి సంస్థ పథక సంచాలకులు జి.సి. కిషోర్ కుమార్, జిల్లా పౌర సరఫరాల అధికారి క్రిష్ణారావు, వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు అప్పలస్వామి, ఎఫ్.సి.ఐ మేనేజర్, జిల్లా సహకార అధికారి శ్రీహరి, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రమేష్ సి.ఎస్. డిటీలు తదితరులు పాల్గొన్నారు.

మరో భారత సంతతి అమెరికన్‌కు కీలక పదవి



న్యూయార్క్: డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగంలో మరో భారత సంతతి అమెరికన్‌కు కీలక పదవి దక్కనుంది. ప్రముఖ ఆర్థిక రంగ నిపుణుడు ప్రేమ్ పరమేశ్వరన్‌ను ఏషియన్ అమెరికన్ ఫసిపిక్ ఐర్లాండర్స్ ఎడ్వైజరీ కమిటీలో సభ్యుడిగా నియమించేందుకు ట్రంప్ అంగీకరించినట్లు శ్వేతసౌధం వర్గాలు తెలిపాయి. మొత్తం 12 మంది సభ్యులున్న ఈ కమిటీలో పరమేశ్వరన్ ఏకైక ఇండో అమెరికన్. న్యూయార్క్‌కు చెందిన ఈయన ప్రస్తుతం ఏరోస్ ఇంటర్నేషనల్ సంస్థ ఉత్తర అమెరికా విభాగం అధ్యక్షుడిగా, గ్రూపు సీఎఫ్‌వోగా పనిచేస్తున్నారు. ఇండో అమెరికన్లతోపాటు అగ్రరాజ్యంలో స్థిరపడిన ఫసిఫిక్ ద్వీపవాసుల ఆరోగ్యం, విద్య ఆర్థిక వృద్ధిని మెరుగుపరిచేందుకు మాజీ అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా ఈ సలహా కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో వాణిజ్యం, ఆరోగ్యం, విశ్వవిద్యాలయాలు, ఎన్జీవోలు సహా వేర్వేరు రంగాలకు చెందిన నిపుణులు సభ్యులుగా ఉంటారు.

ఆటా నూతన అధ్యక్షుడిగా పరమేశ్ భీమిరెడ్డి



అమరావతి, సూర్య బ్యూరో : 2019- 2020 సంవత్సరాలకు అమెరికా తెలుగు అసోసియేషన్ (ఆటా) అధ్యక్ష పగ్గాలు ఓ తెలుగు వాడిని అందునా తెలంగాణా రాష్ట్ర, మహబూబ్ నగర్ జిల్లా వాసిని వరించాయి. అయనే పరమేశ్ భీమ్‌రెడ్డి. ఆయన పాలమూరు జిల్లాలో ఒక సాధారణ మధ్య తరగతి కుటుంబంలో పుట్టి, అమెరికాలో స్థిరపడే స్థాయికి కషి చేసిన వ్యక్తి. ఆ కషి అంతటితో ఆగకుండా తెలుగు జాతి ప్రయోజనాల వైపు కూడా చేయడం అభినందించదగ్గ విషయం. ఆటా నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తున్నారు పరమేశ్ భీమ్‌రెడ్డి. ఎన్నో సేవా సంస్థల్లో ట్రస్టీగా సేవలందించి ఆటా అధ్యక్ష స్థాయికి ఆయన అంచెలంచెలుగా ఎదిగిన విధానం గమనించదగింది, అభినందించదగింది. 1967లో మార్చి 16న మహబూబ్ నగర్ జిల్లా, పోతిరెడ్డి పల్లిలో కొండారెడ్డి, నారాయణమ్మ దంపతుల ఆరవసంతానంలో ఒకరుగా జన్మించారు. దక్కన్ కాలేజ్‌లో ఇంజనీరింగ్ విద్యానంతరం.. ఉన్నత విద్య రీత్యా అమెరికాలో అడుగుపెట్టారు. 1992లో ఆటా సంస్థలో భాగమయ్యారు. న్యూయార్క్ వెస్ట్ చెస్టర్‌లో జరిగిన మొదటి మేజర్ తెలుగు కాన్ఫరెన్స్‌కు రిజిస్ట్రేషన్ కమిటీ మెంబర్‌గా వ్యవహరించారు. తరువాత రీజనల్ కోఆర్డినేటర్‌గా న్యూ ఇంగ్లండ్ ఏరియా విభాగంలో పనిచేసారు. అలా 2008లో పదవ కాన్ఫరెన్స్ నాటికి రీజనల్ కమిటీ చైర్‌గా బాధ్యతలు స్వీకరించారు. 2012లో జరిగిన ఆటా 12వ కాన్ఫరెన్స్‌కు అడ్హక్ కమిటీ మెంబర్‌గానూ, కాన్ఫరెన్స్ సెక్రటరీగానూ పనిచేసే వెబ్, సాంస్క తిక విభాగాలను సమన్వయపరిచి మంచి ఫలితం రాబట్టారు. 2014లో జరిగిన ఆటా 13వ కాన్ఫరెన్స్‌కు కన్వీనర్‌గా బాధ్యతలు చేపట్టి ఆటా ఉద్దేశ్యాలను, లక్ష్యాలను సాధించడంలో తనవంతు కషి చేస్తున్న పరమేశ్ భీమ్‌రెడ్డి 2017-18 సంవత్సరాలకు ఎలెక్టెడ్ ప్రెసిడెంట్‌గా గౌరవాన్ని అందుకున్నారు. ఇక వ్యక్తిగతంగానూ సేవామార్గాన్నే అనుసరించారు పరమేశ్ భీమ్‌రెడ్డి. పాలమూరు ఎన్నారై ఫోరమ్‌తో పాటు ఎన్నో సంస్థల్లో బోర్డ్ ఆఫ్ ట్రస్టీగా, కమిటీ చైర్, నామినేటింగ్ కమిటీ మెంబర్ వంటి హోదాల్లో సేవలందించారు. తెలుగు రాష్ట్రాల్లోని పేద ప్రజల విద్య, వైద్య, ఆర్థికస్థితిగతులు మెరుగుపర్చడానికి ఎంతగానో కషిచేసారు, చేస్తున్నారు.


ఆ వేర్పాటువాద నాయకుడిని విడుదల చేయండి



శ్రీనగర్: భార్య అనారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఓ వేర్పాటువాద నాయకుడిని విడుదల చేయాలంటూ జమ్ము, కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ఆమె స్వయంగా హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. వివరాల్లోకి వెళితే.. జమ్ము, కశ్మీర్‌కు చెందిన షాహిద్ ఉల్ ఇస్లాం అనే వేర్పాటువాద నాయకుడు ఎన్ఐఏ అదుపులో ఉన్నాడు. కస్టడీలో ఉండగానే అతడి భార్యకు మెదడులో తీవ్ర రక్తస్రావమై జబ్బుపడింది. ఈ విషయాన్ని ఓ వ్యక్తి ట్విటర్ ద్వారా మెహబూబా దృష్టికి తీసుకొచ్చాడు. మెదడులో రక్తస్రావమై అనారోగ్యంతో ఉన్న ఆమె బాగోగులు చూసుకోవడానికి ఇంట్లో ఎవరూ లేరని, పాఠశాలకు వెళ్లే కూతుళ్లు మాత్రమే ఇంట్లో ఉన్నట్లు ఆ వ్యక్తి ట్విటర్‌లో పేర్కొన్నాడు. స్పందించిన మెహబూబా ముఫ్తీ వెంటనే ఈ విషయమై ఫోన్‌లో రాజ్‌నాథ్ సింగ్‌తో మాట్లాడారు.


బాదంతో ఈ ఏడాదంతా ఆరోగ్యమే

ప్రముఖ ఆహార నివుణురాలు రితికా సమద్దార్



అమరావతి, సూర్య బ్యూరో : బాదంతో ఈ ఏడాదంతా ఆరోగ్యంగా జీవించడానికి సరికొత్త తీర్మానాలు చేసుకోవాలని ప్రముఖ ఆహార నివుణురాలు రితికా సమద్దార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరగ్యోంగా ఉండాలి, ఆరోగ్యకరమైనవి తినాలి అని 2019లో తీర్మానాలు చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యంగా ఉండాలి అని తీర్మానం చేసుకునేటప్పుడు, మనం తీసుకునే ఆహారం మీద ఆ తీర్మానం ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే, మనం తీసుకునే స్నాక్స్ గురించి కూడా ఆలోచన చేయాలని తెలిపారు. సహజంగా ఎవరైనా రోజూ తీసుకునే ఆహారంపైనే దష్టి పెడతారు కానీ, ఆహారానికి ఆహారానికి మధ్య తీసుకోవాల్సిన దానిపై పెద్దగా పట్టించుకోరని పేర్కొన్నారు. ఆహారానికి ఆహారానికి మధ్య బాదం పప్పు తింటే ఆకలి తీరడంతో పాటు ఆరోగ్యానికి బాటలు వేసినట్లేనని తెలిపారు. చిరుతిళ్లుకు బదులు బాదం తింటే పరిపూర్ణ ఆరోగ్యం మీసొంతమవుతోందని వివరించారు. దీంతో రోజంగా ఆరోగ్యంగా ఉండటానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రయాణంలో సిద్ధపడినప్పుడు ఆహారం విషయంలో రాజీ పడటం అంత మంచిది కాదన్నారు. ఇంటి వద్ద ఉన్నా, ఏ పనిలో ఉన్నా, ఏ ప్రాంతంలో ఉన్నా బాదంను ఆహారంలో భాగం చేసుకుంటే ఆరోగ్యం మీ వెంటే ఉంటుందని తెలిపారు. గుప్పెడు బాదం గింజలు అనగా 30 గ్రాములు లేదా 23 బాదం రోజంగా తినడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చునని పేర్కొన్నారు. ఆహర నివుణురాలు మాధురి రుయా మాట్లాడుతూ ఒక చిన్న బాక్సులో బాదం గింజలను ఉంచుకొని వాటిని వివిధ రకాలైన పళ్లుతో గానీ, ఇతర స్నాక్స్‌తో గానీ కలిపి తినడం అలవాటు చేసుకోవాలన్నారు. జనవరి నెలలో ఎక్కువగా పండగలు, పెళ్లిళ్లు ఉంటాయని.. వీటిలో ఎక్కువ క్యాలరీల ఆహారం తినడం తగ్గించాలన్నారు. ప్రముఖ నటి ప్రియాంక చోప్రా తల్లి మధు చోప్రా మాట్లాడుతూ మా ఫ్యామిలీలో ఏదైన శుభకార్యం జరిటప్పుడు కుటుంబ సభ్యులందరినీ రమ్మని పిలుస్తానని, దీనివల్ల ఒకరినొకరు కలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇలా కలిసేటప్పుడు వివిధ విషయాలు చర్చించుకుంటామని తెలిపారు. ఎంతో ఇష్టమైన మసాలా బాదంను ఈ సందర్భంగా తింటామని పేర్కొన్నారు. మీరు ఎప్పుడైనా పార్టీలో ఉన్నప్పుడు బాదం పప్పు పెట్టమని అడగాలని తెలిపారు. ప్రముఖ చెఫ్ మనీష్ మల్హోత్రా మాట్లాడుతూ బెల్లంతో చేసిన బాదం పప్పును ఎంతో ఇష్టంగా తింటానని పేర్కొన్నారు. నా అతిథులకు కూడా అదే పెడతానని తెలిపారు. బాదంలో యాంటీ యాక్సిడెంట్స్ ఎక్కువగా ఉంటాయన్నారు. మాంగనీస్, రైబోఫ్లేవిన్ అధికంగా ఉన్నాయని పేర్కొన్నారు. బాదం తినడం వల్ల బరువు అదుపులో ఉండటమే కాకుండా గుండె పదిలంగా ఉంటుందని తెలిపారు.

రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం : ఉదయభాను



విజయవాడ, మేజర్‌న్యూస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనాలే తమ పార్టీకి ముఖ్యమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయవాడ పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటులో భాగంగా టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, తమ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలవడంపై టీడీపీ చేస్తున్న విమర్శలు అసంబద్ధమని మండిపడ్డారు. ప్రత్యేక హోదాకు టీఆర్‌ఎస్ మద్దతు తెలిపిందని, రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఫెడరల్ ఫ్రంట్‌కు మద్దతిస్తున్నామన్నారు. జాతీయ స్థాయిలో ఫెడరల్ ఫ్రంట్‌కు సంబంధించి వైఎస్ జగన్, కేటీఆర్ మధ్య జరిగిన భేటీపై సీఎం చంద్రబాబునాయుడు వంది మాగధులు, టీడీపీ మంత్రులు ఆయన ప్రయోజనాల పరిరక్షణకు వెన్నుదన్నుగా నిలుస్తున్న ఎల్లో మీడియా రెండు రోజులుగా గగ్గోలు పెడుతున్న విషయం తెలిసిందే. రాష్ట్రాన్ని అన్యాయంగా విభజించిన కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకున్న చంద్రబాబును, హరికృష్ణ శవం సాక్షిగా టీఆర్‌ఎస్‌తో పొత్తుకోసం ప్రయత్నించానని సాక్షాత్తూ చంద్రబాబే అటు అసెంబ్లీలోనూ, ఇటు తెలంగాణ ఎన్నికల సమయంలోనూ ప్రకటించినా ఏ మాత్రమూ తప్పు బట్టని ఎల్లో మీడియా నేడు రాద్ధాంతం చేస్తున్నది. ఈ తరహా అసత్యప్రచారాలపై రాష్ట్ర ప్రజలు, వైసీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కేంద్రం స్పెషల్ ట్రీట్‌మెంట్ ఏపీకి కాదు జగన్‌కు ఇస్తుంది

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ జూపూడి ప్రభాకర్ రావు

అమరావతి,సూర్యబ్యూరో: ఉక్కు కర్మాగారం గురించి సమాచారం ఇవ్వలేదని రాజ్‌నాథ్‌సింగ్ చెప్పడం హాస్యాస్పదమని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ జూపూడి ప్రభాకర్ రావు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ కేంద్రం స్పెషల్ ట్రీట్మెంట్ ఏపీకి కాకుండా జగన్‌కి ఇస్తుందని వ్యాఖ్యానించారు. తమకు స్పెషల్ ట్రీట్మెంట్ వద్దు హోదా ఇవ్వండి చాలు అని స్పష్టం చేశారు. చంద్రబాబుపై చేస్తున్న విష ప్రయోగానికి ప్రజలు తగిన బుద్ధి చెప్తారన్నారు. బీజేపీ, వైసీపీ, కేసీఆర్ కలిసి ఏపీపై దండయాత్రకు వస్తున్నారని జూపూడి ప్రభాకర్ దుయ్యబట్టారు.

రాజకీయాలకు జగన్ పనికిరారు : కాంగ్రెస్ నేత బైరెడ్డి



కర్నూలు, మేజర్‌న్యూస్: వైసీపీ అధ్యక్షుడు జగన్ రాజకీయాలకు పనికిరారని కాంగ్రెస్ నేత బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి వ్యాఖ్యానించారు. కేసీఆర్‌కు మద్దతివ్వడమంటే ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును కాలరాయడమేనని కర్నూలులో అన్నారు. జగన్ తీరు సెమీఫైనల్ వరకు వచ్చి ఫైనల్‌లో ఓడినట్టు ఉందని ఎద్దేవా చేశారు. ఆంధ్రకు ఏం మేలు చేశారని కేసీఆర్‌తో జతకడుతున్నారని జగన్‌ను ప్రశ్నించారు. జగన్, కేసీఆర్ కలయిక రాష్ట్రాభివృద్ధికి విఘాతమన్నారు. ఏ విషయంలో న్యాయం చేశారని కేసీఆర్‌ను భుజాలకు ఎత్తుకొని ఊరేగించేలా జగన్ వ్యవహరిస్తున్నారని నిలదీశారు. కేసీఆర్‌తో జతకట్టడం ప్రత్యేక హోదాకు గండికొట్టడమేనని వ్యాఖ్యానించారు.

ప్రపంచ ఆర్థిక వేదికపై సన్‌రైజ్ స్టేట్

- ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సమావేశాలకు హాజరు
- 21న దావోస్ పర్యటనకు మంత్రి నారా లోకేష్
- ఆంధ్రప్రదేశ్ ప్రతినిధి బృందానికి నాయకత్వం
- ప్రముఖ కంపెనీ ప్రతినిధులతో భేటీ
- ఏపీకి మరిన్ని పెట్టుబడులు తేవడమే లక్ష్యంగా పర్యటన
- 22 నుంచి 24 వరకు దావోస్ పర్యటన



(వెలగపూడి, 'సూర్య' ప్రత్యేక ప్రతినిధి) : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సమావేశాల్లో పాల్గొనేందుకు ఏపీ ఐటి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేష్ దావోస్ పర్యటనకు వెళుతున్నారు. ఈ నెల 21న హైదరాబాద్ నుంచి బయలుదేరుతున్న ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక ప్రతినిధులు బృందానికి మంత్రి లోకేష్ నాయకత్వం వహించనున్నారు. సన్‌రైజ్ స్టేట్ ఆంధ్రప్రదేశ్‌కి మరిన్ని పెట్టుబడులు తీసుకువచ్చే లక్ష్యంతో ఈ పర్యటన సాగనుంది. ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సమావేశాలు స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరగనున్నాయి. మంత్రి నారా లోకేష్ నేతృత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక ప్రతినిధి బృందం ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన డెలాయిల్, ప్రోక్టర్ అండ్ గేంబరల్, విప్రో, పెగా సిస్టమ్స్, ఆర్సెలార్ మిట్టల్, నెస్లే, ఏటీ అండ్ టి, ఇన్వెస్కో కంపెనీల ప్రతినిధులతో భేటీ కానున్నారు. పెట్టుబడులు పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న అనువైన పరిస్థితులను వివరించి వారిని ఒప్పించి రప్పించేందుకు ప్రపంచ ఆర్థిక వేదిక కేంద్రంగా కృషి చేయనున్నారు. ఈస్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో మొదటి స్థానంలో నిలిచిన ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం అమలు చేస్తున్న పాలసీలు, ఇస్తున్న రాయితీలు ఆయా కంపెనీల ప్రతినిధులకు వివరించనున్నారు. ప్రపంచ ఆర్థిక వేదిక కాంగ్రెస్ సెంటర్‌లో జరగనున్న కీలక అంశాలపై మంత్రి లోకేష్ ప్రసంగించనున్నారు. 23న ఎజైల్ గవర్నెన్స్, డిజిటల్ గవర్నెన్స్, ఇండియా 4.0 అంశాలపై నారా లోకేష్ కీలకోపన్యాసం చేయనున్నారు. 24వ తేదీన సస్టెనబుల్ మాన్యుఫ్యాక్చరింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి అంశాలపై మాట్లాడనున్నారు. దావోస్ పర్యటనలో వైద్య ఆరోగ్య ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య, వ్యవసాయ రంగం ప్రభుత్వ సలహాదారుడు టి. విజయ్‌కుమార్, అజయ్‌జైన్, జాస్తి కృష్ణ కిషోర్, ఆరోఖ్య రాజ్, అహ్మద్‌బాబు, సమాచార శాఖ కార్యదర్శి బి. రామాంజనేయులు, డాక్టర్ జితేందర్ శర్మ, ఐటి ఓఎస్‌డి కిరణ్ గుత్తా, ఐటి జిఎం శ్రీనివాస్ పాల్గొననున్నారు.

టిక్కెట్లు లేకుండానే ముగ్గురు వ్యక్తులు దర్శనం

మహారాష్ట్రకు చెందిన యువకులుగా అధికారులు గుర్తింపు



తిరుమల, మేజర్‌న్యూస్: కలి యుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవెంకటేశ్వరుని సన్నిధిలో భద్రతా వైఫల్యం మరోసారి బయటపడింది. టిక్కెట్లు లేకుండానే ముగ్గురు వ్యక్తులు దర్శనం క్యూలోకి ప్రవేశించారు. కాగా స్కానింగ్ వద్ద ఇద్దరిని, వెండి వాకిలి వద్ద ఒకరిని సిబ్బంది పట్టుకున్నారు. ఉదయం సుప్రభాత సేవ సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. పట్టుబడిన వారు మహారాష్ట్రకు చెందిన యువకులుగా అధికారులు గుర్తించారు.

ముగిసిన తొలి విడత పంచాయతీ ఎన్నికల ప్రచార గడువు



హైదరాబాద్ : తెలంగాణలో తొలి విడత పంచాయతీ ఎన్నికల ప్రచార గడువు శనివారం సాయంత్రంతో ముగిసింది. మొదటి విడతలో 4479 గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసిన విషయం విదితమే. వాటిలో తొమ్మిది పంచాయతీలకు నామినేషన్లు దాఖలు కాలేదు.. మరి 769 పంచాయతీల్లో సర్పంచ్ పదవులు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 3701 పంచాయతీలకు ఈ నెల 21న పోలింగ్ జరగనున్నది. అలాగే తొలి విడతలో 39822 వార్డు సభ్యుల పదవులకు నోటిఫికేషన్ జారీ చేయగా వార్డులకు నామినేషన్లు దాఖలు కాలేదు. 10654 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా 28976 వార్డు సభ్యుల పదవులకు ఎన్నిక జరగనున్నది. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పోలింగ్, అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు జరగనున్నది. శనివారం సాయంత్రం నుంచి తొలి విడత పోలింగ్ జరగనున్న పంచాయతీల పరిధిలో మద్యం దుకాణాలు తెరవకూడదని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

తెల్లకార్డుదారులకు ఆసరా



- 'తల్లి సురక్ష'కు శ్రీకారం
- ప్రభుత్వ ఆసుపత్రులకు ప్రయోజనకరం
- ఆసక్తి చూపని ప్రైవేట్ యాజమాన్యాలు

(అమరావతి సూర్య ప్రత్యేక ప్రతినిధి) ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో తెల్ల రేషన్‌కార్డుదారులకు జరిగే ప్రసవాలకు అయ్యే వ్యయాన్నీ ఇక రాష్ట్ర సర్కారే భరించనుంది. ఈ మేరకు కొత్తగా 'తల్లీ సురక్ష' పథకం ఈ నెల 15 నుంచి పట్టాలెక్కనుంది. ఈ విషయాన్ని వైద్యశాఖ మంత్రి ఫరూక్ తెలిపారు. 'తల్లీ సురక్ష' పరిధిలో, కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం(సీజీహెచ్‌ఎస్)ను అనుసరించి సహజ ప్రసవానికి రూ.8వేలు, సిజేరియన్‌కు 14వేల వంతున ప్రభుత్వ, ప్రైవేట్ ఆసువత్రులకు చెల్లింవులు జరగనున్నాయి. ఇప్పటివరకు ఇలాంటి విధానం లేనందున పేదలు పెద్దసంఖ్యలో ప్రభుత్వా సుపత్రులపైనే ఆధారపడుతున్నారు. ఫలితంగా వాటిపై పెనుభారం పడుతోంది. ఈ నేపథ్యంలో ప్రసవాలకయ్యే వ్యయాన్నీ ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు తరవున చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించినందున సర్కారు ఆసువ్రులపై ఒత్తిడి తగ్గే అవకాశముంది. మండలాల్లోని ప్రైవేట్ ఆసువత్రుల్లో జరిగే కాన్పులకూ ప్రభుత్వం తరవున ఆసరా లభించనున్నందున మాతా, శిశుమరణాలు తగ్గుతాయని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. తెల్లరేషన్ కార్డు దారులకు మ్రామే ఈ సౌకర్యాన్ని కల్పించ బోతున్నారు. ఇదే పంథాలో ఉద్యోగులు, వర్కింగ్ జర్నలిస్టులు ఇప్పటికే లబ్ధిపొందుతున్నారు. వారి విషయంలో సహజ ప్రసవానికి రూ.17వేలు, సిజేరియన్‌కు రూ.18వేలు ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు ద్వారా చెల్లిస్తున్నారు.

సేవల రుసుములపై పెదవి విరువు

తల్లీ సురక్ష పథకం కింద నిర్ధారించిన వైద్యసేవల రుసుముల పట్ల ప్రైవేట్ ఆసువత్రులు పెదవి విరుస్తున్నాయి. గర్భం దాల్చినప్పటి నుంచి కాన్పయ్యే వరకు వైద్యసేవలు అందిస్తేనే పైన పేర్కొన్న మొత్తాల్ని చెల్లిస్తామని ప్రభుత్వం వెల్లడించింది. కేవలం ప్రసవానికే పరిమితమైతే నిర్దేశిత రుసుముల్లో 80 శాతం మొత్తాన్ని చెల్లిస్తామంటూ పలు షరతులు విధించింది. ఈ మొత్తాలు తక్కువగా ఉన్నాయని, వునఃపరిశీలన చేయాలని ప్రైవేట్ ఆసువత్రుల యాజమాన్యాలు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్రశాఖ ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ఫీజులు పెంచకుంటే ఈ పథకాన్ని స్వీకరించలేమని ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు అనుబంధ ఆసువత్రుల్లో కొన్ని చెబుతున్నాయి.

50 నుంచి పది పడకలకు తగ్గింపు

ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు నుంచి అనుబంధ గుర్తింవు పొందాలంటే సంబంధిత ఆసుపత్రిలో తప్పనిసరిగా 50 పడకలు ఉండాలి. ప్రసవాల వరకు పది పడకలున్నా ఆసుపత్రికి గుర్తింవును మంజూరు చేస్తామని వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వూనం మాలకొండయ్య తెలిపారు. దీనిని అనుసరించి మండల కేంద్రాల్లోని ఆసువత్రులు ప్రసవ సంబంధిత వైద్యసేవలు అందించేందుకు ముందుకొస్తాయని ఆశాభావం ప్రకటించారు. వీటిల్లో గైనకాలజిస్టు సేవలు, అల్ట్రాసౌండ్ సౌకర్యం తప్పక ఉండాలి. వెంటిలేటర్ సదుపాయాన్ని ఇతర ఆసువత్రులతో ఒప్పందాన్ని అనుసరించి సమకూర్చుకోవచ్చు.

ప్రభుత్వాసువత్రులకు ప్రయోజనం

ప్రసవాలకు ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు తరవున చెల్లింవులు జరుగుతాయని ప్రకటించడం ద్వారా ప్రభుత్వాసువత్రులు బాగా ప్రయోజనం పొందను న్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఏటా నమోదయ్యే ఐదున్నర లక్షల ప్రసవాల్లో ఏకంగా 45 శాతం సర్కారు ఆసువత్రుల్లోనే జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. గుంటూరు జీజీహెచ్‌లో ఏడాదికి సగటున 8000, విశాఖ కేజీహెచ్, వీజీహెచ్‌లలో 13000, కాకినాడ జీజీహెచ్‌లో 10000, కర్నూలు జీజీహెచ్‌లో 11000, విజయవాడ పాత ఆసుపత్రిలో ఏడువేల వరకు ప్రసవాలు జరుగుతు న్నాయి. సామాజిక, ప్రాంతీయ ఆసుపత్రుల్లోనూ జరిగే కాన్పులు వీటికి అదనం. కొన్నిచోట్ల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ ప్రసవాలు జరుగుతున్నాయి. అనుభవజ్ఞులైన ఎంబీబీఎస్ వైద్యులు, నర్సులు ఉన్నచోట్ల ఇవి ఎక్కువగా నమోదవుతున్నాయి. చెల్లింవుల జాబితాలోనికి వీటినీ తీసుకొ స్తామని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రైవేట్ వైద్య బోధన ఆసువత్రుల యాజ మాన్యాలు ఈ పథకాన్ని స్వాగతి స్తున్నాయని అధికారిక వర్గాలు తెలిపాయి. జాతీయ వైద్య మండలి మార్గదర్శకాల ప్రకారం ఈ ఆసుపత్రులు రోగులకు తప్పక వైద్యసేవలు అందించాలి. ఈ నేపథ్యంలో పథకాన్ని అవి సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ప్రయోజనం పొందుతాయని అధికారులు చెబుతున్నారు.

జగన్‌పై దాడి కేసు : వైసీపీ నేతలను విచారిస్తున్న ఎన్ఐఏ



విశాఖపట్నం : వైసీపీ అధినేత వై ఎస్ జగన్‌మోహన్ రెడ్డి పై జరిగిన దాడి కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) విచారణ కొనసాగుతోంది. విశాఖపట్నంలోని సీతమ్మధారలో మాజీ ఎమ్మెల్యే విజయప్రసాద్‌ను ఎన్ఐఏ అధికారులు విచారిస్తున్నారు. విజయ్ ప్రసాద్ నివాసంలోనే మిగతా వైసీపీ నేతలపైనా విచారణ జరుపుతున్నారు. వైసీపీ నేతలు కరణం ధర్మశ్రీ, శ్రీధర్, నాగిరెడ్డి, రాజన్న దొర, విజయ్ కుమార్, శ్రీనులను వారు ప్రశ్నిస్తున్నారు.

తెలంగాణ పీసీసీ ప్రక్షాళన ఖాయం



హైదరాబాద్ : తెలంగాణ పీసీసీని కూడా ప్రక్షాళన చేయడం ఖాయమని కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారా యణ అన్నారు. పార్టీని భ్రష్టు పట్టించిన పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డిని రేపో మాపో ఆ పదవి నుంచి తప్పిస్తారని ఆయన అభిప్రాయ పడ్డారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉత్తమ్ కనుక కొనసాగితే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీకి పరాభవం తప్పదని ఆయన అన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తన ఓటమికి ఉత్తమ్ కూడా కుట్ర చేశారని సర్వే ఆరోపించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ శాసనసభా పక్ష నేతగా మల్లు భట్టి విక్రమార్కను నియమించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. సీఎల్పీ నేతగా భట్టిని నియమించడం ద్వారా బడుగు వర్గాల ప్రజలకు రాహుల్ గాంధీ భరోసా ఇచ్చినట్టయిందని ఆయన అన్నారు. భట్టి విక్రమార్క సమర్థవంతమైన నాయకుడని సర్వే ప్రశంసించారు.

దాతల విరాళమే డిపాజిట్‌గా సర్పంచ్ అభ్యర్థి నామినేషన్

- పంచాయతీ ఎన్నికల్లో విద్యావంతుడు పోటీ
- తలా కొంత చిల్లర ఇచ్చి సాయపడిన స్థానికులు
- ఆ చిల్లర చూసి తొలుత ఆశ్చర్యపోయిన ఎన్నికల అధికారి

వరంగల్ : దాతలు, స్థానికులు విరాళంగా ఇచ్చిన పెద్ద మొత్తం చిల్లర పట్టుకుని నామినేషన్ వేసేందుకు వచ్చిన ఓ విద్యావంతుడిని చూసి ఎన్నికల అధికారి ఆశ్చర్యపోయారు. వివరాలు తెలుసుకున్న తరువాత అతని నామినేషన్‌ను స్వీకరించారు. వరంగల్ రూరల్ జిల్లా ఆత్మకూరు మండలం చౌళ్లపల్లిలో ఈ ఘటన చోటు చేసుకుంది. తెలంగాణ రాష్ట్రంలో రెండు విడతల్లో పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం రెండో విడత నామినేషన్ల ప్రక్రియ జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో విద్యావంతుబైన ఎదులాపురం శ్రవణ్‌కుమార్ సర్పంచ్‌గా పోటీ చేయాలని ఆసక్తి చూపాడు. ఇందుకు గ్రామస్థులు కూడా సై అన్నారు. నామినేషన్ సందర్భంగా కట్టాల్సిన డిపాజిట్, ఇతర ఖర్చుల కోసం ప్రజలు విరాళాలు సమకూర్చారు. ఆ మొత్తం వెయ్యి రూపాయల చిల్లర నాణాల రూపంలో ఉండడంతో ఓ సంచిలో మూట కట్టి దరఖాస్తు పట్టుకుని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వద్దకు వెళ్లి, నామినేషన్ దాఖలు చేశాడు. ఈ సందర్భంగా శ్రవణ్ మాట్లాడుతూ, వోటుకు నోట్లు ఇచ్చే శక్తి తనకు లేదని, ప్రజల ఆదరాభిమానాలే తనకు శ్రీరామ రక్ష అని చెప్పారు. వారి ఆదరాభిమానాలతో గెలుపు కూడా సొంతం చేసుకుంటానన్న నమ్మకం ఉందని తెలిపాడు. చౌళ్లపల్లిలో 2200 జనాభా ఉండగా, 1545 మంది వోటర్లు ఉన్నారు.

తహసీల్దార్ల మెడపై కోడిపందాల కత్తి

- 58 మందికి చార్జి మెమోలు
- బెంబేలెత్తుతున్న అధికారులు
- రిటైర్డ్ తహసీల్దార్లకు పెన్షన్ కట్



రాజమహేంద్రవరం,సూర్యబ్యూరో: సంక్రాంతికి కోర్టు ఆదేశించినా, పోలీసులు, అధికారులు హెచ్చరించినా కోడి పందెం ఆగలేదు. కత్తికట్టి పందెం కట్టారు. గుండాట, పేకాటలతో రెచ్చిపోయారు. కోట్లాది రూపాయలు చేతులు మారాయి. కొన్ని చోట్ల పోలీస్, రెవెన్యూ అధికారులకు మామూళ్లు అందినట్టు ప్రచారం జరుగుతోంది. కాని తహసీల్దార్లకు మాత్రం ఓ భయం వెంటాడుతోంది. గతేడాది కోడిపందాలు నిర్వహణ పూర్తయిన తర్వాత కోడిపందాలు ఆపడానికి ఏమి చర్యలు తీసుకున్నారని కోర్టు అడగడంతో రెవెన్యూ అధికారులు, పోలీసులు అప్పటికే నమోదు చేసిన కొన్ని కేసులతో రికార్డు తయారు చేశారు. కొన్ని జిల్లాల కలెక్టర్లు తాము కొన్ని ఆంక్షలతో ఆదేశాలు జారీ చేసినా తహసీల్దార్లు సరైన చర్యలు తీసుకోకపోవడం వల్లే కోడిపందాలు జరిగినట్టు స్పష్టం చేయడంతో వారికి ఛార్జి మెమోలు కూడా జారీ చేసినట్టు తెలిపారు. అంతేకాక, మన జిల్లాలో 16 మందికి, పశ్చిమగోదావరి జిల్లాలో 42 మంది తహసీల్దార్లకు ఛార్జి మెమోలిచ్చారు. ఈలోపులో రిటైరయిన తహసీల్దార్లకు పెన్షన్లు కూడా రద్దయ్యాయి. ఈ కేసులు క్లియర్ అయితే కాని వారికి పెన్షన్లు వచ్చే అవకాశం లేదు. కాని పోలీసు ఉన్నతాధికారులు మాత్రం కింది స్థాయి పోలీసులకు మెమోలు ఇచ్చినట్టే ఇచ్చి డీజీపీ స్థాయిలో తీసుకున్న నిర్ణయం మేరకు క్లియరెన్స్ ఇచ్చినట్టు సమాచారం. అదే విధంగా తహసీల్దార్లకు కూడా ఇవ్వాలని రెవెన్యూ యూనియన్ నాయకులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో ఏమి చర్యలు తీసుకున్నారని కోర్టు అడగడం, కిందిస్థాయి అధికారులపై చర్యలు తీసుకుంటూ ఆదేశించే అవకాశం ఉంటుందని తహసీల్దార్లు భయపడుతున్నారు. ఇటీవల కొందరు గోదావరి జిల్లాలో కోడిపందాలు వేసే ప్రాంతాలలో వీఆర్‌వోలను, ఇతర రెవెన్యూ సిబ్బందిని కాపలా పెట్టి ఆపే ప్రయత్నం చేయడంతో, కొందరు ఎమ్మెల్యేలు ఆయా తహసీల్దార్లపై సీరియస్ అయినట్టు రెవెన్యూ వర్గాల్లో ప్రచారం జరుగుతుంది. ఈ నేపథ్యంలో తహసీల్దార్లు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.

పిల్లలను కిడ్నాప్ చేస్తున్నాడంటూ ఆటో డ్రైవర్‌ను చితకబాదిన గ్రామస్థులు

రాజమహేంద్రవరం : ఇటీవల చిన్నారులను కిడ్నాప్ చేసే ముఠాలు వచ్చాయని వదంతులు వ్యాప్తి కావడంతో దేశవ్యాప్తంగా చాలా మందిని స్థానిక ప్రజలు చావగొట్టిన సంగతి తెలిసిందే. తాజాగా అలాంటి ఘటనే ఆంధ్ర ప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లాలో చోటు చేసుకుంది. సంక్రాంతి పండుగ వేళ అనిరుధ్, నాగప్రవీణ అనే చిన్నారులు జిల్లాలోని గోకవరానికి వచ్చారు. ఈ సందర్భంగా ఊరి నుంచి వెళుతున్న ఓ ఆటోలో ఈ చిన్నారులు ఎక్కారు. ఈ విషయాన్ని గ్రామస్థులు పిల్లల కుటుంబ సభ్యులకు తెలియజేశారు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఆటోను ఒక్కసారిగా చుట్టుముట్టారు. తాను కిడ్నాపర్‌ను కాదు మొర్రో అని మొత్తుకుంటున్నా వినకుండా డ్రైవర్‌ను చావగొట్టారు. అనంతరం తాళ్లతో కట్టేసి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలికి చేరుకున్న పోలీసులు బాధితుడిని ఆసుపత్రికి తరలించారు. కాగా, పిల్లలు సరదా పడితేనే తాను ఆటోలో ఎక్కించుకున్నానని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

పర్యాటకాభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

- బోటింగ్ విభాగంపై ప్రత్యేక దృష్టి
- ఎంటర్‌టైన్‌మెంట్ గేమింగ్‌పై దృష్టి



(అమరావతి సూర్య ప్రత్యేక ప్రతినిధి) : అమరావతి రాజధాని ప్రాంతంలో కష్ణా, గుంటూరు జిల్లాలు విజయవాడ డివిజన్ పర్యాటకాభివద్ధి సంస్థ పరిధిలో ఉన్నాయి. పర్యాటకాభివద్ధి కార్యక్రమాలు నిర్వహించటానికి పర్యాటక శాఖ, బీఐటీసీ, ఏపీటీఏ, జిల్లా టూరిజం కమిటీలు ఉన్నప్పటికీ, పర్యాటకాభివద్ధి సంస్థ (ఏపీటీడీసీ)పై ప్రత్యేక బాధ్యతలు ఉన్నాయి. ఆయా సంస్థలు భవానీ ఐలాండ్గ డెవలప్‌మెంట్, క్యాపిటల్ బ్రాండింగ్ కల్పించటానికి మెగా ఈవెంట్స్, ఫెస్టి వల్స్ వంటి వాటిపై దష్టి సారించినా, ఏపీ టీడీసీ మ్రాం పర్యాటకుల సదుపాయాలపై దష్టి సారించాల్సి ఉంటుంది. రెండుజిల్లాల్లో పర్యాటకులకు వసతులు కల్పించటం ద్వారా సగటున నెలకు రూ.1.14 కోట్ల ఆదాయం వస్తోంది. మరికొన్ని నిధులు ఖర్చుపెట్టి మరిన్ని వసతులు కల్పించటం ద్వారా ఆదాయం గణనీయంగా పెంచుకోనే అవకాశం ఉంది.

రికార్డు స్థాయిలో ఆదాయం...

రెండు జిల్లాల్లో డిసెంబరు నెలలో రికార్డు స్థాయిలో రూ.1.54 కోట్ల ఆదాయం సమకూరింది. భవానీ ఐల్యాండ్గకు రూ.40 లక్షలు, హరిత బెర్మ్‌పార్క్‌కు రూ.44 లక్షలు వెరసి రూ.84 లక్షల మేర వచ్చింది. మరో రూ.28 లక్షల మేర బోటింగ్ కార్యకలాపాల ద్వారా సమకూరింది. బాపట్లలోని సూ ర్యలంక బీచ్ రిసార్ట్స్‌కు రూ.32 లక్షలు, అవ్నరావతికి రూ.11 లక్షల మేర ఆదాయం వచ్చింది. పర్యాటక కలాపాలు పెరగటం, పర్యా టకుల సంఖ్య పెరగటం వల్లే ఈ ఆదాయం సమకూరటం విశేషం. వారాంతాల్లో భవానీ ఐల్యాండ్గ, హరిత బెర్మ్‌పార్క్‌లకే రెండు వేల మంది పర్యాటకులు వస్తున్నారు. కార్తీక మాసంలో ప్రతి ఆదివారం ఐదు వేల మంది పైగా వస్తున్నారు.

కాటేజీల సంఖ్య పెరగాలి...

హరిత బెర్మ్‌పార్క్‌లో 30 సూట్లు, సూర్యలంక బీచ్ రిసార్ట్స్‌లో 27 సూట్లు ఉన్నాయి. ఈ కాటేజీలకు సగటున 60 – 70 శాతం, వారాంతాలు, ప్రత్యేక సందర్భాల్లో నూరుశాతం ఆక్యుపెన్సీ ఉంటోంది. భవానీ ఐల్యాండ్గలో బీఐటీసీ నేత త్వంలో రివర్స్ హౌస్ కాటేజీ, సింహం, జిరాఫీ ఆకారాల్లో మూడు కాటేజీలు రూవుదిద్దుకుంటున్నాయి. ఇవి త్వరలో ఏపీటీడీసీ నిర్వహణ చేతికి వస్తాయి. నాలుగు ట్రీ టాప్ కాటేజీలు కూడా ఉన్నాయి. కాటేజీలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉంది.

చెక్ అవుట్ పద్ధతిలో

ఏపీటీడీసీ విజయవాడ డివిజన్ ఇటీవల వీలైనంత ఎక్కువమందికి వసతి సదుపాయాలు కల్పించాలన్న ఉద్దేశ్యంతో ఉదయం 9 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 9 గంటల వరకు చెక్ అవుట్ పెట్టింది. మధ్యాహ్నం, సాయత్రం సూట్లను తీసుకున్నా ఉదయం 9 గంటలకు చెక్ అవుట్ చేయాల్సి ఉంటుంది. ఈ సమస్యలకు చెక్ పెట్టాలంటే అదనవు కాటేజీలను నిర్మించాల్సిన అవసరం ఉంది. హరిత బెర్మ్‌పార్క్‌లో ఎన్‌హెచ్ – 65 వెంబడి జీ ప్లస్ 2 విధానంలో భారీ కాటేజీల నిర్మాణం చేయటానికి అనువైన పరిస్థితులు ఉన్నాయి. భవానీ ఐల్యాండ్గ, సూర్యలంక బీచ్ రిసార్ట్స్, అమరావతిలలో అదనవు కాటేజీల నిర్మాణం చేపట్టడానికి అనువైన పరిస్థితులు ఉన్నాయి. సూర్యలంకలో రెండు సూట్‌ల నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు.

బోటింగ్ విభాగంపై దష్టి సారించాలి

హరిత బెర్మ్‌పార్క్, భవాని ఐలాండ్గలకు ఉమ్మడి బోటింగ్ యూనిట్ ఉంది. సగటున బోటింగ్ యూనిట్ 80 నుంచి 90 శాతం ఆక్యుపెన్సీతో నడుస్తోంది. మొత్తంగా కష్ణానదిలో విహారం చేయటానికి 343 సీటింగ్ సామర్థ్యం మ్రామే ఉంది. కనీస అవసరాలను దష్టిలో ఉంచుకుంటే ఐదొందల సీటింగ్ కెపాసిటీకి తగిన వ్యవస్థ ఉండాలి. దీనికి అనుగుణంగా రెండు మెకనైజ్డ్ బోట్లకు టెండర్లు పిల వటానికి సన్నాహాలు జరుగుతున్నాయి. వీటి సామర్థ్యం మరో 100 సీట్లకు ఉంటుంది. భవిష్యత్తు అవసరాలను దష్టిలో ఉంచుకుని మరో 250 సీటింగ్ అవసరాలకు సరిపడా బో ట్లను సమకూర్చుకోవాల్సిన అవసరం ఉంది.

వీటిపై దష్టి సారించాలి

హరిత బెర్మ్‌పార్క్‌లోని బార్ ద్వారా ఏపీటీడీసీ సగటున రోజుకు 20 వేల వ్యాపారం జరుగుతోంది. రెస్టారెంట్ల ద్వారా మొత్తం ఆదాయంలో 20 శాతం పైగా వాటా ఉంటోంది. రెస్టారెంట్లను ఆధునీకరణ చేయాల్సి ఉంది. వుడ్గకోర్టులు, వుడ్గస్టాల్స్‌ను కూడా సొంతంగా ఏర్పాటు చేసే అంశాలపై దష్టి సారించాల్సి ఉంది. గేమింగ్‌కు సంబంధించి ద్వీపంలో స్పైడర్‌నెట్, జిప్‌లైర్, సైక్లింగ్, రాక్ క్లైంబింగ్, బంపర్‌వంటి ఆటల నిర్వహణను ప్రైవేటుకు అప్పగించారు. వీటిలో చిన్నపాటి గేమ్స్‌కు భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. వీటిని ఏపీటీడీసీ స్వయంగా ఏర్పాటు చేయటంతో పాటు, మరిన్ని వినోద ప్రదమైన గేమింగ్‌కు అవకాశం కల్పించాల్సిన అవసరం ఉంది.

విజయవాడలో రెచ్చిపోయిన బ్లేడ్ బ్యాచ్

విజయవాడ : ఆంధ్ర ప్రదేశ్‌లోని విజయవాడలో బ్లేడ్ బ్యాచ్ రెచ్చిపోయింది. ఇటీవల ఓ పోలీస్ కానిస్టేబుల్‌పై దాడి చేసిన ఈ గ్యాంగ్ సభ్యులు తాజాగా శుక్రవారం రాత్రి ఇద్దరు ఆటో డ్రైవర్లపై బ్లేడ్లతో దాడి చేశారు. దీంతో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చేరిన బాధితులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లో శుక్రవారం తాము వస్తుండగా పాత నేరస్థుడు ఇమ్రాన్, అతని స్నేహితులు దాడి చేశారని బాధితులు పోలీసులకు తెలిపారు. ఈ విషయమై పోలీస్ ఉన్నతాధికారులు మాట్లాడుతూ, ఈ బ్లేడ్ బ్యాచ్ వారం రోజుల క్రితం ఓ ఏఆర్ కానిస్టేబుల్‌పై దాడి చేసిందని తెలిపారు. తాజాగా ఇద్దరు ఆటో డ్రైవర్లపై దాడి చేశారన్నారు. ప్రస్తుతం పరారీలో ఉన్న నిందితులను పట్టుకునేందుకు సిబ్బందిని రంగంలోకి దించామన్నారు. వీరిని త్వరలోనే అరెస్ట్ చేసి కేసు నమోదు చేస్తామన్నారు.

శంషాబాద్ విమానాశ్రయంలో నిలిచిపోయిన తిరుపతి స్పైస్‌జెట్ విమానం

హైదరాబాద్ : తిరుపతి వెళ్లాల్సిన స్పైస్‌జెట్ విమానం హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయంలో నిలిచిపోయింది. విమానంలోని రెండు ఇంజన్లలో ఒకటి పని చేయక పోవడంతో శనివారం తెల్లవారు జామున బయలుదేరవలసిన విమానాన్ని శంషాబాద్‌లో నిలిపివేశారు. సాంకేతిక లోపం కారణంగా విమానం ఎగిరే పరిస్థితి లేదని సంస్థ అధికారులు ప్రకటించడంతో ప్రయాణికులు నిరాశ చెందారు. విమానంలో తిరుమల తిరుపతి దేవస్థానం జెఇఒ శ్రీనివాసరాజు తదితర ప్రముఖులు ఉన్నట్లు సమాచారం.

సిక్కోలు వారసులు


కింజరావు రామ్మోహన్ నాయుడు
కింజరావు ఎర్రన్నాయుడు


డా॥ ధర్మాన కృష్ణ చైతన్య



ధర్మాన ప్రసాదరావు, కృష్ణదాసు

రాజకీయాలు ఎప్పుడూ రసవత్తరమే.. నాయకుల పుత్రరత్నాలే ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా, పార్టీ అధినేతలుగా చలామణి అవుతూ వస్తున్న ఈ చదరంగంలో..ఎవరి ఎత్తులు ఫలిస్తాయో. ఎవరికి తల బొప్పులు కడతాయో ఊహించలేము. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీ పంచబోయే సీట్లపై ఆసక్తికరమైన చర్చ అప్పుడే మొదలయింది. ప్రజా క్షేత్రంలో నిత్యం శ్రమించే వారికి మాత్రమే టిక్కెట్లు దక్కే అవకాశం ఉందని అటు వైసిపి అధినేత జగన్ సంకేతాలు ఇచ్చారు. కాగా వచ్చే ఎన్నికల్లో టీడీపీకి యువ రక్తాన్ని ఎక్కించి పాలనను కొత్త వుంతలు తొక్కించేందుకు తెలుగు దేశం అధినేత చంద్రబాబు ఆసక్తి చూవుతున్నారు. ఇందులో భాగంగానే తన తనయుడు లోకేష్‌ను ప్రత్యక్ష రాజకీయాల్లోకి రప్పించి, కీలక మంత్రి పదవి అప్పగించారు. అలాగే పర్యాటక మంత్రిగా భూమా అఖిలప్రియకు కేబినెట్‌లో స్థానం కల్పించారు. భూమా బ్రహ్మానందరెడ్డికి ఎమ్మెల్యేని చేసారు. రానున్న ఎన్నికలలో యువతకు పెద్ద పీట వేయాలని చంద్రబాబు, జగన్‌ల మాటలతో సిక్కోలు నాయకులంతా తమ వారసులను పార్టీ కార్యక్రమాల్లో బిజీ బిజీ చేస్తున్నారు. రాష్ట్రంలోని మెజారిటీ నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి కొనసాగుతోంది! యువ నాయకులు శక్తి మేరకు ప్రజల్లోకి వెళుతు, అందరికీ తలలో నాలుకలా ప్రజలతో మమేకమవుతూ రాజకీయ ప్రస్థానానికి బలమైన వునాదులు వేసుకునేందుకు సంసిద్ధులవుతున్నారు!! దీంతో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వారసులు, యువ లీడర్లకు దక్కే అవకాశాలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

కింజరావు రామ్మోహన్ నాయుడు

శ్రీకాకుళంలో కాకలు తీరిన రాజకీయ యోధుడు, మాజీ మంత్రి కింజరావు ఎర్రన్నాయుడు తనయుడు రామ్మోహన్ నాయుడు మూడు పదులు కూడా నిండకుండానే తండ్రి మరణంతో పొలిటికల్ ఎంట్రీ ఇచ్చి ఎంపీగా గెలవడంతో పాటు దూసుకు పోతున్నాడు. ప్రస్తుతం రామ్మోహన్ నాయుడు పార్లమెంటులో తెలుగోడి గోడు వినిపిస్తూ సత్తా చాటుతున్నాడు. ఇప్పటికే అచ్చెన్నాయుడు రాష్ట్ర మంత్రిగా పనిచేస్తు, అసెంబ్లీ బరిలో దిగేందుకు సిద్ధమవుతుంటే, ఇదే కుటుంబం నుంచి మరో యువ నాయకుడు శ్రీకాకుళం జిల్లాలోని ఏదైనా అసెంబ్లీ స్థానం నుంచి అవకాశం ఇవ్వాలని కోరుతున్నట్టు సమాచారం. ఈ విషయమై వారి కుటుంబంలో అంతర్గత చర్చల్లో ఉందని చెప్పుకుంటున్నారు

శ్రీకాకుళం జిల్లా వారసత్వ రాజకీయాలను ఓ సారి చూస్తే, ఒకనాటి రాజకీయ నేతలుగా, కాంగ్రెస్ పార్టీకి అన్ని విధాలా అండదండగా ఉన్న బొడ్డేపల్లి రాజగోపాలరావు , మజ్జి తులసీ దాసుల వారసురాళ్లుగా రంగంలో సత్యవతి, శారద తమ తండ్రుల స్థాయిలో పేరు తెచ్చుకోలేకున్నా, ఎమ్మెల్యేగా సత్యవతి ఎన్నిక కాగా... శారద కూడా కాంగ్రెస్‌లో కీలక సభ్యురాలిగా కాస్తో కూస్తో గుర్తింపు తెచ్చుకున్నవారే! వీరు కూడా జిల్లా రాజకీయాల్లో సత్తా చాటేందుకు తమ వంతు ప్రయత్నాలు తాము చేస్తున్నారు. ఏపీలో 2019 ఎన్నికల్లో అధికార టీడీపీ, విపక్ష వైసీపీలో పలువురు సీనియర్ నాయకులు, మంత్రులు, ఎంపీల వారసులు పొలిటికల్ ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఈ లిస్టులో చాలా మందే ఉన్నారు. ఇక కీలకమైన ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం జిల్లా నుంచి కూడా పలువురు వారసులు వచ్చే ఎన్నికల్లో కీలకంగా మారనున్నారు. ఇప్పటికే కొంత మంది వారసులు పొలిటికల్ ఎంట్రీ ఇవ్వగా, మరి కొందరు వచ్చే ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటివరకూ టీడీపీని భుజస్కందాలపై మోసిన సీనియర్లు.. ఇప్పుడు తమ వారసులను రంగంలోకి దించుతున్నారు. ఇన్నాళ్లూ తెరవెనుక ఉంటూనే పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న యువ నాయకులు.. ఇప్పుడు ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఇప్పటికే కొందరు తండ్రుల బాటలో పయనిస్తుండగా.. మరికొందరు ఇప్పుడిప్పుడే రంగంలోకి దిగుతున్నారు. బూత్ స్థాయిలో ప్రచారాలు, పోల్ మేనేజ్మెంట్, సోషల్ మీడియా ద్వారా ప్రచారం.. ఇలా అనేక రీతుల్లో ప్రజలకు చేరువయ్యే ప్రయత్నం చేస్తున్నారు. ఉన్నత చదువులు చదివిన వీరంతా కొత్త తరహా ప్రచారాలు చేస్తూ తద్వారా విజయం సాధించేందుకు యత్నిస్తున్నారు.


ధర్మాన రామ్మోహన్ నాయుడు

కిమిడి మల్లిక్ నాయుడు


కిమిడి కళా


కిమిడి మల్లిక్

రాష్ట్ర మంత్రి, తెలుగుదేశం పార్టీ ఎపి అధ్యక్షుడు కళావెంకట్రావు కొడుకు మల్లిక్ నాయుడు, తండ్రి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరిస్తుండడంతో ఎక్కువగా అమరావతితో పాటు వివిధ జిల్లాలలో పర్యటనలు, రాష్ట్రరాజకీయాలు, మంత్రిగా బాధ్యతలు నెరవేరుస్తున్న నేపథ్యంలో రాజాం నియోజకవర్గంతో పాటు ఎచ్చర్ల నియోజకవర్గంలో లో ఆ లోటును తనయుడు రామ్ మల్లిక్నాయుడు తీరుస్తున్నారు. అమెరికాలో ఎంబీఏ చదివిన మల్లిక్ ఒక పక్క సొంత వ్యాపారం చేసుకుంటూ... మరోపక్క నియోజకవర్గంలో ప్రజలు, పార్టీ క్యాడర్‌కుఅందుబాటులో ఉంటున్నారు. సమస్యలపై ఎవరు వచ్చినా అధికారులతో మాట్లాడి పరిష్కరించడం... జనం సమస్యలు వినడం నుంచి పార్టీ కార్యక్రమాల నిర్వహణ వరకు మొత్తం దగ్గరుండి చేయిస్తున్నారు.

ధర్మాన వారసులు

మాజీ మంత్రి ధర్మాన కుమారుడు రామ్మోహన్ నాయుడు (అలియాస్ చిన్నీ), ఎంబీఏ చదివారు. ఒకపక్క మైనింగ్ వ్యాపారం చేస్తూనే తండ్రికి మద్దతుగా నియోజవర్గంలో సమీక్షలు, క్యాడర్తో ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నారు

మాజీ ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ కుమారుడు కృష్ణచైతన్య ఎంబీబీఎస్ పూర్తి చేసి వైద్యవఎత్తిలో కొనసాగుతూనే తండ్రికి మద్దతుగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పార్టీని బలోపేతం చేయడంపై దవష్టి సారించారు. ప్రత్యర్థి పార్టీకి దీటుగా మ్యహాలు రచిస్తూ శ్రేణులను సమాయత్తం చేస్తున్నారు.

గౌతు శిరీష


గౌతు శివాజీ


గౌతు శిరీషా

పలాస ఎమ్మెల్యే గౌతు శ్యామ సుందర శివాజీ కుమార్తె అయిన గౌతు శిరీష ఇప్పటికే తెలుగు దేశం పార్టీ జిల్లా అధ్యక్షురాలిగా దూసుకుపోతున్నారు. వయసు రీత్యా ఇకపై ప్రత్యక్ష రాజకీయా ల నుంచి విరమించుకుంటారని గౌతు శిరీష వచ్చే ఎన్నికల్లో పలాస నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేయనున్నారని సమాచారం. పార్టీ కార్యక్రమాలలో పాల్గొనడంతో పాటు నియోజకవర్గం లోనూ విస్తృతంగా పర్యటిస్తు, విపక్షాలను ఎండగట్టడంలో ప్రధమ స్థానంలో ఉండటం కలసివచ్చే అంశం ఈమెకు.

తమ్మినేని నాగ్

మరో మాజీ మంత్రి తమ్మినేని కుమారుడు నాగ్ ఇప్పటికే రాజకీయాల్లోకి వచ్చి క్రియాశీలక పాత్ర పోషిస్తూ జిల్లాలో భవిష్యత్ రాజకీయ వారసుడిగా రెడీ అవుతున్నారు. ఆముదాల వలస నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. లా చదివిన నాగ్ తండ్రి తరపున పార్టీ కార్యక్రమాల నిర్వహణను చేపడుతున్నారు. అక్కడ ప్రత్యర్థి గట్టిగా ఉండడంతో ఆయనకు దీటుగా పోటీ ఇచ్చేలా ఇప్పటి నుంచే వ్యూహాలతో ముందుకు సాగుతున్నారు. తండ్రి తమ్మినేని సీతారాం వైసీపీ తరపున శ్రీకాకుళం పార్టమెంటరీ నియోజకవర్గం నుంచి పోటీ చేసే పక్షంలో ఆమదాల వలస సీటు తనకు ఇవ్వాలని కోరుకుంటున్నారాయన.


తమ్మినేని నాగ్


తమ్మినేని సీతారాం

కావలిగ్రీష్మ


కావలి ప్రతిభాభారతి


కావలి గ్రీష్మ

మాజీ స్పీకర్ కావలి ప్రతిభా భారతి తనయురాలు గ్రీష్మ కూడా వచ్చే ఎన్నికల కోసం అంతా సిద్దం చేసుకుంటున్నట్లు చెబుతున్నారు. ఇప్పటికే రాజాం నియోజకవర్గంలో కలియదిరుగుతున్నారు. పార్టీ కార్యక్రమాల నిర్వహణ, క్యాడర్‌తో సమావేశాలు, ప్రజల తో మమేకమై సమస్యలు తెలుసుకుని పరిష్కరించే దిశలో కృషి చేస్తున్నారు. రానున్న ఎన్నికల్లో రాజాం నుంచి తన మాతృమూర్తి లేదంటే తాను పోటీ చేసేలా ఇప్పటి నుంచే వ్యూహం సిద్ధం చేసుకుని... ఆ దిశగా పయనిస్తున్నా, కొండ్రుమురళీ రాకతో గ్రీష్మను మండలికి ఎంపిక చేస్తామని స్పష్టమైన హామీ పొందినట్టు సమాచారం.

రెడ్డి శాంతి

రాజ్యసభ సభ్యుడిగా, ఉనుకూరు ఎమ్మెల్యేగా, శ్రీకాకుళం డిసిసి చైర్మన్‌గా సేవలందించిన పాలవలస రాజశేఖర కుమార్తె రెడ్డి శాంతి ఇప్పటికే వైసిపి తరపున పాతపట్నం నియోజకవర్గంలో అభ్యర్ధిగా ప్రచారం ఆరంభించారు. రెడ్డి శాంతి ప్రస్తుతం వైసిపి జిల్లా పార్టీ అధ్యక్షురాలిగా ఉండి చురుకైన బాద్యతలు నెరవేరుస్తున్న విషయం విదితమే. ఇటీవల పార్టీ అధినేత జగన్ పాదయాత్ర సందర్భంలోనూ టిక్కెట్టుపై పాలవలస కుటుంబానికి పూర్తి భరోసా లభించినట్టు ఆ పార్టీ వర్గాలు చెపుతున్నాయి. గత ఎన్నికలలో పాతపట్నం నుంచి వైసిపి పార్టీ తరపున విజయం సాధించి తెలుగుదేశం పార్టీలో చేరిన కలమట వెంకట రమణని ఓడించడమే తమ లక్ష్యంగా రెడ్డి శాంతి తన ప్రచారం సామాజిక మీడియాలోనూ సాగిస్తున్నారామె.


రెడ్డి శాంతి

బగ్గు సునీల్



నరసన్నపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి తనయుడు బగ్గు సునీల్ చురుగ్గా వ్యవహరిస్తున్నారు. ఇంజినీరింగ్, ఎంబీఏ పూర్తిచేసిన ఆయన వ్యవసాయపరమైన వ్యాపారం చేసుకుంటూనే తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటు రాజకీయ సమఉజ్జీ అవుతున్నారు.

కలమట వారసులు

కలమట వారసత్వం. రాష్ట్రంలో అనుభవం, ఆకర్షణ, వాగ్ధానం, వ్యూహాలు మేలికలయికతో పాతపట్నం నియోజకవర్గంలో తిరుగులేని నేతగా మారిన కలమట మోహనరావు వారసుడిగా గత ఎన్నికలలో వైసిపి తరపున అసెంబ్లీకి ఎన్నికయ్యారు వెంకటరమణ. ఆయన పార్టీ మారటంతో ఆయన తనయుడు సాగం అభ్యర్ధి కావచ్చనే వార్తలొస్తున్నాయి. ఎంబీఏ చదివి న ఆయన ఇప్పటికే తెలుగుదేశం పార్టీ వ్యవహారాల్లో చురుకుగా పాల్గొంటున్నారు.





గుండ విశ్వనాథ్

శ్రీకాకుళం ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి చిన్నకుమారుడు గుండ విశ్వనాథ్ కూడా ఉన్న విద్యావంతుడు. గత ఎన్నికల్లో అమ్మ తరఫున ప్రచారంతో అందరికి పరిచయం అయ్యాడు. తండ్రి మాజీ మంత్రి అప్పల సూర్యనారాయణ కావడంతో విశ్వనాథ్ కూడా పొలిటికల్ ఎంట్రీ ఇవ్వాలని చూస్తున్నాడు.

cinema@suryaa.com

సూర్య సినిమా

మా బ్యానర్‌లో బిగ్గెస్ట్ హిట్

–దిల్ రాజు



విక్టరీ వెంకటేష్, వరుణ్ తేజ్, తమన్నా, మెహరీన్ హీరో హీరోయిన్స్‌గా దిల్‌రాజు సమర్పణలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై అనీల్ రావిపూడి దర్శకత్వంలో శిరీష్, లక్ష్మణ్ నిర్మించిన చిత్రం 'ఎఫ్ 2.. ఫన్ అండ్ ఫ్రస్టేషన్'. సంక్రాంతి సందర్భంగా జనవరి 12న విడుదలైన ఈ చిత్రం హౌస్‌ఫుల్ కలెక్షన్స్‌తో విజయ దుందుభి మోగిస్తుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్‌ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరు పాల్గొన్నారు.

దర్శకుడు అనీల్ రావిపూడి మాట్లాడుతూ.. ఈ సంక్రాంతికి ఎస్.వి.సి బ్యానర్‌లో మంచి సినిమా చేసే అవకాశం ఇచ్చిన దిల్‌రాజుగారికి, శిరీష్‌గారికి, లక్ష్మణ్‌గారికి థాంక్స్. మంచి ట్యూన్స్, బ్యాగ్రౌండ్ స్కోర్ ఇచ్చిన దేవిశ్రీ ప్రసాద్‌గారికి థాంక్స్. వరుణ్‌తేజ్ సూపర్బ్ పెర్ఫామెన్స్ చేశాడు. తనతో మరచిపోలేని ప్రయాణం. ఇంకా మరిన్ని సినిమాలు చేయాలనుకుంటున్నాను. నాపై నమ్మకంతో సినిమా చేసినందుకు వెంకటేష్‌గారికి థాంక్స్. నా లైఫ్‌లో ఈ సంక్రాంతి జీవితాంతం గుర్తుండిపోయే సంక్రాంతి.. అన్నారు.

హిట్ చిత్రాల నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ.. మా సినిమాకు ఎఫ్ 2 అనే టైటిల్ పెట్టి అనీల్ అనౌన్స్ చేసి వీ 2(వెంకటేష్, వరుణ్‌తేజ్)గా ఇద్దరు హీరోలు జాయినయ్యారు. సినిమా ఈ2(ఎంజాయ్ మెంట్, ఎంటర్‌టైన్‌మెంట్) అని మెసేజ్‌లు పెట్టారు. చివరకు బీ 2(బొమ్మ బ్లాక్‌బస్టర్) అనేశారు. మా బ్యానర్‌లో ఇది 31వ సినిమా. ఇంత మంచి ఎంటర్‌టైన్‌మెంట్ మూవీ చేసిన అనీల్‌కు థాంక్స్. సినిమా హిట్ అవుతుందనే అనుకున్నాం కానీ.. ఇంత పెద్ద హిట్ అవుతుందని అనుకోలేదు. కొంచెం నవ్విస్తే చాలు.. బ్రహ్మరథం పడతారని ప్రేక్షకులు నిరూపించారు. సీతమ్మవాకిట్లో సిరిమల్లెచెట్టు సినిమాతో వెంకటేష్‌గారు 50 కోట్ల క్లబ్‌లో జాయిన్ అయ్యారు. ఫిదాతో వరుణ్ 50 కోట్ల క్లబ్‌లో జాయిన్ అయ్యారు. ఇద్దరికీ కలిపి ఈ సినిమా 50 కోట్ల సినిమా అయ్యింది. అనిల్ మూడు సక్సెస్ సినిమాలు చేశాడు. కానీ ఈ సినిమా సక్సెస్ కిక్ తనకు మరోలా ఉంది. ఇన్ని సినిమాల్లో మాకు ఎక్కువ లాభాలను తెచ్చి పెట్టిన సినిమా ఇదే అయ్యింది. పేరుతో పాటు డబ్బును తెచ్చిన సినిమా ఇది.. అన్నారు.

వరుణ్ తేజ్ మాట్లాడుతూ.. సినిమాను పెద్ద సక్సెస్ చేసినందుకు థాంక్స్ చెప్పడం చిన్నమాటే అవుతుంది. వెంకటేష్‌గారితో ఈ సినిమాకు వర్క్ చేసి ఇన్‌స్పైర్ అయ్యాను. కామెడీ సీన్స్‌లో వెంకటేష్‌గారితో నటించాలంటే సిగ్గు, భయంగా ఉండేది. ఎలా చేస్తానో అనుకునేవాడిని. కానీ ఆయన ఓ సోదరుడిలా ఉండి సపోర్ట్ చేశారు. ఆయనకు థాంక్స్. ఆయనతో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నాను. ఈ సినిమా తర్వాత వెంకటేష్‌గారిని, అనీల్‌గారిని మిస్ అవుతున్నా. త్వరలోనే ఎఫ్ 3 చేయబోతున్నాను.. అన్నారు.

విక్టరీ వెంకటేష్ మాట్లాడుతూ.. సినిమాను హిట్, సూపర్‌హిట్ అనుకుంటే.. ప్రేక్షకులు సూపర్ డూపర్ హిట్ చేసేశారు. మనస్ఫూర్తిగా ప్రేక్షకుల కళ్లలో ఆనందం చూసినప్పుడు.. పదేళ్ల తర్వాత థియేటర్‌కు వెళ్లి అక్కడ ఆడియెన్స్ రెస్పాన్స్ చూసినప్పుడు.. నాకు మాత్రం కళ్లలో కన్నీళ్లు వచ్చేశాయి. మేం అందరం కష్టపడి పనిచేసినప్పుడు.. ప్రేక్షకులు బాగా ఆదరించినప్పుడు ఆ ఆనందమే వేరు. గణేష్, ప్రేమించుకుందాం రా, బొబ్బిలిరాజా, నువ్వునాకు నచ్చావ్, మల్లీశ్వరి ఇలా చాలా సినిమాలను సక్సెస్ చేశారు. చాలా ఏళ్ల తర్వాత ఇంత పెద్ద సక్సెస్ ఇచ్చినందుకు ఆనందంగా ఉంది. మీరు మళ్లీ ఎంటర్‌టైన్‌మెంట్ సినిమా చేయాలి. ఆడియెన్స్ మిమ్మల్ని అలా చూడాలనుకుంటున్నారని చెప్పినప్పుడు ఆనందమేసి అటెంప్ట్ చేశాను. దిల్‌రాజు, శిరీష్, లక్ష్మణ్‌లకు ఇంత మంచి సినిమా ఇచ్చినందుకు థాంక్స్. ఫ్యామిలీతో మళ్లీ మళ్లీ సినిమా చూసి ఎంజాయ్ చేయండి.. అన్నారు!!

పెళ్లి కాని ప్రభాస్‌లు

మల్లీశ్వరి సినిమా తర్వాత నుంచి పెళ్లి కాని ప్రసాద్ అనే మాట ముదర బెండకాయ అనే వాడుకకు పర్యాయపదంగా మారిపోయింది. పెళ్లి కాని ప్రసాద్ పేరుతో పది పన్నెండేళ్ల క్రితం ఓ సినిమా కూడా వచ్చింది. అయితే 30లు దాటుకుని, 40లో పడినా పెళ్లి ఊసెత్తకుంటున్న ప్రభాస్‌ను దృష్టిలో ఉంచుకుని.. పెళ్లికాని ప్రసాద్ స్థానంలో పెళ్లి కాని ప్రభాస్ అనే మాట గత కొన్నేళ్లుగా ప్రజానీకంలో ఫిక్సయిపోయింది. ప్రభాస్ పెళ్లి చేసుకునేంతవరకు ఈ వాడుక అలానే ఉంటుంది!!









మరో ఏడాది కాలగర్భంలో కలిసిపోయింది. కానీ మన టాలీవుడ్‌లో పెళ్లికాని హీరోల సంఖ్య మాత్రం పెరుగుతోందే తప్ప తగ్గడం లేదు. నాగచైతన్య మాత్రమే పెళ్లి చేసుకున్నాడు. మిగతా వాళ్లంతా.. నాకా పెళ్లా అన్నట్లుగానే ఉన్నారింకా. ఇక జాబితాలో రామ్ పోతినేని కూడా చేరాడు ముప్పయేళ్లు పూర్తయినా పెళ్లి కాని వారి గురించి తాజాగా మరోసారి మచ్చటించుకుందా.

మల్లీశ్వరి సినిమా తర్వాత నుంచి పెళ్లి కాని ప్రసాద్ అనే మాట ముదర బెండకాయ అనే వాడుకకు పర్యాయపదంగా మారిపోయింది. పెళ్లి కాని ప్రసాద్ పేరుతో పది పన్నెండేళ్ల క్రితం ఓ సినిమా కూడా వచ్చింది. అయితే 30లు దాటుకుని, 40లో పడినా పెళ్లి ఊసెత్తకుంటున్న ప్రభాస్‌ను దృష్టిలో ఉంచుకుని.. పెళ్లికాని ప్రసాద్ స్థానంలో పెళ్లి కాని ప్రభాస్ అనే మాట గత కొన్నేళ్లుగా ప్రజానీకంలో ఫిక్సయిపోయింది. ప్రభాస్ పెళ్లి చేసుకునేంతవరకు ఈ వాడుక అలానే ఉంటుంది.

1979లో పుట్టిన ప్రభాస్ పెళ్లి చేయాలని వాళ్ల పెదనాన్నతోపాటు, ఆయన ఫ్యామిలీ మెంబర్స్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

బాహుబలి అయ్యాక తప్పక చేసుకుంటానని నమ్మించి, ఆశ పెట్టిన ప్రభాస్.. ఇప్పటికీ బ్యాచిలర్‌గానే ఉన్నాడు. తనతో వరుసగా మూడు సినిమాల్లో నటించిన ఓ ప్రముఖ కథానాయకితో ప్రభాస్‌కి పెళ్లి అయిపోయిందనే రూమర్స్ అయితే చలామణిలో ఉన్నాయి కానీ, వాటిని ప్రభాస్ ఎప్పటికప్పుడు గట్టిగా ఖండిస్తూనే ఉన్నాడు. మరి ఈ బాహుబలి ఈ ఏడాదయినా పెళ్లి చేసుకుంటాడో లేదో చూడాలి.

ప్రభాస్ వయసుతో పోల్చితే ఆయిదారేళ్లు చిన్నోడయిన రానా (1984) కూడా ఇప్పట్లో పెళ్లి చేసుకునే ఆలోచనలో ఉన్నట్లు కనబడడం లేదు. ఆమధ్య కొన్ని రోజులు తీవ్ర ఆరోగ్య సమస్యలను ఎదుర్కొని, చాలా ధైర్యంగా వాటి నుంచి బయటపడి.. ఒకవైపు టీవీ షోస్ మరోవైపు తెలుగు, తమిళ, మలయాళ, హిందీ సినిమాలతో బిజీగా ఉన్నాడు.

రానా కంటే ఏడాది పెద్దోడయిన నితిన్ (1983) పెళ్లి కోసం వాళ్లింట్లో పెద్దలు చాలా గట్టిగా పట్టుబడుతున్నా.. ఆ విషయమై నితిన్ దృష్టి పెడుతున్నట్లు కనిపించడం లేదు. పైగా కెరీర్‌పరంగా మళ్లీ తలెత్తిన ఇబ్బందును అధిగమించేందుకు కృషి చేస్తున్న నితిన్, హీరోగా మళ్లీ పూర్వ వైభవం వచ్చేవరకు పెళ్లి గురించి ఆలోచించే అవకాశం లేదని అతని సన్నిహితులు చెబుతున్నారు.

ఇక రానా కంటే ఒక ఏడాది చిన్నోడయిన శర్వానంద్ (1985) హీరోగా తనకంటూ ప్రత్యేకమైన స్థానం సంపాదించుకున్నా.. ఇప్పట్లో ఒక ఇంటివాడయ్యే ఆలోచనలు చేస్తున్నట్లు కనబడడం లేదు. ఎక్స్‌ప్రెస్ రాజా, రన్ రాజా రన్, శతమానం భవతి చిత్రాలతో సోలిడ్ హిట్ కొట్టినప్పటికీ.. కెరీర్‌పై పెడుతున్న శ్రద్ధ పెళ్లిపై పెట్టడం లేదు.

ఇక వికీ పీడియాలో తన వయసును ప్రకటించుకోవడానికి కూడా ఇబ్బంది పడుతున్న నిఖిల్ హీరోగా తెరంగేట్రం చేసి పుష్కరకాలం దాటిపోయింది. ఆమధ్య వరుసగా రెండు మూడు మంచి హిట్లు కూడా పడ్డాయి. అయినా సరే ఇప్పట్లో పెళ్లి చేసుకోవడానికి ఈ హీరో కూడా అంతగా ఆసక్తి చూపడం లేదు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి తమ్ముడి తనయుడిగా రంగప్రవేశం చేసిన నారా రోహిత్ హీరోగా ఇప్పటికీ స్ట్రగుల్ అవుతూనే ఉన్నాడు. ఈయన కూడా పెళ్లి పట్ల పెద్దగా ఆసక్తి చూపుతున్న దాఖలాలు కనిపించడం లేదు.

పెళ్లి కాని ప్రభాస్‌ల క్లబ్‌లో కొత్తగా చేరిన రామ్ ఇటీవలే 30 దాటాడు. ఇతని కెరీర్ కూడా గత కొన్ని సినిమాలుగా కొంత నిరాశాజనకంగానే ఉంది. కాబట్టి.. ఈ ఎనర్జటిక్ హీరోగా ఇప్పట్లో పెళ్లి చేసుకునేలా లేడు!!







పదేళ్ల తరువాత మళ్లీ



లెజండరీ సింగర్ కె.జె.ఏసుదాస్ చాలా కాలం తర్వాత హైదరాబాద్‌లో లైవ్ కాన్సర్ట్ చేస్తున్న విషయం తెలిసిందే. జనవరి 20న హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో ఈ కాన్సర్ట్ జరగనుంది. ఈ సంగీత విభావరిలో ఏసుదాస్‌తోపాటు విజయ్ ఏసుదాస్, కల్పన కూడా పాల్గొంటారు. ఈ నేపథ్యంలో జనవరి 19న కె.జె.ఏసుదాస్, ఆయన తనయుడు విజయ్ ఏసుదాస్ విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కె.జె.ఏసుదాస్ మాట్లాడుతూ.. నేను దాదాపు 10 సంవత్సరాల తర్వాత హైదరాబాద్‌లో లైవ్ మ్యూజిక్ చేస్తున్నాను. మధ్యలో కొన్ని క్లాసికల్ కాన్సర్ట్లు చేసినప్పటికీ లైవ్ మ్యూజిక్ మాత్రం చాలా కాలం తర్వాత చేస్తున్నాను. నా బ్రదర్ అలేఖ్య హోమ్స్ శ్రీనాథ్ నన్ను లైవ్ మ్యూజిక్ చెయ్యమని చెప్పారు. ఈ కాన్సర్ట్‌లో ప్రధానంగా తెలుగు పాటలు పాడతాము. అలాగే కొన్ని తమిళ్, హిందీ, మలయాళం పాటలు ఉంటాయి. ఇప్పుడొస్తున్న సింగర్స్ చాలా మంది బాగా పాడుతున్నారు. ఇప్పుడు సౌకర్యాలు బాగా పెరిగాయి. ఆరోజుల్లో నేను, సుశీల డ్యూయట్ పాడితే ఒకే మైక్‌లో ఒకరి తర్వాత ఒకరం పాడేవాళ్లం. కానీ, ఇప్పుడలా కాదు. డిఫరెంట్ ట్రాక్స్ వచ్చేసాయి. నిన్న నేను ఓ మలయాళం పాట పాడాను. నాతో పాట పాడే అమ్మాయిని నేను చూడలేదు కూడా. నా ట్రాక్ వరకు నేను పాడాను. తర్వాత ఆమె పాడిన ట్రాక్‌ని మిక్స్ చేస్తారు.. అన్నారు.

విజయ్ ఏసుదాస్ మాట్లాడుతూ.. మొదట్లో నేను నాన్నగారి అడుగుజాడల్లోనే వెళ్ళాను. ఆ తర్వాత నేను రియలైజ్ అయ్యాను. ఎందుకంటే అవి ఆయన వేసుకున్న ఫుట్‌స్టెప్స్. అందుకే నా సొంతదారిలోనే వెళ్ళాలని డిసైడ్ అయ్యాను. నాన్నగారు ఈ వయసులో కూడా ఇంకా నేర్చుకుంటున్నానని చెప్పడం మా జనరేషన్‌కి టెన్షన్ కలిగిస్తుంది. నేను రెండు సినిమాల్లో నటించాను కూడా. అయితే నేను నటుడ్ని కాదు. కెమెరా ముందు ఉండడం, యాక్ట్ చేయడం నేను చాలా ఎంజాయ్ చేశాను. ఇప్పుడు బయోపిక్‌లు చాలా వస్తున్నాయి. అలాగే నాన్నగారి బయోపిక్ చేసే ఆలోచన ఉందా అని అడుగుతున్నారు. అయితే నాకు అలాంటి ప్లాన్స్ ఏమీ లేవు. కానీ, ఎవరైనా చేస్తే నేను ఇన్‌వాల్వ్ అవ్వాలనుకుంటున్నాను.. అన్నారు!!

గేమర్ ట్రయిలర్ రిలీజ్



బి.జి.వెంచర్స్ పతాకంపై నూతన నటీనటులతో రాజేష్ తడకల స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గేమర్'. శ్రనిత్ రాజ్, కల్యాణి పటేల్, అనిరుధ్, నేహా ప్రధాన పాత్రలు పోషించారు. ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వివేక్ వెంకటస్వామి ట్రైలర్‌ను ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. 'ట్రైలర్ చూశాను. అద్భుతంగా ఉంది. తడకల రాజేష్ నూతన నటీనటులను ప్రోత్సహిస్తూ ఈ సినిమా తీశారు. మంచి డాన్సెస్, ఎంటర్టైన్మెంట్, సస్పెన్స్, హారర్ ఎలిమెంట్స్ అన్నింటితో ప్రేక్షకులకు నచ్చేలా ఈ సినిమా చేశాడు రాజేష్. ఇలాంటి చిన్న సినిమాల దర్శక, నిర్మాతలను ప్రోత్సహించే భాద్యత ప్రభుత్వం పైనా, సమాజం పైనా ఉంది... అన్నారు.

హీరో శ్రనీత్ మాట్లాడుతూ.. ట్రైలర్ విడుదల చేసిన వివేక్‌గారికి థాంక్స్. నా తల్లిదండ్రుల వల్లే ఈ స్థాయికి చేరుకున్నాను. నాకు మెయిన్ క్యారెక్టర్ ఇచ్చిన డైరెక్టర్ గారికి థాంక్స్. ఎంతో క్లారిటీ ఉన్న దర్శకుడు ఆయన. సినిమా టీమ్ అంతా ఈ సినిమా కోసం హార్డ్ వర్క్ చేశారు. అందరికి థాంక్స్. అన్నారు.

దర్శక, నిర్మాత రాజేష్ మాట్లాడుతూ.. ఎంతో బిజీగా ఉండి కూడా చిన్న సినిమాను ఎంకరేజ్ చేయడం కోసం మా సినిమా ట్రైలర్‌ను ఆవిష్కరించిన వివేక్ అన్నకు ధన్యవాదాలు. ఇప్పటికే ఆరు చిత్రాలు చేసిన నాకిది ఏడవ సినిమా. బి.జి.యాక్టింగ్ అకాడమీ ద్వారా నటీనటులకు శిక్షణ ఇవ్వడంతో పాటు వారికి అవకాశం ఇస్తున్నాను. ఈ సినిమాతో పరిచయం అవుతోన్న శ్రనీత్ రాజ్ పెర్ఫామెన్స్ బాగుంది. చాలా కష్టపడ్డాడు. ప్రతీ సీన్ డిఫరెంట్‌గా ఉంటూ ఆసక్తి రేవుతుంది. ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారని నమ్ముతున్నాను. సెన్సార్ కార్యక్రమాలు కూడా పూర్తయిన ఈ సినిమాను ఫిబ్రవరి 1న విడుదల చేయబోతున్నాం.. అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో హీరోయిన్ కల్యాణి, అనిరుద్, నరేందర్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు!!

గత ఏడాదిగా ఘనమైన విజయాలు



క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా వైవిధ్యమైన పాత్రలను పోషిస్తూ నటుడిగా తనకంటూ ఓ ప్రత్యేకతను సంపాదించుకున్న నరేష్ విజయ్‌కృష్ణ పుట్టినరోజు జనవరి 20. పుట్టినరోజు సందర్భంగా పాత్రికేయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...

– ఒక నటుడి కెరీర్‌లో సక్సెస్.. ఫెయిల్యూర్స్ కామన్. ఐదారేళ్ల క్రితం మంచి హిట్ రాదా? అని అనుకున్న రోజులు కూడా ఉన్నాయి. అయితే నాలుగైదేళ్లుగా దృశ్యం సినిమా నుండి వరుసగా మంచి సినిమాలు వస్తున్నాయి. మంచి సినిమాలు, పాత్రలకు ప్రాధాన్యం ఇచ్చి సినిమాలు చేసుకుంటూ వస్తున్నాను. సక్సెస్ రేట్ పెరుగుతూ వస్తుంది.

– క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా వచ్చినప్పుడు ఎస్.వి.రంగరావుగారికి దృష్టిలో పెట్టుకున్నాను. ఓ నటుడు ఒకే జోనర్‌కే పరిమితం కాకుండా అన్నీ సినిమాలు చేయాలనుకున్నాను. నాకు వచ్చిన పాత్రలన్నీ అలా డిఫరెంట్‌గానే వచ్చాయి. గత ఏడాది 10–12 హిట్ చిత్రాల్లో 8 చిత్రాల్లో నేను నటించాను. నాపై దర్శకులు, నిర్మాతలు పెట్టుకున్న నమ్మకం. శతమానం భవతి, రంగస్థలం, మహానటి, దేవదాస్, తొలిప్రేమ ఇలా మంచి మంచి సినిమాల్లో మంచి పాత్రల్లో నటించాను. సమ్మోహనం నాకు చాలా మంచి పేరు తెచ్చింది. అలాగే అరవింద సమేత వంటి సీరియస్ చిత్రంలో కామెడీ పార్ట్ నా పాత్రనే క్యారీ చేసింది. అలాగే శైలజారెడ్డి అల్లుడులో మంచి పాత్ర చేశాను. 2018 నటుడిగా నా కెరీర్‌లో బెస్ట్ ఇయర్. త్రివిక్రమ్, సుకుమార్ వంటి దర్శకులతో పాటు వెంకీ అట్లూరి, వెంకీ కుడుముల, నాగఅశ్విన్ .. వంటి యువ దర్శకులు కూడా నాకు మంచి ప్రాధాన్యమున్న పాత్రలను ఇచ్చారు.

– 47 ఏళ్లు నటుడిగా అనుభవం వచ్చింది. క్రమశిక్షణతో పాటు, ఎటువంటి కాంట్రవర్సీకి పోకపోవడం అనేవి నటుడిగా నా సక్సెస్‌కు కారణమని భావిస్తున్నాను. పారితోషకం, ఇతర అంశాల కంటే మంచి సినిమా, మంచి పాత్ర పోషించడం.. వచ్చిన అవకాశానికి పూర్తి న్యాయం చేయడం, చిన్న బడ్జెట్ సినిమాలకు అందుబాటులో ఉంటానని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

– వెబ్ సిరీస్‌ల్లో కూడా నాకు మంచి అవకాశాలు వస్తున్నాయి. మంచి వెబ్ సిరీస్ ఎంచుకుని అందులో నటిస్తానని తెలియజేస్తున్నాను. కొంచెం సెలక్టివ్‌గా మంచి పాత్రలను ఎంచుకుంటున్నాను. ఈ ఏడాది కూడా మంచి పాత్రలతోనే స్టార్ట్ అయ్యింది. మల్లి జంధ్యాల దర్శకత్వంలో కార్తికేయ హీరోగా చేస్తున్న సినిమాలో నటిస్తున్నాను. అలాగే ఫణిరాజ్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాను. వీటితో పాటు మరో ఆరు సినిమాలు పైప్‌లైన్‌లో ఉన్నాయి.

– ఒకప్పుడు మనం ఇతర భాషల రీమేక్‌ల కోసం వెళ్లేవాళ్లం. కానీ ఇప్పుడు ఇతర భాషల వాళ్లు మన రీమేక్‌ల కోసం వస్తున్నారు. ఇది తెలుగు సినిమాకు పెద్ద వరం. ఎందుకంటే కొత్త ఆలోచనలున్న కొత్త తరం దర్శకులు చాలా మంది ఇండస్ట్రీలోకి వస్తున్నారు. 2019 కూడా తెలుగు ఇండస్ట్రీకి చాలా బావుంటుంది!!




అవినీతి నేతలంతా ఏకమయ్యారు: బాబుల్ సుప్రియో

కోల్‌కతా: అవినీతి నేతలంతా ఏకమయ్యారని కేంద్ర మంత్రి, బీజేపీ నేత బాబుల్ సుప్రియో ఐక్యతా ర్యాలీపై విమర్శలు చేశారు. అంతా ఒకచోట చేరి కపట బుద్ధిని ప్రదర్శిస్తున్నారని అన్నారు. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలో ఈరోజు కోల్‌కతాలో యునైటెడ్ ఇండియా ర్యాలీ పేరుతో భారీ ర్యాలీ జరిగింది. బీజేపీకి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా వివిధ పార్టీల నేతలు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. దాదాపు 20 మంది ముఖ్య నేతలు ఒకే వేదికపై వచ్చారు. ఈ నేపథ్యంలో బీజేపీ ఈ ర్యాలీపై విమర్శలు గుప్పిస్తోంది. ర్యాలీలకు పిలువనివ్వడానికి బదులుగా వాళ్లు భారత దేశాన్ని మరింత ఉత్తమంగా తయారు చేయడానికి పిలువవిల్సింది అని సుప్రియో ట్వీట్ చేశారు. ట్రాఫిక్‌ను స్తంభింపజేసి, సాధారణ ప్రజలను తృణమూల్ పార్టీ ఇబ్బందులు పెడుతోందని.. దానికి బదులుగా దేశం కోసం కొన్ని అర్థవంతమైన నిర్ణయాలు తీసుకుంటే బాగుండేదని అన్నారు. పార్టీలు స్వప్రయోజనాల కోసం కలుస్తున్నాయని, ఇది అపవిత్రమైన పొత్తు అని సుప్రియో ట్వీట్‌లో పేర్కొన్నారు. భాజపా రథ యాత్ర విషయంలోనూ ఇటీవల బాబుల్ సుప్రియోకు, మమత ప్రభుత్వానికి మధ్య మాటల యుద్ధం జరిగింది. యునైటెడ్ ఇండియా ర్యాలీలో కాంగ్రెస్ నేత మల్లికార్జునఖర్గే, మాజీ ప్రధాని దేవెగౌడ, కర్ణాటక సీఎం కుమారస్వామి, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, ఎన్సీ అధినేత ఫరూక్ అబ్దుల్లా, శరద్ యాదవ్, అఖిలేశ్ యాదవ్ పాల్గొన్నారు.

మోడీ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయి: మమత

- వ్యవసాయరంగంలో సంక్షోభం పెరుగుతోంది: సోనియా
- సోనియా సందేశాన్ని చదివి వినిపించిన ఖర్గే
- మోడీ పతనానికి నాంది పడింది: చంద్రబాబు
- అజెండా సిద్ధం చేసుకోవాలి: జేడీ (ఎస్) అధినేత దేవెగౌడ
- కూటమి ద్వారా దేశానికి కొత్త పాలన: శరద్ పవార్





కోల్‌కతా: దేశ ప్రజలు కోరుకున్నందునే విపక్షాలంతా ఒకటయ్యాయని టీఎంసీ అధినేత్రి, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. సమష్టి నాయకత్వం ప్రస్తుత తరుణంలో దేశానికి అవసరమని అన్నారు. విపక్షాల ఐక్యతను చూసి మోడీ ప్రభుత్వం బెంబేలెత్తుతోందని, కేంద్ర సర్కార్ ఇక రోజులు లెక్కపెట్టుకోవల్సిన సమయం వచ్చిందని మమత గర్జించారు. టీఎంసీ సారథ్యంలో బ్రిగేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ర్యాలీలో మమత మాట్లాడుతూ, చారిత్రక అనివార్యత దృష్ట్యా కోల్‌కతాలో తామంతా సమావేశమయ్యామని అన్నారు. విపక్ష నేత ఎవరని మీరడుగుతున్నారు. వేదికపై చాలామంది నేతలు ఉన్నారు. మీకు కనిపించడం లేదా? మీ పార్టీలా కాదు...మాకు చాలా మంది నేతలు ఉన్నారు అంటూ బీజేపీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. కూటమిలో ప్రతి ఒక్కరూ కింగ్‌లేనని అన్నారు. మోడీ ప్రభుత్వంలో 'అచ్ఛేదిన్' ఎండమావే అయిందన్నారు. మంచిరోజులు ఎక్కడొచ్చాయని ప్రశ్నించారు. పశ్చిమబెంగాల్‌లో బీజేపీ ఆటలు సాగనివ్వమని స్పష్టం చేశారు. బీజేపీకి విపక్ష నేతలంటే గౌరవం లేదని, బీజేపీ విభజన రాజకీయాలను దేశ ప్రజలు ఏమాత్రం నమ్మరని అన్నారు. బీజేపీ అనుసరిస్తున్న మతత్వ విధానాలతోనే ఆ పార్టీ ఓటమి చవిచూడక తప్పదని జోస్యం చెప్పారు. బీజేపీకి పశ్చిమబెంగాల్‌లో రెండు సీట్లు ఉన్నాయని, ఆ రెండూ కూడా త్వరలోనే ఆ పార్టీ కోల్పోనుందని మమత అన్నారు. రాబోయే ఎన్నికల్లో టీఎంసీ ఎలాంటి ర్యాలీలు తీస్తుందో వేచిచూడాలని సవాలు చేశారు. హార్దిక్ పటేల్, జిగ్నేష్‌లు తమ పోరాటం సాగించాలన్నారు. మహాకూటమి తరఫున తదుపరి ప్రధాని ఎవరనేది పెద్ద విషయం కాదని మమత అన్నారు. బీజేపీని సాగనంపడమే తన అభిమతమని అన్నారు. ర్యాలీలో చివరగా 'బీజేపీ హఠావ్' అంటూ మమత నినాదాలు చేస్తూ కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. 'వందేమాతరం' నినాదంతో ప్రసంగాన్ని ముగించారు. కోల్‌కతాలో నిర్వహించిన సభలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మల్లికార్జున ఖర్గే సోనియా గాంధీ పంపిన సందేశాన్ని చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేశంలో వ్యవసాయరంగంలో సంక్షోభం పెరుగుతుందని, యువత, నిరుద్యోగుల్లో నిస్పృహ నెలకొందని, ఆర్థికంగా దేశప్రజలు చితికి పోయారని అన్నారు. సమాజంలో విద్వేషపూరిత భయానక వాతావరణం పెరుగుతుందని, లౌకిక స్ఫూర్తిని కాపాడుకుంటూ మతతత్వ శక్తులను తరిమికొట్టాల్సిన సమయమిదని, కాంగ్రెస్ తరఫున దేశ ప్రజలందరికీ ఇదే సందేశమని సోనియాగాంధీ చెప్పారని అన్నారు. ప్రజల జీవితాలు అస్తవ్యస్తంగా మారాయని, అవేవీ పట్టని మోడీ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావాలని ఎలా ఆలోచిస్తుందని ప్రశ్నించారు. దేశ ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు విపక్షాలన్నీ కలిసి పోరాడాల్సి ఉందని, లక్ష్యం చాలా కఠినమైనదే కావచ్చు కానీ, చేయి చేయి కలిపి సాగుదామంటూ పిలుపు నిచ్చిన సోనియా సందేశాన్ని ఖర్గే చదివి వినిపించారు. మోడీ పతనానికి కోల్‌కతాయునైటెడ్ ఇండియా బ్రిగేడ్‌సభ నాంది అన్నారు టీడీపీ అధినేత, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. 2019లో దేశ ప్రజలు కొత్త ప్రధానిని చూడబోతున్నారని జోస్యం చెప్పారు. శనివారం కోల్‌కతాలో ఏర్పాటు చేసిన యునైటెడ్ ఇండియా బ్రిగేడ్‌సభలో చంద్రబాబు ప్రసంగించారు. బెంగాల్‌లో తన ప్రసంగాన్ని ప్రారంభించి ఆకట్టుకున్నారు. విపక్షాల ఐక్యత కోసం ఇలాంటి గొప్ప సమావేశం ఏర్పాటు చేసిన మమతా బెనర్జీని చంద్రబాబు అభినందించారు. దేశ ప్రజల్ని బీజేపీ మోసం చేసింది.. అబద్ధపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చింది. బీజేపీ విభజించి





పాలించు విధానాన్ని అవలంభిస్తూ.. దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తోంది. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ.. ఆర్బీఐ, సీబీఐ, ఈడీ వంటి సంస్థల్ని కేంద్రం భ్రష్టు పట్టించింది. అలాగే రాఫెల్ డీల్ పెద్ద అవినీతి స్కాం.. రాఫెల్‌పై సుప్రీం కోర్టుకు తప్పుడు అఫిడవిట్ ఇవ్వడం విడ్డూరం. నోట్ల రద్దుతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.. గత నాలుగేళ్లలో ఆర్థిక అభివృద్ధి మందగించింది. దేశంలో పెట్రోల్ రేట్లు భగ్గుమంటున్నాయి. ధరల పెరుగుదలను నియంత్రించడంలో మోడీ ప్రభుత్వం విఫలమైంది. నాలుగేళ్ల పాలనలో రైతులు మోసపోయారు.. రైతుల కష్టాలు బీజేపీకి పట్టవు. ఇక రాష్ట్రాల హక్కులను కేంద్రం కాలరాస్తోంది. కర్ణాటకలోనూ ఎన్నికైన ప్రభుత్వాన్ని కూల్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్రాలను దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తే కేంద్రం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది అని హెచ్చరించారు. దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది.. అది మన బాధ్యత. స్వాతంత్ర్య సంగ్రామానికి పశ్చిమబెంగాల్ దశా-దిశ చూపించింది.. అదే స్ఫూర్తితో ప్రతిపక్షాలను ఏకం చేయాలనుకుంటున్నాం. మా అందరి నినాదం ఒక్కటే సేవ్ ఇండియా.. సేవ్ డెమొక్రసీ.. 2019లో దేశ ప్రజలు కొత్త ప్రధానిని చూడబోతున్నారు. భవిష్య కార్యాచరణ ఎలా అన్నదే మనందరి ముందున్న ప్రధానమైన ప్రశ్న అని జేడీ(ఎస్) అధినేత దేవెగౌడ అన్నారు. కోల్ కతాలో బీజేపీ యేతర పక్షాల ర్యాలీ అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ, త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని, అప్పటికే మనం అన్ని విధాలుగా సిద్ధంగా ఉండాలని, కూటమి విధివిధానాల అజెండా సిద్ధం చేసుకోవాలని సూచించారు. మన మధ్య విభేదాలు, అంతరాలను పక్కనబెట్టి పని చేస్తే తప్ప ఫలితం ఉండదని, మాయావతితో పొత్తు ప్రకటించిన మరుసటి రోజే అఖిలేష్ యాదవ్ పై కక్ష సాధింపు చర్యలు మొదలుపెట్టారని, దర్యాప్తు సంస్థలను అడ్డం పెట్టుకుని భయానక వాతావరణం సృష్టించాలనుకుంటున్నారని కేంద్రంపై విమర్శలు చేశారు. మనం సరైన మార్గంలో సాగితే ప్రజలందరూ మన వెంటే వస్తారని, రెండు, మూడు పార్టీలుండే రాష్ట్రాల్లో సీట్ల పంపకం ఆషామాషీ వ్యవహారం కాదని, బలమైన భారతావనిని నిర్మించేందుకు సుస్థిర ప్రభుత్వం అవసరమా అనే ప్రశ్నను మోడీ రేకెత్తించారని, గడచిన నాలుగున్నరేళ్లలో మోడీ సాధించింది అది ఒక్కటే అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. సంకీర్ణ ప్రభుత్వంలో ఎలాంటి లుకలుకలు లేకుండా విశ్వాసం కల్గించాలని, ప్రజలకు నమ్మకం కల్గించగల్గితే మార్పును స్వాగతించేందుకు వాళ్లు సిద్ధంగా ఉంటారని దేవెగౌడ అభిప్రాయపడ్డారు. 1996-97లో వ్యవసాయం రంగంలో 9.8 శాతం వృద్ధిరేటు ఉండేదని, సంకీర్ణ ప్రభుత్వంలోనే వ్యవసాయం రంగంలో 9.8 శాతం వృద్ధి సాధించిన విషయాన్ని ఈ సందర్భంగా దేవెగౌడ గుర్తుచేశారు. సంకీర్ణ ప్రభుత్వం, అస్థిర ప్రభుత్వం ఏమీ చేయలేదని మోడీ చెబుతున్నారని, సంకీర్ణ ప్రభుత్వం వృద్ధి సాధించి చూపగలదని నిరూపించాలని పిలువు నిచ్చారు. ఎన్నికలకు రెండు నెలల సమయం మాత్రమే మిగిలి ఉందని, జాతీయ స్థాయిలో నేతలు సమస్యకు పరిష్కారం చూపగలగాలని దేవెగౌడ సూచించారు. ఐదేళ్లుగా ఈ దేశ ప్రజలను మోడీ ప్రభుత్వం మోసం చేస్తూనే ఉందని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) అధినేత శరద్ పవార్ ఆరోపించారు. కోల్ కతాలో బీజేపీ యేతర పక్షాల ర్యాలీ అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ, ఈ దేశ మహోన్నత రాజ్యాంగంపైనా దాడి జరుగుతోందని, రా జ్యాంగ వ్యవస్థలపై మోడీ ప్రభుత్వ దాడిని యావత్తు దేశం చూస్తోందని అన్నారు. కోట్ల మందికి అన్నం పెట్టే రైతన్న ఇవాళ ఆత్మహత్య చేసుకునే దుస్థితి ఏర్పడిందని, ఏ పదవులను ఆశించీ తాము ఇక్కడకు రాలేదని, దేశంలో మార్పు సాధించడమే లక్ష్యంగా ఈ సమావేశం జరుగుతోందని అన్నారు. ఈ కూటమి ద్వారా దేశానికి కొత్త పాలన అందిస్తామని హామీ ఇచ్చారు.




కన్నయ్యకుమార్‌పై చార్జిషీట్ తిరస్కరణ




న్యూఢిల్లీ: ఢిల్లీ ప్రభుత్వ ఆమోదం లేకుండానే జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ విద్యార్థి సంఘం మాజీ నాయకుడు కన్నయ్యకుమార్‌పై ఛార్జిషీట్ దాఖలు చేయడంపై ఢిల్లీ కోర్టు పోలీసులను తప్పుపట్టింది. న్యాయశాఖ విభాగం నుంచి మీరు ఎలాంటి ఆమోదం పొందలేదు. అలా ఎందుకు ఛార్జిషీట్ దాఖలు చేశారని పోలీసులను న్యాయస్థానం ప్రశ్నించింది. దీనిపై ఢిల్లీ పోలీసులు బదులిస్తూ మరో 10రోజుల్లో ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకుంటామని పేర్కొన్నారు. కన్నయ్య కుమార్ 2016 ఫిబ్రవరిలో జేఎన్‌యూలో దేశ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడ్డారంటూ ఢిల్లీ పోలీసులు సోమవారం 1,200 పేజీలతో కూడిన ఛార్జిషీట్‌ను దాఖలు చేశారు. ఇందులో ఉమర్ ఖలీద్, అనిర్బన్ భట్టాచార్య, జమ్ము, కశ్మీర్‌కు చెందిన ఆక్యుబ్ హుస్సేన్, ముజీబ్ హుస్సేన్, మునీబ్ హుస్సేన్, ఉమర్ గుల్, రాయీా రసూల్, బషీర్ భట్, బషరత్‌ల పేర్లు ఈ ఛార్జిషీట్‌లో పొందుపరిచారు. పార్లమెంట్‌పై దాడి చేసిన కేసులో అఫ్జల్‌గురుకు విధించిన ఉరిశిక్షను వ్యతిరేకిస్తూ కళాశాల ప్రాంగణంలో కార్యక్రమాలు చేపట్టారనేది వీరిపై ఉన్న ప్రధాన అభియోగం. గతంలో పోలీసులు వారిని అదుపులోకి తీసుకోవడంతో తీవ్ర రాజకీయ దుమారం రేగింది. అధికార భాజపాకు అనుకూలంగా పోలీసులు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తాయి. ఈ ఛార్జిషీట్ విషయమై కన్నయ్యకుమార్ మాట్లాడుతూ.. రాజకీయ దురుద్దేశంతోనే తనపై కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. మూడేళ్ల తర్వాత ఛార్జిషీట్ దాఖలు చేసిన పోలీసులకు కచ్చితంగా ధన్యవాదాలు తెలపాల్సిందేనని వ్యంగ్యంగా అన్నారు. సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ఇలాంటివి తెరమీదకు తెస్తున్నారని, దేశ న్యాయవ్యవస్థపై తనకు పూర్తి నమ్మకముందని చెప్పారు. ఉమర్ ఖలీద్.. తనపై వచ్చిన ఆరోపణలపై స్పందించడానికి నిరాకరిస్తూనే తప్పులను కప్పిపుచ్చుకోవడాకే ఎన్నికల ఏడాదిలో ప్రభుత్వం ఇలాంటి ఎత్తుగడ వేస్తోందని ఆరోపించారు. తాము ఎలాంటి తప్పు చేయలేదని న్యాయస్థానంలో నిరూపించుకొంటామని ఖలీద్ ధీమా వ్యక్తం చేశారు.

శబరిమల దర్శనానికి ఇద్దరు మహిళల యత్నం




తిరువనంతపురం: ఇటీవల 50ఏళ్లలోపు వయసు గల ఇద్దరు మహిళలు మగవేషంలో వెళ్లి శబరిమల అయ్యప్ప ఆలయాన్ని దర్శించుకునేందుకు ప్రయత్నించిన విషయం తెలిసిందే. తాజాగా వారిద్దరూ మరోసారి ఆలయానికి వెళ్లేందుకు యత్నించారు. అయితే ఈ సారి కూడా భక్తులు అడ్డుకోవడంతో పోలీసులు ఆ మహిళలను వెనక్కి పంపించారు. శనివారం ఉదయం షానిలా సతీశ్, రేష్మా నిషాంత్ అనే ఇద్దరు మహిళలు శబరిమల ఆలయాన్ని దర్శించుకునేందుకు నీలక్కల్ బేస్ క్యాంప్‌కు చేరుకున్నారు. అయితే అక్కడ వీరిని ఆందోళనకారులు గుర్తించి అడ్డుకున్నారు. తమకు భద్రత కల్పించాలని వీరు పోలీసులను కోరారు. అయితే ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా ఇప్పుడు తాము భద్రత కల్పించలేమని వెల్లడించి ఆ మహిళలను పోలీసులు బలవంతంగా వెనక్కి పంపించారు. గత బుధవారం కూడా వీరిద్దరూ అయ్యప్పస్వామిని దర్శించుకునేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. షానిలా, రేష్మి మరో ఏడుగురు పురుషులతో కలిసి మగవేషంలో శబరిమలకు కాలినడకన బయల్దేరారు. అయితే నీలక్కల్ బేస్ క్యాంప్‌కు చేరుకోగానే వీరిని ఆందోళనకారులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు కల్పించుకుని వారిని తిరిగి పంబ పోలీస్ కంట్రోల్ రూంకు తీసుకొచ్చారు. ఇదిలా ఉండగా.. శబరిమల అయ్యప్పస్వామి ఆలయంలోకి మహిళల ప్రవేశంపై నిషేధాన్ని ఎత్తివేసిన తర్వాత ఇప్పటిదాకా 51 మంది స్త్రీలు వెళ్లినట్లు కేరళ ప్రభుత్వం సుప్రీం కోర్టుకు వెల్లడించింది. ఈ సమాచారం వివాదాలకు దారితీసింది.

ఏ రాజకీయ పార్టీలోనూ చేరను: ప్రకాశ్‌రాజ్



బెంగళూరు: ఏ రాజకీయ పార్టీతోనూ చేతులు కలపనని ప్రముఖ నటుడు ప్రకాశ్‌రాజ్ స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో బెంగళూరు సెంట్రల్ నియోజక వర్గం నుంచి పోటీ చేస్తానని ఆయన ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా ప్రకాశ్‌రాజ్ ఓ ఆంగ్లపత్రికతో మాట్లాడారు. స్వతంత్ర అభ్యర్థిగానే పోటీచేస్తానని, రాజకీయ పార్టీని స్థాపించే ఉద్దేశం లేదని చెప్పారు. ఒకవేళ ఏ రాజకీయ పార్టీలో చేరినా మూడు నెలల కంటే ఎక్కువ రోజులు ఉండలేనని అన్నారు. ప్రజల వ్యక్తిగా వారి సమస్యల్ని పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఎన్నికల సమయంలో ఏ పార్టీకి వ్యతిరేకంగా ఉండాలో తెలుసని, కానీ ఏ పార్టీకి మద్దతు ఇవ్వనని అన్నారు. బీజేపీ పార్టీ అనేది నీతిలేని వ్యక్తులతో కూడిన సమూహమని ప్రకాశ్ రాజ్ విమర్శించారు. వారు గోమాతను పూజిస్తామని చెప్పుకొంటారని, కానీ గోవుల్ని పూజిస్తూ జరుపుకొనే మకర సంక్రాంతి రోజున మాత్రం ఇళ్లల్లో ఉండకుండా క్యాంప్‌లకు పోతారని ఎద్దేవా చేశారు. బీజేపీ వ్యతిరేక పార్టీలు కూటమిగా ఏర్పడిన మహాగత్‌బంధన్ గురించి తనకు అవగాహన లేదని ఆయన చెప్పారు. బెంగళూరులో తన బాల్యం గడిచిందని, అందుకే అక్కడి నుంచి పోటీ చేయాలని నిర్ణయించుకున్నానని తెలిపారు. ప్రకాశ్ రాజ్ తన స్నేహితురాలు, పాత్రికేయురాలు గౌరీ లంకేష్ 2017 సెప్టెంబరు 5న హత్యకు గురైన తర్వాత నుంచీ రాజకీయాలపై అభిప్రాయాలు పంచుకోవడం ప్రారంభించారు. గౌరీ మృతి తర్వాత బీజేపీ నాయకులు ఆనందంతో సంబరాలు చేసుకున్నారని కూడా అన్నారు. అయితే ఈ ఘటన జరగడం వల్ల రాజకీయ నాయకులపై కోపం ఎక్కువైందా? అని మీడియా ఆయన్ను ప్రశ్నించగా.. నిజాయితీగా లేని వ్యక్తులపై కోపం ఉందని పేర్కొన్నారు.

10 శాతం కోటాపై కోర్టు మెట్లెక్కిన డీఎంకే



చెన్నై: ఆర్థికంగా బలహీనంగా ఉన్న వర్గాల వారికి 10శాతం రిజర్వేషన్లు కల్పించడం కోసం చేసిన రాజ్యాంగ సవరణను సవాలు చేస్తూ డీఎంకే పార్టీ మద్రాస్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. ఆ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్ఎస్ భారతీ ఆ పిటిషన్ దాఖలు చేశారు. 10శాతం కోటా కల్పించేలా కేంద్రం పార్లమెంటులో ప్రవేశ పెట్టిన 124వ రాజ్యాంగ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ డీఎంకే పార్టీ ప్రతికూలంగా ఓటువేసిన సంగతి తెలిసిందే.

ఆ బిల్లును పరిశీలన నిమిత్తం సెలెక్ట్ కమిటీ పంపించాలని ఆ పార్టీ ఎంపీ కనిమొళి డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు అందించేది సామాజిక వెనుకబాటు ఆధారంగా కానీ, ఆర్థిక స్థాయిని బట్టి కాదంటూ డీఎంకే చీఫ్ స్టాలిన్ ఆ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు వెల్లడించారు. అయితే అన్ని వర్గాల వారికి సమాన అవకాశాలు కల్పించాలన్న నిబద్ధతతో ఈ బిల్లును తీసుకువచ్చామని ప్రధాని నరేంద్ర మోడీ వెల్లడించారు. చాలావరకు అన్ని పార్టీలు బిల్లుకు మద్దతు తెలిపినా, కొన్ని చిన్న పార్టీలు మాత్రం రాజ్యాంగ విరుద్ధమంటూ బిల్లును వ్యతిరేకించాయి. ఆర్థికంగా వెనబడిన వర్గాల కోసం స్కిల్ ఇండియా, ముద్రా యోజన వంటి ఎన్నో పథకాలు తీసుకువచ్చారు. ఇప్పుడు మళ్లీ రిజర్వేషన్లు అందిస్తున్నారు. మీరు తీసువచ్చిన పథకాలు సరిగా అమలు కావట్లేదనేగా దీనర్థం అంటూ మరో తమిళ పార్టీ ఏఐఏడీఎంకే కేంద్రంపై విమర్శలు చేసింది.

మొదటి రెండేళ్లు ఏం చేశారు?



ముంబయి: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్న కేంద్ర ప్రభుత్వం మొదటి రెండేళ్లలోనే ఈ పనులన్నీ ఎందుకు చేయలేదని శివసేన పార్టీకి చెందిన పత్రిక సామ్నాలో సంపాదకీయంలో ప్రశ్నించింది. ఇటీవలి కాలంలో పలు విషయాల్లో భాజపాకు వ్యతిరేకంగా గళం విప్పుతున్న శివసేన.. ఆ దిశగా మరో అడుగు ముందుకు వేస్తూ కేంద్రంలోని, రాష్ట్రంలోని భాజపా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల్ని ప్రశ్నించింది. ఎన్నికల కోడ్ రాబోతుందని తెలిసే పరిపాలనలో కీలక మార్పులు చేస్తున్నారని, మొదటి యేడాదిగానీ, రెండో యేడాదిగానీ, అధికారంలోకి రాగానే ఈ పనులు ఎందుకు చేయలేదని ప్రశ్నించింది. ఇప్పుడు తీసుకుంటున్న నిర్ణయాలన్నింటినీ పలు కులాలు, సామాజిక వర్గాలు నిశితంగా గమనిస్తున్నాయని, వాటి ద్వారా లాభం కంటే వచ్చే ఎన్నికల్లో నష్టమే ఎక్కువగా ఉండొచ్చని అభిప్రాయపడింది. మహారాష్ట్ర ప్రభుత్వంలోని మంత్రివర్గం తాజాగా వివిధ సంక్షేమ పథకాలకు రూ.736కోట్లు కేటాయించడంపైనా అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇప్పుడు ప్రకటించిన రిజర్వేషన్లు అధికారంలోకి రాగానే ఇచ్చి ఉంటే ఆయా వర్గాలు ఇది వరకే లబ్ధి పొందేవని వ్యాఖ్యానించింది.

రిసార్టు నుంచి బీజేపీ ఎమ్మెల్యేలు తిరుగుముఖం



బెంగళూరు: కర్ణాటకలో ఆపరేషన్ కమలంలో భాగంగా కొన్నాళ్లుగా గురుగ్రాంలోని ప్రైవేట్ రిసార్ట్‌లో ఉంటున్న భాజపా ఎమ్మెల్యేలంతా బెంగళూరు చేరుకోబోతున్నారు. ఈ విషయమై ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు యడ్యూరప్ప మాట్లాడుతూ మా ఎమ్మెల్యేలందరినీ రాష్ట్రానికి తిరిగి రావాల్సిందిగా ఆదేశించాం అని మీడియాతో పేర్కొన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్, జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వాన్ని దెబ్బతీయాలనే ఆలోచన భాజపాకు లేదన్నారు. ప్రభుత్వాన్ని కూలదోసే ఉద్దేశం మాకులేదు.. బలమైన ప్రతిపక్షంగా మాత్రమే మేము పని చేసేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలను శుక్రవారం బెంగళూరు శివార్లలోని రిసార్టుల్లో ఉంచారు. మళ్లీ ఆపరేషన్ కమలం ప్రయత్నాలు వుంజుకుంటున్నాయనే వార్తలు రావడంతో తమ ఎమ్మెల్యేలు ప్రలోభాలకు గురికాకుండా పార్టీ ముఖ్యనేతలు ఈ జాగ్రత్తలు తీసుకొన్నారు. దీనిపై రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు దినేశ్ గుండు రావ్ మీడియాతో మాట్లాడుతూ భాజపా బహిరంగంగా గుర్రపుపందేల తరహాలో ఎమ్మెల్యేలతో బేరసారాలకు యత్నిస్తోంది. భాజపాను ఎదిరించేందుకే మా ఎమ్మెల్యేలతో సమావేశమయ్యామని చెప్పారు.

వాంతి చేసుకుందామని
కిటికీ నుంచి వంగింది అంతే.. తల తెగి పడింది!



పన్నా: బస్సు ప్రయాణం చాలా మందికి పడదు. దీంతో సహజంగానే వాంతులు అవుతుంటాయి. అలా వాంతి చేసుకుందామని బస్సు కిటికీ నుంచి బయటకు వంగిన మహిళ తల తెగిపడింది. ఈ దారుణ ఘటన మధ్యప్రదేశ్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్నా నుంచి పన్నా జిల్లాకు బస్సులో ఆశారాణి అనే మహిళ బయలుదేరింది. మార్గమధ్యంలో ఆమెకు కడుపులో తిప్పినట్టుగా అనిపించడంతో వాంతి చేసుకునేందుకు కిటికీ నుంచి బయటకు వంగింది. దీంతో ఆశారాణి తల విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఆ సమయంలో బస్సు వేగంగా ప్రయాణిస్తుండటంతో ఆమె తల తెగి పడింది. దీంతో బస్సులోని ప్రయాణికులంతా భయాందోళనకు గురయ్యారు. పోస్టు మార్టం అనంతరం మహిళ మృతదేహాన్ని పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. బస్సు డ్రైవర్‌ను అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు.

పెళ్లికి నో చెప్పిన మహిళ..
కోపంతో యాసిడ్ పోసిన యువకుడు



కన్యాకుమారి: తాను ప్రేమించిన మహిళ వివాహానికి ఒప్పుకోకపోవడంతో ఓ వ్యక్తి రాక్షసుడిగా మారాడు. ఆమె జీవితాన్ని నాశనం చేసేందుకు యాసిడ్ తో దాడిచేశాడు. చివరికి పోలీసుల భయంతో విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన తమిళనాడులోని కన్యాకుమారిలో చోటు చేసుకుంది. ఇక్కడి తిరువట్టార్ సమీపంలో ఓ మహిళ(36) తన ఇద్దరు మైనర్ పిల్లలతో కలిసి ఉంటోంది. భర్త చనిపోవడంతో ఆమె పనిచేసుకుంటూ ఇద్దరు చిన్నారులను పోషించుకుంటోంది. ఈ క్రమంలో అదే ప్రాంతానికి చెందిన జా న్‌రోస్ (30)తో ఆమెకు పరిచయం ఏర్పడింది. దీంతో పెళ్లి చేసుకుందామని ఆమెకు జాన్ చెప్పాడు. అయితే తనకు ఇద్దరు పిల్లలు ఉన్నారనీ, ఇప్పుడు వివాహం చేసుకోలేనని ఆమె తేల్చిచెప్పింది. దీంతో కోపంతో అక్కడి నుంచి వెళ్లిపోయిన జాన్ ఇంకోసారి సదరు మహిళ ఇంటికి వెళ్లి పెళ్లి ప్రతిపాదన తెచ్చాడు. ఇందుకు ఆమె నిరాకరించడంతో జాన్ రాక్షసుడిగా మారిపోయాడు. తన వెంట తెచ్చుకున్న యాసిడ్ ను ఆమెపై పోసి పరారయ్యాడు. దీంతో తీవ్రంగా గాయపడ్డ ఆమెను స్థానికులు, బంధువులు ఆచ్చారిపల్లం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి వాంగ్మూలం మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు జాన్ కోసం గాలింపును ముమ్మరం చేశారు.

కాశ్మీర్ వ్యవహారంలో పాక్ జోక్యం మానుకోవాలి



హైదరాబాద్:కశ్మీర్ వ్యవహారంపై ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ లోని హెచ్ఐసీసీలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో జరుగుతున్న అంతర్జాతీయ యువ నాయకత్వ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒవైసీ మాట్లాడుతూ, కశ్మీర్ వ్యవహారంలో పాకిస్థాన్ జోక్యం మానుకోవాలని, కశ్మీర్ ఎప్పుడూ భారత్ లో అంతర్భాగమేనని, అక్కడి ప్రజలు, యువత భారత ప్రజలేనని అన్నారు. తన ప్రసంగాలు విద్వేషపూరితంగా ఉన్నాయంటూ వచ్చే విమర్శలపై ఆయన స్పందిస్తూ, నలుగురినీ ఆలోచింప జేసేందుకే తాను ఆవిధంగా ప్రసంగిస్తానని సమర్థించుకున్నారు. ప్రభుత్వ నిర్ణయాలు, విధానాల్లో యువత ప్రాతినిధ్యం పెరిగితేనే అభివృద్ధి వేగవంతం అవుతుందని మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ తెలిపారు.

తన ప్రసంగాలు విద్వేషపూరితంగా ఉన్నాయంటే అవి నలుగురిలో ఆలోచనలు రేకెత్తించడానికే అని వ్యాఖ్యానించారు. తన దృష్టిలో మహాత్మా గాంధీ కంటే భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ గొప్పవారని పేర్కొన్నారు. హైదరాబాద్ లోని హెచ్ఐసీసీలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో జరుగుతున్న అంతర్జాతీయ యువ నాయకత్వ సదస్సులో ఈరోజు ఒవైసీ మాట్లాడారు. రాజకీయాల్లో యువత గణనీయంగా పెరగాలని ఒవైసీ అభిప్రాయపడ్డారు. అయితే జాతీయ పార్టీల్లో చేరితే యువత ఉన్నత స్థానాలకు ఎదగలేదని వ్యాఖ్యానించారు. యువత ప్రాతినిధ్యం పెంచేందుకు ఎమ్మెల్యేలు, పార్లమెంటు సభ్యులుగా పోటీచేసేందుకు కనీస వయసును 20 ఏళ్లకు తగ్గించాలని డిమాండ్ చేశారు. తనకు 49 సంవత్సరాల వయసు వచ్చినా ఇంకా తనను యువ నాయకుడిగానే గుర్తిస్తున్నారంటూ సభికుల్లో నవ్వులు పూయించారు.

సూర్య స్పోర్ట్స్

ధోని ఆలోచనల్ని అర్థం చేసుకోవాలి : జాదవ్

మెల్‌బోర్న్ : ఆస్ట్రేలియాతో శుక్రవారం జరిగిన నిర్ణయాత్మక మూడో వన్డేలో అద్భుతమైన ఆటతీరుతో టీమిండియా ఘన విజయం సాధించింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను 21తో గెలుచుకొని కోహ్లి బృందం సత్తా చాటింది. మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోని (87 నాటౌట్)తో పాటు చివరివరకు అజేయంగా నిలిచిన కేదార్ జాదవ్ (61 నాటౌట్) జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ధోనితో పాటు క్రీజులో ఉండడం చాలా సంతోషాన్నిచ్చిందని చహల్ టీవీకి ఇచ్చిన ఎక్స్‌క్లూజివ్ చాట్‌లో జాదవ్ చెప్పుకొచ్చాడు. ఆస్ట్రేలియాపై టెస్టు సిరీస్, ఆ వెంటనే వన్డే సిరీస్ గెలుపొందడం చాలా ఆనందంగా ఉందన్నాడు జాదవ్. వన్డే ప్రపంచకప్ టోర్నీ మరి కొద్ది రోజుల్లోనే ఉన్నందున ఈ విజయం జట్టు సభ్యులకు జోష్‌నిస్తుందని వ్యాఖ్యానించాడు. విన్నింగ్ జట్టులో సభ్యుడినైనందుకు మరింత ఉత్సాహానిచ్చిందన్నాడు. టీమిండియా విజయంలో జట్టు సభ్యులందరూ వారి శక్తిమేరకు కృషి చేశారని ప్రశంసించాడు. ఆస్ట్రేలియాలో ఇదే నా తొలి మ్యాచ్. మరొకవైపు సిరీస్‌లో చివరి మ్యాచ్ కావడంతో క్రీజులో ఎక్కువసేపు ఉండేందుకు నిశ్చయించుకున్నాను. స్ట్రయిక్ మెయింటేన్ చేస్తూ చివరి వరకూ క్రీజులో ఉంటే టార్గెట్ చేరుకుంటామని అనుకున్నట్లు చెప్పాడు.



అమ్మాయిల మ్యాచ్‌లోనూ అద్భుత క్యాచ్



సిడ్నీ : అసలైన క్రికెట్ మజా కేవలం పురుషుల క్రికెట్‌లోనే ఉంటుందనుకుంటే పొరపాటే... సంచలన ఇన్నింగ్స్‌లు నమోదు చేస్తూ... పురుషుల క్రికెట్‌లోనూ సాధ్యంకాని కొత్త రికార్డులను మహిళా క్రికెటర్లు సృష్టిస్తున్నారు. తాజాగా గెలుపును డిసైడ్ చేసే బంతిని బౌండరీ వద్ద కళ్లు చెదిరే రీతిలో డైవ్ చేస్తూ ఒడిసిపట్టుకున్న విధానం చూస్తే ముక్కున వేలేసుకోవాల్సిందే. ఈ అపురూప దృశ్యం మహిళల బిగ్‌బాష్ లీగ్‌లో బ్రిస్బేన్ హీట్, సిడ్నీ థండర్ జట్ల మధ్య జరిగిన తొలి సెమీఫైనల్ మ్యాచ్‌లో చోటు చేసుకుంది. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో సిడ్నీ జట్టు నాలుగు పరుగుల తేడాతో బ్రిస్బేన్‌పై గెలిచి ఫైనల్‌కు చేరుకుంది. క్యాచ్‌కు సంబంధించిన వీడియో ఐసీసీ తన అధికారిక ట్విటర్‌లో షేర్ చేసింది. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట్లో తెగ హల్‌చల్ చేస్తోంది. ఇక హైదీని ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేపట్టిన బ్రిస్బేన్ హీట్ నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 140 పరుగులు చేసింది. అనంతరం 141 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సిడ్నీ జట్టు ఆరంభం ఘనంగానే ప్రారంభించింది. అయితే బ్రిస్బేన్ పటిష్ట బౌలింగ్ ముందు సిడ్నీ మిడిలార్డర్ బ్యాట్స్‌వుమెన్ పరుగులు రాబట్టడానికి నానా తంటాలు పడ్డారు. దీంతో చివరి ఓవర్లో 13 పరుగుల చేస్తేనే సిడ్నీ జట్టు ఫైనల్‌కు చేరుకుంటుంది. బంతి బంతికి సమీకరణాలు మారిపోతున్నాయి. ఇక సిడ్నీ గెలువు సమీకరణాలు ఎలా ఉన్నాయంటే చివరి బంతికి ఫోర్ కొడితే డ్రా, ఐదు పరుగులు చేస్తే విజయం. ఈ సమయంలో జోనాసెన్ బౌలింగ్‌లో నికోలా కారే గాల్లోకి బంతిని బలంగా బాదింది.. అందరూ పక్కా సిక్సర్ అనుకున్న తరుణంలో మెరుపువేగంతో వచ్చిన హైదీ బిర్కెట్ కళ్లు చెదిరే రీతిలో డైవ్ చేస్తూ క్యాచ్ అందుకుంది. దీంతో గెలువు సంబరం బ్రిస్బేన్‌ను వరించగా.. ఓటమి బాధ సిడ్నీ జట్టుకు దక్కింది.

భారత్-ఆస్ట్రేలియా ఆఖరి వన్డేలో అద్భుత క్యాచ్‌లివే

మెల్‌బోర్న్ : ఆసీస్‌తో జరిగిన చివరి వన్డేలో టీమిండియా అన్ని విభాగాల్లోనూ రాణించి అద్భుత విజయం సాధించింది. ఆఖరి మ్యాచ్‌లో దక్కిన అవకాశాన్ని చాహల్ అద్భుతంగా ఉపయోగించుకున్నాడు. తన బౌలింగ్‌తో ఫించ్ సేనను ఉక్కిరి బిక్కిరి చేశాడు. ఫీల్డింగ్‌లోనూ టీమిండియా ఆటగాళ్లను తక్కువ అంచనా వేయలేం. రోహిత్, కేదార్ జాదవ్, భువి ఈ మ్యాచ్‌లో కళ్లు చెదిరే క్యాచ్‌లు పట్టి ఆసీస్ బ్యాట్స్‌మెన్‌ని పెవిలియన్ చేర్చారు. ఫించ్ సేనలో ఎవరెవరు ఎలా పెవిలియన్ చేరారంటే.. భువి కళ్లు చెదిరే క్యాచ్: మ్యాచ్ ప్రారంభంలో ఓపెనర్లను పెవిలియన్ చేర్చిన భువి.. తన డైవింగ్ క్యాచ్‌తో గ్లెన్ మాక్స్‌వెల్‌ను సైతం ఔట్ చేశాడు. షమీ వేసిన బంతిని భారీ షాట్ ఆడగా, బౌండరీ వద్ద భువి దాన్ని ఒడిసి పట్టుకున్నాడు. రోహిత్ అద్భుతః

30 ఓవర్లో స్టాయినిస్‌కు చాహల్ వేసిన బంతిని రోహిత్ అద్భుతమైన క్యాచ్ పట్టాడు. చాహల్ బంతిని అంచనా వేయలేని స్టాయినిస్ దాన్ని ఆడబోగా బ్యాటు అంచుకు తగిలి రోహిత్ చేతికి చిక్కింది. 43 ఓవర్లో రిచర్డ్‌సన్‌కు చాహల్ వేసిన బంతిని కేదార్ జాదవ్ అద్భుతమైన క్యాచ్ పట్టాడు. దీంతోపాటు షాన్ మార్ష్‌ను ధోనీ స్టంప్ ఔట్ చేసిన విధానం కూడా మ్యాచ్‌లో హైలైట్‌గా నిలిచింది.

మలేసియా టోర్నీలో ముగిసిన సైనా పోరు



కౌలాలంపూర్ : మలేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్ పోరాటం ముగిసింది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్‌లో స్పెయిన్‌కు చెందిన కరోలినా మారీన్ చేతిలో 16-21, 13-21తో సైనా ఓటమిపాలైంది. 40 నిమిషాల పాటు సాగిన ఈ గేమ్‌లో ప్రపంచ ఛాంపియన్ కరోలినా మారీన్ ఆధిపత్యాన్ని సైనా ఎదుర్కోలేకపోయింది. తొలి గేమ్‌లో ఒక దశలో 9-9తో మారీన్‌తో సమంగా ఉన్న సైనా.. ఆ తర్వాత తేలిపోయింది. 16-21తో సైనా తొలి గేమ్‌ను కోల్పోయింది. రెండో గేమ్‌లోనూ మారీన్ తన ఆధిపత్యాన్ని కొనసాగించడంతో సైనాకు ఓటమి తప్పలేదు. ఈ మ్యాచ్‌కు ముందు కరోలినా మారీన్‌తో సైనా 10 సార్లు తలపడగా.. చెరో ఐదుసార్లు విజయం సాధించారు. తాజాగా మారీన్ ఆ సంఖ్యను ఆరుకు పెంచుకుంది.

కోహ్లిపై ప్రశంసలు కురిపించిన అనుష్క

మెల్బోర్న్ : ఆస్ట్రేలియా గడ్డపై టీమిండియా చరిత్ర ష్టించింది. తిరుగులేని ఆటతో కంగారూలపై సంపూర్ణ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. శుక్రవారం జరిగిన చివరి వన్డేలో గెలిచి.. అన్ని సిరీస్‌ల్లోనూ అజేయంగా నిలిచింది. ఈ సందర్భంగా భారత ఆటగాళ్లపై క్రికెట్ అభిమానుల నుంచి ప్రముఖుల వరకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. టీమిండియా సారధి విరాట్ కోహ్లి సతీమణి, బాలీవుడ్ నటి అనుష్క శర్మ కూడా కోహ్లి సేనను పొగడ్తలతో ముంచెత్తారు. నిన్ను చూస్తుంటే గర్వంగా ఉంది మై లవ్ అంటూ భర్తను ప్రత్యేకంగా ప్రశంసించారు. మరువురాని, అద్భుతమైన పర్యటన ఇది. టీమిండియా చారిత్రక విజయాలను ప్రత్యక్షంగా చూసినందుకు ఎంతో ఆనందంగా ఉంది. జట్టులోని ప్రతి ఒక్కరికీ అభినందనలు. నిన్ను చూస్తుంటే చాలా గర్వంగా ఉంది మై లవ్ అని విరాట్ కోహ్లిని ట్యాగ్ చేస్తూ అనుష్క ట్వీట్ చేశారు. ఆస్ట్రేలియా పర్యటనలో టీ20లను 1-1తో సమం చేశాక టెస్టులను 2-1తో గెలిచి చరిత్ర సృష్టించిన కోహ్లిసేన.. అదే జోరు కొనసాగించి కంగారూల గడ్డపై తొలి ద్వైపాక్షిక వన్డే సిరీస్‌ను సొంతం చేసుకుంది. శుక్రవారం జరిగిన చివరి మ్యాచ్‌లో భారత్ 7 వికెట్ల తేడాతో జయభేరీ మోగించింది.

భారత మహిళల బాక్సింగ్ కోచ్‌గా ఖమర్



న్యూఢిల్లీ : ప్రతిష్టాత్మక కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్‌కు తొలి స్వర్ణాన్ని అందించిన కోల్‌కతా బాక్సర్ అలీఖమర్... జాతీయ మహిళల జట్టు చీఫ్ కోచ్‌గా ఎంపికయ్యాడు. సోమవారం రాత్రి అలీఖమర్‌ను కోచ్‌గా నియమిస్తున్నట్లు భారత బాక్సింగ్ సమాఖ్య (బీఎఫ్ఐ) ప్రకటించింది. ప్రస్తుత కోచ్ శివ్ సింగ్ స్థానంలో అలీ ఖమర్ బాధ్యతలు స్వీకరించనున్నాడు. 2002 మాంచెస్టర్ వేదికగా జరిగిన కామన్వెల్త్ గేమ్స్ లైట్ ఫ్లయ్ వెయిట్ కేటగిరీలో అలీ ఖమర్ స్వర్ణాన్ని గెలిచి చరిత్ర సృష్టించాడు. ఇతనికి జాతీయ బాక్సింగ్ క్యాంపులో అసిస్టెంట్ కోచ్‌గా ఏడాదికి పైగా పనిచేసిన అనుభవముంది. రైల్వే స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డ్ మహిళల జట్టుకు మూడేళ్ల పాటు తన సేవలందించాడు. అర్జున అవార్డు గ్రహీత అయిన అలీఖమర్... 38 ఏళ్ల వయస్సులోనే భారత జట్టుకు కోచ్‌గా వ్యవహరించనున్నాడు. ఇప్పటివరకు ఈ పని చేసిన వారిలో ఇతనే పిన్న వయస్కుడు. గతంలో కోచ్‌లుగా పనిచేసిన అనూప్ కుమార్, గుర్బక్ష్ సింగ్ సంధు 50 ఏళ్ల పైబడిన తరువాతే ఈ బాధ్యతలు స్వీకరించారు.

రోజర్ ఫెదరర్‌ను కలిసిన విరాట్



మెల్‌బోర్న్ : గ్రాండ్‌స్లామ్ వీరుడు రోజర్ ఫెదరర్‌ను టీమిండియా సారథి విరాట్ కోహ్లి, అతడి సతీమణి, బాలీవుడ్ నటి అనుష్కా శర్మ శనివారం కలిశారు. ప్రస్తుతం ఆస్ట్రేలియా ఓపెన్ జరుగుతుండటంతో కోహ్లి దంపతులు సైతం కాసేపు మ్యాచ్‌ను తిలకించారు. అక్కడే ఉన్న ఫెదరర్‌ను కోహ్లి, అనుష్క జోడీ కలిసింది. ఆయనతో మాట్లాడిన తర్వాత ఇద్దరూ ఫెదరర్‌తో కలిసి ఫొటో దిగారు. ఈఫొటోను కోహ్లి సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకున్నాడు. ఆస్ట్రేలియా ఓపెన్‌లో ఎలాంటి రోజిది!. ఆస్ట్రేలియాలో నా పర్యటనను అద్భుతంగా ముగించాను. ఇప్పుడు సంపూర్ణమైంది. ఈ పర్యటనను ఎప్పటికీ మర్చిపోను అని రోజర్‌తో దిగిన ఫొటోలను కోహ్లి పంచుకున్నాడు. టెన్నిస్‌లో ఫెదరర్ తన ఆరాధ్య దైవం అని ఇప్పటికే ఎన్నోసార్లు చెప్పుకొచ్చాడు. 2015 ఆస్ట్రేలియా ఓపెన్ సమయంలోనూ ఫెదరర్‌ను కోహ్లి కలిశాడు.

ఫెదరర్‌ను కలిస్తే... ఎవ్వరైనా దిగ్గజం అయిపోతారా

అనుష్కకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో విమర్శలు

బాలీవుడ్ నటి, టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి సతీమణి అనుష్కశర్మపై నెటిజన్లు వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. ఆస్ట్రేలియా ఓపెన్ తన అధికారిక ట్విటర్‌లో షేర్ చేసిన ఓ ఫొటోనే ఈ ట్రోలింగ్‌కు కారణమైంది. శుక్రవారం ఆస్ట్రేలియాతో మెల్‌బోర్న్ వేదికగా జరిగిన సిరీస్ నిర్ణయాత్మ మ్యాచ్‌లో భారత్ విజయం సాధించి మూడు వన్డేల సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ గెలువుతో ఆసీస్ పర్యటనను ఘనంగా ముగించిన భారత ఆటగాళ్లు ఈ విన్నింగ్ మూమెంట్‌ను అక్కడే గడువుతూ ఆస్వాదిస్తున్నారు. ఇక కెప్టెన్ విరాట్ కోహ్లి తన సతీమణి అనుష్కతో చెట్టాపట్టాలేసుకొని తిరుగుతున్నాడు. శనివారం ఆస్ట్రేలియా ఓపెన్ జరుగుతున్న మెల్‌బోర్న్ పార్క్‌ను విరుష్కా సందర్శించింది. ఈ సందర్భంగా ఈ జోడి టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెదరర్‌ను కలిసి ఫొటోలకు ఫోజిచ్చింది. ఈ ఫొటోను యూఎస్ ఓపెన్ ముగ్గురు దిగ్గజాలు.. ఒక్క ఫొటో అనే క్యాప్షన్‌తో ట్వీట్ చేసింది. ఇది చూసిన అభిమానులకు చిర్రెత్తుకొచ్చింది. ఇంకేముంది సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు అనుష్కను ఓ ఆట ఆడుకున్నారు. కోహ్లి, ఫెదరర్ సరసన ఉన్న అనుష్క దిగ్గజమా? మీరే చెప్పాలి.. కోహ్లి, ఫెదరర్! అంటూ ఒకరు, ఓహో.. ఫెదరర్‌ను కలిస్తే లెజెండ్ అవుతామన్నమాట! అయితే నేను కూడా కలుస్తా! అని మరొకరు సెటైరిక్‌గా కామెంట్ చేస్తున్నారు. ఇంకొందరైతే యూఎస్ ఓపెన్ అధికారులకు మతి దొబ్బినట్టుంది.. లేకుంటే అనుష్క లెజెండ్ ఏంటని ఘాటుగా కామెంట్ చేస్తున్నారు.

ఆసక్తికరంగా సాగుతున్న... ఆ ఇద్దరి వివాదం

- పాండ్యా, రాహుల్‌ల వివాదంలో కరణ్‌కు బాధ్యత లేదా?
- వివాదస్పద క్రికెటర్ శ్రీశాంత్ వ్యాఖ్యలు



ముంబై : మహిళల పట్ల అసభ్యకర వ్యాఖ్యలతో సస్పెన్షన్‌కు గురైన టీమిండియా క్రికెటర్లు హార్దిక్ పాండ్యా, కేఎల్ రాహుల్‌లను వివాదస్పద క్రికెటర్, బిగబాస్ సీజన్ 12 రన్నరప్ శ్రీశాంత్ మరోసారి వెనకేసుకొచ్చాడు. పెద్ద దుమారం రేపిన ఈ వివాదంలో బాలీవుడ్ దర్శక నిర్మాత కరణ్ జోహర్‌కు బాధ్యత లేదా? అని ఈ క్రికెటర్ కమ్ యాక్టర్ ప్రశ్నించారు. ఈ వివాదానికి మూల కారణం కరణేనని అభిప్రాయపడ్డాడు. ఓ టీవీ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. క్రికెటర్లు సోయి మరిచి తప్పుగా మాట్లాడితే.. షో హోస్ట్ కరణ్‌కు ఏమైంది? వారు తప్పు మాట్లాడుతుంటే టీవీ హోస్ట్‌గా అడ్డుకోవాల్సిన బాధ్యత అతనిపై లేదా? అతను కచ్చితంగా అడ్డుకోవాల్సింది. ఈ వివాదానికి మూల కారణం కరణ్ జోహరే. అతను అడిగిన పిచ్చి ప్రశ్నల వల్లే క్రికెటర్లు నోరు జారారు. ఈ వివాదంలో కరణ్ కూడా భాగస్వామియే. అని శ్రీశాంత్ మండిపడ్డాడు. ఈ యువ క్రికెటర్లపై దేశవ్యాప్తంగా విమర్శలు వ్యక్తమవుతున్న సందర్భంలో కూడా శ్రీశాంత్ మద్దతు పలికాడు. వారు మాట్లాడింది తప్పేనని, కానీ దాన్ని ఇంత వివాదం చేయడం సరికాదని అభిప్రాయపడ్డాడు. ఇంత కంటే పెద్ద తప్పులు చేసిన వారు స్వేచ్ఛగా క్రికెట్ ఆడుతున్నారని, వారిపై ఎలాంటి చర్యలు లేవని చెప్పుకొచ్చాడు. ఇలాంటి తప్పులు జరగడం సహజమని, కేవలం క్రికెట్‌లోనే కాకుండా అన్ని రంగాల్లో ఇలాంటివి చోటుచేసుకుంటాయని ఈ యువ ఆటగాళ్లను శ్రీశాంత్ వెనకేసుకొచ్చిన విషయం తెలిసిందే. నిషేధం కారణంగా ఇప్పటికే ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌తో పరిమిత ఓవర్ల సిరీస్‌కు దూరమైన పాండ్యా, రాహుల్‌లు మళ్లీ ఎప్పుడు క్రికెట్‌లో అడుగు పెడతారో చెప్పలేని పరిస్థితి నెలకొంది. బీసీసీఐ నియమావళి ప్రకారం ఆటగాళ్లపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే తుది అధికారం బోర్డు నియమించిన అంబుడ్స్‌మన్‌కే ఉంది. ఇద్దరు క్రికెటర్లపై విచారణ అనంతరం బీసీసీఐ సీఈఓ రాహుల్ జోహ్రి కూడా తన నివేదికను అంబుడ్స్‌మన్‌కే ఇవ్వాలి. అయితే ఇప్పటికిప్పుడు అంబుడ్స్‌మన్‌ను నియమించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అంబుడ్స్‌మన్‌ను నియమించే అధికారం కేవలం బోర్డుకే ఉందని...అది ఎన్నికలు నిర్వహించి కార్యవర్గం ఏర్పడిన తర్వాత మాత్రమే సాధ్యమని తెలిపింది. దీంతో పాండ్యా, రాహుల్‌ల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.

బయటకు వచ్చిన పాండ్యా!

మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసి సస్పెన్షన్‌కు గురైన టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ముంబై ఎయిర్ పోర్ట్‌లో కనిపించాడు. సోదరుడు కృనాల్ పాండ్యాతో ఎయిర్‌పోర్ట్‌కు వచ్చిన ఈ ఆల్‌రౌండర్‌కు సంబంధించిన ఫొటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. పాండ్యాతో పాటు సస్పెన్షన్ గురైన కేఎల్ రాహుల్ కూడా ఆస్ట్రేలియా నుంచి అర్ధాంతరంగా తిరుగొచ్చిన విషయం తెలిసిందే. అయితే ఇంటికి చేరుకున్న పాండ్యా గదిలో నుంచి బయకు రావడం లేదని, ఎవరు ఫోన్ చేసినా స్పందించడం లేదని, అతని తండ్రి హిమాన్షు మీడియాకు తెలిపిన విషయం తెలిసిదే. ఈ నేపథ్యంలో హార్దిక్ ముంబై ఎయిర్‌పోర్ట్‌లో దర్శనమివ్వడం చర్చనీయాంశమైంది. కరణ్ షోలో చేసిన తన వ్యాఖ్యల పట్ల పాండ్యా తీవ్రంగా కుమిలిపోతున్నాడని, బీసీసీఐ సస్పెన్షన్‌తో తీవ్రంగా బాధపడుతున్నాడని అతని తండ్రి మీడియాతో తెలిపారు. తాము కూడా ఈ విషయం గురించి అతనితో మాట్లాడదలుచుకోలేదని, తన సోదరుడు కృనాల్ సైతం ఈ ఎపిసోడ్ వ్యవహారంపై హార్దిక్‌తో మాట్లాడలేదని చెప్పుకొచ్చారు. కేవలం బీసీసీఐ తీసుకోబోయే నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నామని తెలిపారు. నిషేధం కారణంగా ఇప్పటికే ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌తో పరిమిత ఓవర్ల సిరీస్‌కు దూరమైన వీరిద్దరు మళ్లీ ఎప్పుడు క్రికెట్‌లో అడుగు పెడతారో చెప్పలేని పరిస్థితి నెలకొంది. బీసీసీఐ నియమావళి ప్రకారం ఆటగాళ్లపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే తుది అధికారం బోర్డు నియమించిన అంబుడ్స్‌మన్‌కే ఉంది. ఇద్దరు క్రికెటర్లపై విచారణ అనంతరం బీసీసీఐ సీఈఓ రాహుల్ జోహ్రి కూడా తన నివేదికను అంబుడ్స్‌మన్‌కే ఇవ్వాలి. అయితే ఇప్పటికిప్పుడు అంబుడ్స్‌మన్‌ను నియమించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అంబుడ్స్‌మన్‌ను నియమించే అధికారం కేవలం బోర్డుకే ఉందని...అది ఎన్నికలు నిర్వహించి కార్యవర్గం ఏర్పడిన తర్వాత మాత్రమే సాధ్యమని తెలిపింది. దీంతో పాండ్యా, రాహుల్‌భవిష్యత్తు అగమ్యగోచరంగా తయారైంది. మరోవైపు తప్పులు చేయడం మానవ సహజమని టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ పాండ్యా, రాహుల్‌లకు మద్దతు తెలిపారు. ఈ వ్యవహారంతో వారి కెరీర్ దెబ్బతినేలా చర్యలు తీసుకోవడం మంచిది కాదని అభిప్రాయపడ్డారు. ఒళ్లు మరిచి చేసిన వ్యాఖ్యలతో పాండ్యా ఇప్పటికే తీవ్రంగా నష్టపోయాడు. సోషల్‌మీడియాలో పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో జిల్లేట్ సంస్థ పాండ్యాతో చేసుకున్న ఒప్పందాన్ని విరమించుకుంది. అంతేకాకుండా ముంబైలో ప్రతిష్టాత్మక క్లబ్ అయిన ఖర్ జింఖానాలో గౌరవ సభ్యత్వాన్ని కూడా పాండ్యా కోల్పోయాడు.

ఆ ఇద్దరు క్రికెటర్లపై నిషేధం ఎత్తేయండి : బీసీసీఐ ఛీఫ్



ముంబై : టీమిండియా యువ క్రికెటర్లు హార్దిక్ పాండ్యా, కేఎల్ రాహుల్‌లపై నిషేధం ఎత్తేయాలని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) తాత్కాలిక అధ్యక్షుడు సీకే ఖన్నా సుప్రీం కోర్టు నియమిత పరిపాలకుల కమిటీ (సీఓఏ)ని కోరారు. ఈ మేరకు ఆయన శనివారం సీఓఏకు లేఖ రాశారు. పాండ్య, రాహుల్ వివాదంపై ప్రస్తుత పరిస్థితుల్లో ప్రత్యేక జనరల్ సమావేశం జరపలేమని స్పష్టం చేశారు. పాండ్యా, రాహుల్‌లు తప్పు చేశారు. ఇప్పటికే వారిపై నిషేధం విధించి ఆస్ట్రేలియా పర్యటన నుంచి అర్ధాంతరంగా రప్పించాం. ఇద్దరు ఆటగాళ్లు వారి వ్యాఖ్యల పట్ల బేషరతు క్షమాపణలు చెప్పారు. కావున విచారణ పూర్తేయ్యే వరకు వారిపై నిషేధం ఎత్తేసి జట్టులోకి తీసుకోవాలి. అలాగే న్యూజిలాండ్‌తో జరిగే సిరీస్‌లో ఆడించాలి అని సీకే ఖన్నా లేఖలో కోరారు. బీసీసీఐ నియమావళి ప్రకారం ఆటగాళ్లపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే తుది అధికారం బోర్డు నియమించిన అంబుడ్స్‌మన్‌కే ఉంది. ఇద్దరు క్రికెటర్లపై విచారణ అనంతరం బీసీసీఐ సీఈఓ రాహుల్ జోహ్రి కూడా తన నివేదికను అంబుడ్స్‌మన్‌కే ఇవ్వాలి. అయితే ఇప్పటికిప్పుడు అంబుడ్స్‌మన్‌ను నియమించేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. అంబుడ్స్‌మన్‌ను నియమించే అధికారం కేవలం బోర్డుకే ఉందని...అది ఎన్నికలు నిర్వహించి కార్యవర్గం ఏర్పడిన తర్వాత మాత్రమే సాధ్యమని బీసీసీఐ సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియా వాదించడంతో ఈ కేసును వాయిదా వేసింది. వారం రోజుల తర్వాత వాదనలు వింటామని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో అప్పటి వరకు ఆటగాళ్లపై సస్పెన్షన్ కొనసాగిచండం సరైందరి కాదని ఖన్నా అభిప్రాయపడ్డారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని సీఓఏ, బీసీసీఐ ఆఫీస్ బేరర్స్‌కు సైతం విజ్ఞప్తి చేశారు. పాండ్యా, రాహుల్‌లు మాట్లాడింది ముమ్మాటికి తప్పేనని, కానీ వారి పట్ల ఇంత కఠినంగా వ్యవహరించడం సరికాదని అభిప్రాయపడ్డాడు. ప్రపంచకప్ ముందు ఇద్దరి ఆటగాళ్లు ప్రాక్టీస్ అవసరమని, ఈ యువ ఆటగాళ్ల తప్పును క్షమించి ఓ అవకాశం ఇద్దామని కోరారు. బాలీవుడ్ దర్శక నిర్మాత కరణ్ జోహర్ వ్యాఖ్యాతగా వ్యవహరించిన కాఫీ విత్ కరణ్ టీవీ షోలో పాండ్యా, రాహుల్ ఇద్దరు అశ్లీల రీతిలో మహిళల్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేసి సస్పెన్షన్‌కు గురైన విషయం తెలిసిందే. ఈ షోలో పాండ్యా మాట్లాడుతూ అమ్మాయిల విషయంలో నేనేమీ బుద్ధిమంతుడ్ని కాదు. వాళ్లను అదోటైపుగా చూస్తా. క్లబ్‌లలో వారి ఒంపుసొంపులపై కైవుగా కన్నేస్తా. ఎవరైనా అమ్మాయిని శారీరకంగా కలిస్తే ఆజ్ మై కర్ కే ఆయా (నేను ఈ రోజు ...ఆ పని చేసొచ్చా) అని తల్లిదండ్రులతో చెప్పేస్తా అని ఒళ్లు మరిచి వ్యాఖ్యానించాడు.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2-293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO 22, DOOR NO.8-2- 293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS HYDERABAD-33, TELANGANA. PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2- 293/82/A/22,ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044·